fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 26 | విజయవాడ, శనివారం 27 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



ఘనంగా గణతంత్రం

- అతిథులుగా పది ఆసియన్ దేశాల నేతలు
- ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన
- పెరేడ్‌లో కనిపించని తెలుగు రాష్ట్రాల శకటాలు
- భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన ప్రధాని మోడీ
- రాహుల్‌కు ఆరో వరుసలో సీటు కేటాయింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్‌పథ్‌లో 69వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్‌డి దేవెగౌడతో సహా పలువురు ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆసియన్ కూటమిలో సభ్యదేశాలైన బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, థాయిలాండ్, సింగపూర్, వియత్నాం దేశాల అధినేతలు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ అమర్ జవాన్ జ్యోతి వద్ద సైనిక వీరులకు నివాళులర్పించారు. దివంగతులైన ఎయిర్ ఫోర్స్ కమాండో జెపి నీరాలా భార్య, ఆయన తల్లి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అశోక చక్ర అవార్డును అందుకున్నారు. వేడుకల్లో సైనిక దళాల పరేడ్ ఆకట్టుకుంది. త్రివిధ దళాలు తమ సత్తా చాటాయి. టీ90 యుద్ధ ట్యాంకర్ల ప్రదర్శనతో మిగతా 3లో

ప్రభుత్వ పత్రాలతో మరిన్ని అనుమానాలు

- జస్టిస్ లోయా మృతి కేసులో మరో మలుపు
- ఇసిజి తీయలేదు.. న్యూరో సర్జరీ చేశారు

8

రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి

- 80 శాతం ప్రజల్లో సంతోషం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్

2

రండి... పెట్టుబడులు పెట్టండి

- తీవ్రవాదాన్ని తరిమికొట్టడంలో పరస్పర సహకారం
- దావోస్ సమావేశాల్లో ట్రంప్ పిలుపు

9

రూ. 1.20 లక్షల కోట్లు ఏమయ్యాయి..?

- ఇప్పటికే అప్పులు రూ.2.16 లక్షల కోట్లు
- పిఎసి లెక్కలతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన అప్పులు సుమారు రూ.1.20 లక్షల కోట్లు ఏమయ్యాయనే అంశం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల పబ్లిక్ అకౌంట్స్ (పిఎసి) కమిటీ జరిపిన చర్చలో ఈ వ్యవహారం ముందుకు కొచ్చింది. దీంతో ఆర్థిక వేత్తలు విస్తు పోతున్నారు. రాష్ట్రంలో పట్టిసీమ, తాత్కాలిక సచివాలయం మాత్రమే పూర్తయ్యాయి. జల వనరులశాఖలో పలు ప్రాజెక్టుల పనులు మాత్రమే అవుతున్నాయి. వీటిల్లో కూడా ఇపిసి కింద కేటాయించిన ప్రాజెక్టులకు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత అంచనాలు పెంచారు. ఇన్ని లక్షల కోట్లు ఖర్చు చేసినా చెప్పుకోదగ్గ ప్రాజెక్టు ఒక్కటీ రాష్ట్రంలో లేదని పిఎసి ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టిసీమ, తాత్కాలిక సచివాలయం మినహా తప్ప చెప్పుకోదగ్గవి ఏమిటో ప్రభుత్వం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పోలవరం పూర్తయితే రూ.1600 కోట్లు వెచ్చించి పూర్తి చేసిన మిగతా 9లో

ద.కొరియా ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

- 37 మంది సజీవ దహనం, 113 మందికి గాయాలు
- 18 మంది పరిస్థితి విషమం

8

రైల్వే ప్రైవేటీకరణకు పరుగులు

బడ్జెట్ కేటాయింపుల్లో 27 శాతం కోత



న్యూఢిల్లీ : రైల్వేలను మరింతగా ప్రయివేటుకు దారాదత్తం చేసే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం వ్యూహం పన్నుతోంది. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపుల్లో రైల్వే రంగానికి 27 శాతం మేర కోత విధించడం ద్వారా ప్రయివేటీకరణను పరుగుపెట్టేంచేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసినట్లు కనిపిస్తోంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి భారత రైల్వేలకు అందించే స్థూల బడ్జెట్ కేటాయింపుల (జిబిఎస్)ను రు.15వేల కోట్ల మేరకు తగ్గించారు. రైల్వేల కోసం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కేటాయించిన బడ్జెట్ తోడ్పాటు రు.55వేల కోట్లు. అయితే, దీన్ని తగ్గించనున్నారు. సవరించిన అంచనాల ప్రకారం ఇది రు.45 వేల కోట్లు వుండొచ్చు. అంటే మొత్తంగా బడ్జెట్‌లో 27 శాతం కోత విధించినట్లు సమాచారం. అయితే కేటాయించిన మొత్తంలో మరో రు.10 వేల కోట్లు కోత విధించే అవకాశాలు వున్నాయని తెలుస్తోంది. అంటే రైల్వే బడ్జెట్ రు.30 వేల కోట్లకు తగ్గిపోనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ కేటాయింపు కుదించబడుతుందంటూ వివిధ విభాగాలకు కేంద్రం ఇప్పటికే తెలియచేసిందని మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఆదాయ కొరతను ఎదుర్కొనే పేరుతో ఆస్తులను విక్రయించడం, మార్కెట్ రుణాలు, వ్యవస్థాగత ఫైనాన్సింగ్ వంటి విధానాలతో రైల్వే రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించే దిశలో కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తులను విక్రయించడం ద్వారానే రు.30 వేల కోట్లు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రమాదంలో రైల్వేల భద్రత : డిఆర్ఇయు

రైల్వేలను ప్రయివేటుకు దారాదత్తం చేస్తే రైల్వేల వ్యవస్థతో పాటు, ప్రయాణికుల భద్రత కూడా ప్రమాదంలో పడతాయని సిఐటియు అనుబంధ దక్షిణ్ రైల్వే ఉద్యోగుల సంఘం (డిఆర్ఇయు) ఉపాధ్యక్షులు ఆర్.ఎలన్‌గోవన్ తెలిపారు. ఇప్పటికే 400కి పైగా స్టేషన్లను ఆధునీకరణ పేరిట కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు రైల్వే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రయివేటీకరణ ద్వారా కనీసం రూ.లక్ష కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకొని రైల్వే భూములను కార్పొరేట్లకు లీజుకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తొలుత 45 ఏళ్ళ వరకు లీజుకు ఇస్తామని చెప్పిన మిగతా 9లో

త్రిపుర ఎన్నికలకు సంఘీభావ నిధి సేకరించండి

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్ర సిపిఎం శాఖకు సంఘీభావ నిధి సేకరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేట్ల ధనంతో ఎన్నికల్లో దిగుతున్న బిజెపిని ఎదుర్కొనేందుకు త్రిపుర సిపిఎం పార్టీకి సహాయంగా విరాళాలు సేకరించాలని మధు విజ్ఞప్తి చేశారు. త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష ప్రభుత్వాన్ని అస్థిరపర్చడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలను, గిరిజన, గిరిజనేతరుల ఐక్యతను కాపాడుతూ సిపిఎం నాయకత్వాన వామపక్ష ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోందని వివరించారు. అక్కడ అల్లర్లు సృష్టించడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రయత్నం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు దేశభక్తిపరులమని చెప్పుకుంటున్న కాషాయదళం ఉగ్రవాద సంస్థలతో సైతం పొత్తు పెట్టుకుంటోందని వివరించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ నాయకత్వాన సాగే కుట్రలను ప్రజల సహకారంతో త్రిపుర వామపక్ష ప్రభుత్వం తిప్పి కొడుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మతోన్మాదులను, వేర్పాటువాదులను తిప్పికొట్టడానికి వామపక్ష ప్రభుత్వానికి అండగా నిలవాలని వామపక్ష, ప్రజాతంత్రవాదులకు మిగతా 9లో

కొత్త రేషన్ కార్డులకు కొర్రీ..!

నాలుగు లక్షలకు పైగా అర్జీల తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషన్‌కార్డుల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపించింది. ఇప్పటి వరకు ఉమ్మడి కుటుంబంలో ఉండి వివాహాలైన తర్వాత కొత్తగా రేషన్ కార్డులు (స్ప్లిట్ కార్డులు) కోసం దరఖాస్తు చేసుకున్నవారు 4,11,876 మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివాహాలై ఏళ్ల తరబడి వేరే కుటుంబంగా ఉన్న వారికీ రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. ఒక కుటుంబం నుంచి విడదీసి అంటే కోటా కార్డులో తొలగించి, వేరేగా కాపురముంటున్న కుటుంబానికి రేషన్‌కార్డు ఇస్తే ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారమూ ఉండదు. అయినా ఆకార్డులూ ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ఇప్పటికే ప్రజాసాధికారత సర్వేలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల రేషన్ కార్డులను ప్రభుత్వం తొలగించింది. తర్వాత ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో వాటికి మళ్లీ రేషన్ ఇస్తున్నారు. ఇప్పుడు ఉమ్మడి కార్డుల్లో నుంచి విభజించాలని కొత్తగా పెట్టుకున్న దరఖాస్తులను కూడా ప్రభుత్వం తిరస్కరించింది. ఉమ్మడిగా ఉన్న కార్డులను అసలు విభజించ వద్దని సందేశాలు రావడంతోనే పౌర సరఫరాలశాఖ ఈ నిర్ణయం తీసుకొంది. ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చించారు. విభజన కార్డుల వల్ల తమకు ప్రజల నుంచి ఒత్తిడి వస్తోందని ఒక మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సిఎం చంద్రబాబు ఉమ్మడి కుటుంబాల కార్డులను అలాగే కొనసాగించాలని, విభజించవద్దని ఆదేశించారు. దీంతో మంత్రి దీనిపై మాట్లాడేందుకు కూడా సాహసం చేయలేకపోయారు. ఉమ్మడి కార్డులను విభజిస్తే ప్రభుత్వ అందించే వ్యక్తిగత రుణాలతోపాటు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి వస్తుందనే భావనలో ప్రభుత్వం ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల వారీగా తిరస్కరించిన అర్జీలు

జిల్లా	తిరస్కరించిన అర్జీలు
చిత్తూరు	49328
కడప	19712
కృష్ణా	37585
గుంటూరు	44013
పశ్చిమగోదావరి	32592
అనంతపురం	46155
శ్రీకాకుళం	23796
విజయనగరం	14419
నెల్లూరు	17361
ప్రకాశం	24696
కర్నూలు	23675
తూర్పుగోదావరి	53837
విశాఖపట్నం	24707
మొత్తం	4,11,876

కర్ణిసేన చీఫ్ సూరజ్ అరెస్టు



గుర్‌గావ్ : పద్మావత్ చిత్ర విడుదలకు అడ్డం పడుతూ హింసాకాండ జరిగేలా రెచ్చగొట్టినందుకు కర్ణిసేన జాతీయ కార్యదర్శి సూరజ్ పాల్ అమును శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. గురువారమే సూరజ్‌పాల్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన అధికారులు నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారన్న అభియోగాలపై ఆయను అరెస్టు చేశామని శుక్రవారం ఉదయం ప్రకటించారు. నాలుగు రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని గుర్‌గావ్ పోలీసు పిఆర్‌ఓ రవీందర్ కుమార్ తెలిపారు. పద్మావత్ చిత్రంలో చరిత్రను వక్రీకరించారని పేర్కొంటూ ఆ చిత్ర ప్రదర్శనను అడ్డుకోవడానికి కర్ణిసేన ఆధ్వర్యంలో ఆరు రాష్ట్రాల్లో అల్లర్లు, ఘర్షణలు జరిగాయి. బుధవారం గురుగావ్‌లో స్కూలు బస్సుపై దాడిచేశారు. అయితే ఎఫ్ఐఆర్‌లో మాత్రం పోలీసులు కర్ణిసేన పేరును ప్రస్తావించలేదు. ప్రస్తుతం గుర్‌గావ్‌లో పరిస్థితి అదుపులో వుంది. వదంతులను నమ్మవద్దని నగర పాలనా యంత్రాంగం ప్రజలను కోరింది. నిషేధాజ్ఞాలను పాటించాల్సిందిగా ఆదేశించింది. అంతకుముందు నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన 31మంది ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు కుమార్ తెలిపారు.

నేడు పాఠశాలల్లో సూర్యారాధన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో సూర్య ఆరాధాన నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరిక మేరకు ఈ నెల 27(శనివారం) తప్పనిసరిగా చేపట్టాలని చేపట్టాలని కమిషనర్ కె సంధ్యారాణి గురువారం మెమో జారీ చేశారు.

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

ఈ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. లాంటి కార్యక్రమాలు ఆధ్యాత్మిక సమాజం వైపు తీసుకుళ్లే దిశగా ఉన్నాయని యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. మత భావాలు ప్రేరేపించే విధంగా రెచ్చగొట్టిన్నట్లు ఉంటుందని తెలిపారు. సూర్యుని గొప్పతనం పాఠల్లో ఇప్పటికే ఉందని తెలిపారు. విద్యాశాఖ విడుదల చేసిన ఈ ఉత్తర్వులను ఉప సంహరించుకోవాలని మూల్‌నివాసీ బహుజన టీచర్స్ సంఘ్ డిమాండ్ చేసింది.

రాజ్‌భవన్ విందు

రిపబ్లిక్ డే సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్‌హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న రెండు తెలుగు రాష్ట్రాల నేతలు



రాజ్‌భవన్‌లో ఎట్ హోం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గణతంత్ర దినోత్సవ సందర్భంగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, డిప్యూటీ సిఎమ్‌లు కెఇ కృష్ణమూర్తి, ఎన్ చినరాజప్ప, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాస్, వైసిపి నుంచి మండలి విపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నుంచి ఎంపి సుబ్బిరామిరెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ చక్రపాణి, తమిళనాడు మాజీ గవర్నర్ కె రోశయ్య, మాజీ ఎంపి యలమంచిలి శివాజీ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి కెసిఆర్, స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ దంపతులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల మంత్రుల ఆప్యాయ పలకరింపులతో సందడిగా కనిపించింది. ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎట్ హోం కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. కాగా కాంగ్రెస్ తెలంగాణ శాఖ ఎట్‌హోం కార్యక్రమాన్ని బహిష్కరించింది.

కోస్తాలో పొగమంచు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

కోస్తాలో అక్కడక్కడా శనివారం పొగ మంచు కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం నుండి కోస్తా, రాయలసీమల్లో సాధారణ పరిస్థితులే కొనసాగు తాయని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుండి ఉత్తర అండమాన్ వరకు అల్పపీడన ద్రోణి, ఆవర్తనం కొనసాగుతున్నాయని భారత వాతావరణ శాఖ పేర్కొంది. శుక్రవారం కోస్తాలో పాక్షిక మేఘావృతం కొనసాగింది.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. 2018 పద్మవిభూషణ్‌కు ఎంపికైన సంగీత దర్శకుడు?
2. ఫిక్కీ నూతన చైర్మన్ ?
3. తొలిసారిగా కచరా మహోత్సవం 2018ను ఏ రాష్ట్రంలో నిర్వహించారు?
4. జాతీయ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో జాతీయ రికార్డు నెలకొల్పింది?
5. జాతీయ బాలికా దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?

అదీ.. నాటి న్యాయ స్ఫూర్తి..!

హైకోర్టు తాత్కాలిక సిజె రమేష్ రంగనాథన్

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన కొత్తలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎవరుండాలో సాక్షాత్తు ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదన చేశారని, అయితే అప్పటి న్యాయమూర్తుల న్యాయ స్ఫూర్తితో సున్నితమైన ఆ వ్యవహారానికి తెరపడిందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) రమేష్ రంగనాథన్ చెప్పారు. జనవరి 1954లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పతంజలి శాస్త్రి పదవీ విరమణ చేశారని, ఆ పదవిని చేపట్టాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న బీకే ముఖర్జీని ప్రధాని నెహ్రూ కోరారని, తన కంటే సీనియర్ న్యాయమూర్తులు ఉన్నందున సీజేగా బాధ్యతలు చేపట్టబోనని ముఖర్జీ చెప్పారని ఏసీజే గుర్తు చేశారు. శుక్రవారం హైకోర్టు ఆవరణలో జరిగిన 69వ గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగుంవేసిన అనంతరం ప్రసంగించారు. సీనియార్టీ ప్రకారం ముఖర్జీ నాలుగో ప్రధాన న్యాయ మూర్తిగా బాధ్యతలు నిర్వహించారని ఏసీజే తెలిపారు. అనంతరం తెలుగు రాష్ట్రాల అడ్వకేట్ జనరల్స్ శ్రీనివాస్, ప్రకాష్‌రెడ్డిలు మాట్లా డారు. ఏపీలో అన్ని శాశ్వత ఏర్పాట్లు చేశాకే హైకోర్టును తరలించాలని హైకోర్టు న్యాయవాదుల ఏపీ సంఘం అధ్యక్షుడు చల్లా ధనుంజయ్ కోరారు.

రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి

- 80 శాతం ప్రజల్లో సంతోషం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన కష్టాలను సమర్ధంగా ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన 69వ గణతంత్ర దినోత్సవంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. పోలీస్ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో 80 శాతం ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అవినీతి నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన 1100 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా సాధారణ ప్రజలూ ప్రభుత్వంతో అనుసంధానమై సమస్యలను పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. 190 రోజుల్లో రికార్డు స్థాయిలో తాత్కాలిక అసెంబ్లీ, సచివాలయాన్ని పూర్తి చేశామన్నారు. పట్టిసీమ ద్వారా గత రెండేళ్లుగా ఖరీఫ్ పంటను కాపాడుతున్నట్లు వెల్లడించారు. 2019కి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు. బిసిలకు నష్ట కలగకుండా కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. అదే విధంగా బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని కోరామన్నారు. రాష్ట్రంలో పేదరికానికి దిగువనున్న 1.42 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కల్పిస్తున్నామని వివరించారు. ఈ ఏడాది కొత్తగా విజయవాడలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన చంద్రన్న విలేజ్ మాల్స్ రాష్ట్ర మంతటా విస్తరిస్తామన్నారు. ఈఏడాది మార్చికి రాష్ట్రాన్ని ఒడిఎఫ్‌గా చేస్తామన్నారు. ఇప్పటి వరకు రూ.7,621 కోట్ల వ్యయంతో 10,270 కిలోమీటర్ల రోడ్లు, 165 వంతెనలు నిర్మించినట్లు తెలిపారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ ద్వారా ఉత్పాదకత పెంచుతున్నట్లు వివరించారు.

ఇండియన్ ఆర్మీకి ప్రథమ బహుమతి

కవాతులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఇండియన్ ఆర్మీ గ్రూప్, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థుల గ్రూప్‌లకు మొదటి విభాగంలో అవార్డులు వచ్చాయి. రెండో విభాగంలో కాకినాడ ఎపిఎస్పీ 16 బెటాలియన్, ఎన్‌సిసి బాలికల గ్రూప్‌ల కమాండర్లు అవార్డులు అవార్డులు అందుకున్నారు. 13 శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యాశాఖకు చెందిన సర్వశిక్షా అభియాన్ శకటానికి ప్రథమ బహుమతి, గృహనిర్మాణ శాఖకు రెండో బహుమతి, అటవీశాఖ శకటానికి మూడో బహుమతి లభించాయి.

రిపబ్లిక్ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ పాట..!

సాధికార మిత్ర శకటం వచ్చే సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కదలిరండి కదలిరండి తెలుగుదేశం కార్యకర్తలారా... త్యాగాలకు వెనుదీయని దేశ భక్తులారా అనే పాట వేయడం చర్చానీయాంశమైంది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో రాజకీయ పార్టీ పాటలతో శకటాలను ప్రదర్శించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

సిఎం గైర్హాజరు..!

దావోస్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు గణతంత్ర వేడుకలకు గైర్హాజరయ్యారు. అబుదాబీ నుంచి శుక్రవారం ఉదయమే విజయవాడ రావాల్సి ఉన్నా పొగ మంచు కారణంగా ప్రయాణం వాయిదా పడింది. సిఎం భార్య భువనేశ్వరితో పాటు మనవడు దేవాన్ష్ గణతంత్ర దినోత్సవానికి హాజర య్యారు. ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్

దళితుల అభివృద్ధికి అండగా ఉంటా

- దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేంత వరకూ అండగా ఉంటానని టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమాన్ని ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రిపబ్లిక్ డే రోజున ఈ కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జగజ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. బాలయోగిని లోక్‌సభ స్పీకర్ పదవికి ఎంపిక చేశామన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూసేసిన హీన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా ఎస్సీలకు ఒరిగిందేమీ లేదన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చంద్రన్న పెళ్లికానుక ద్వారా రూ. 40 వేలు సహాయం అందిస్తామని తెలిపారు. త్వరలో బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తామన్నారు. రాజధానిలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళిత విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవడానికి సహాయం చేస్తామన్నారు. వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. మంత్రి నక్కా ఆనంద్ బాబు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ వర్ల రామయ్య, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే రైలు దీక్ష : కొణతాల

ప్రజాశక్తి-సీతమ్మధార(విశాఖ)

విభజన హామీలను అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే రైలు దీక్ష చేపట్టనున్నట్లు మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ వెల్లడించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, విశాఖకు రైల్వేజోన్‌తో పాటు గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాల స్థాపన వంటి హామీలను అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

- ఐదుగురు మృతి
- ఆరుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల(పశ్చిమగోదావరి)

ఆర్‌టిసి బస్సును లారీ ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో ఎర్రకాలువ వంతెన మలుపు వద్ద శుక్రవారం జరిగింది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తునిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, నిడదవోలు మసీదువీధిలో ఉంటున్న జ్యోతి తల్లి లక్ష్మితో కలిసి శుక్రవారం ఉదయం ద్వారకా తిరుమలలోని వెంకన్న ఆలయానికి వెళ్లేందుకు యర్న గూడేనికి వచ్చారు. అక్కడ ఏలూరు వెళ్లే ఆర్‌టిసి బస్సు ఎక్కారు. అప్పటికి బస్సులో 19 మంది ఉన్నారు. బస్సు నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్రకాలువ వంతెన వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సిమెంటు లోడు లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాపుశెట్టి నాగేశ్వరరావు భార్య జ్యోతి(37), కుమారుడు శివసాయి(13), కుమార్తె అఖిల సత్య సంతోషి(11), లక్ష్మి(50)తో పాటు, ఒడిశా రాష్ట్రం పూరికి చెందిన పల్ల సావిత్రి(60) అక్కడికక్కడే మృతిచెందారు. ఇదే బస్సులో ప్రయాణిస్తున్న సావిత్రి మనవరాలు రుహిత, మరపట్ల గంగారత్నం, పెద్దిరెడ్డి భవాని, కండక్టర్ ముప్పిడి పుష్పకుమారి, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరూ తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కండక్టర్ పుష్పకుమారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. సిమెంటు లోడు లారీడ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఆర్‌టిసి ఇడి ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్‌ఎం ధనుంజయరావు సందర్శించారు. అనంతపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బస్సులోంచి మృతదేహాలను వెలికితీస్తున్న పోలీసు సిబ్బంది

నేటి నుంచి పవన్ కళ్యాణ్ 'అనంత' పర్యటన

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నేటి నుంచి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే పర్యటనకు సంబంధించి రూట్ మ్యాప్ శుక్రవారం ఖరారైనట్లు జనసేన జిల్లా నాయకులు అమర్‌నాథ్ తెలిపారు. మొదటి రోజు శనివారం ఉదయం 11.30 గంటలకు అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయబోతున్న జనసేన కార్యాలయం భూమి పూజలో పాల్గొంటారని, అనంతరం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు అక్కడే ప్రజలనుద్దేశించి మాట్లాడుతారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కెటిఆర్ ఫంక్షన్ హాలులో రైతులు, సాగునీటి రంగ నిపుణులు తదితరులతో జిల్లాలోని రైతుల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు.

దీనికి అనుమతి ఉన్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారన్నారు. రెండో రోజు ఆదివారం అనంతపురం నుంచి కదిరి పట్టణానికి చేరుకుంటారన్నారు. అక్కడ లక్ష్మి నరసింహ దేవాలయాన్ని దర్శించుకుంటారని, అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతారన్నారు. తరువాత పుట్టపర్తికి పయనమై హనుమాన్ జంక్షన్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడతారన్నారు. సత్యసాయి సమాధిని దర్శించుకుంటారని తెలిపారు. మూడో రోజు సోమవారం పుట్టపర్తి నుంచి ధర్మవరం చేరుకుంటారు. అక్కడ చేనేత కార్మికులతో మాట్లాడుతారని. ఉదయం 11.30 గంటలకు సభ పూర్తి చేసుకుని హిందూపురం బయలుదేరతారని తెలిపారు. హిందూపురంలో జన సేన కార్యక్రమాలపై మాట్లాడిన తరువాత మధ్యాహ్నం మూడు గంటలకు బెంగళూరుకు చేరుకుని అక్కడి నుంచి విమానంలో హైదరాబాదుకు వెళ్తారని తెలిపారు.

రూ.1,900 కోట్లతో విద్యుత్తు లైన్లు

ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు రూ.1,900 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి కె.విజయానంద్ తెలిపారు. విద్యుత్తు రంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలను అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో ఎపి ముందుందని, అనేక అవార్డులు సాధించిందన్నారు. విజయవాడలోని విద్యుత్తు సౌథలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించి, వందనం చేశారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలను 4 శాతానికి తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. మూడున్నరేళ్లలో రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి 8,307 మెగావాట్ల నుంచి 16,612 మెగావాట్ల పెరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సలహాదారు కె.రంగనాథానికి లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జెఎండి దినేష్ పరుచూరి, ఎపి సిడ్కో సిఇఒ చంద్రశేఖర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా కాలుష్యంపై పిల్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెల్లూరు, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో పంట పొలాల్ని రొయ్యలు, చేపలసాగ కోసం చెరువుగా చేసి భూముల్ని నాశనం చేస్తున్నారంటూ మద్రాస్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఇ.ధర్మారావు రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. చెరువులుగా చేయడంతో భూములు ఉప్పు కయ్యలుగా మారుతున్నాయని లేఖలో ధర్మారావు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల సాయంతోనే ఈ దారుణం జరుగుతోందన్నారు. పంటల కంటే ఎక్కువ డబ్బులిస్తామని దళారులు ఆశలకు రైతులు మోసపోయి పంట భూముల్ని చెరువులుగా తవ్వేస్తున్నారన్నారు. రోజూ అనేక ఎకరాల పంట భూములు చెరువులుగా మారిపోతున్నాయని, కొన్నాళ్లకు పంట భూములే లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఈ దారుణాన్ని అడ్డుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలని ధర్మారావు రాసిన లేఖను పిల్‌గా తీసుకున్న హైకోర్టు విచారణ చేపట్టనుంది.

విందు ఆహ్వానానికి సిపిఐ తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ విందును సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తిరస్కరించారు. గవర్నర్‌గా ఇస్తున్న స్టేట్‌మెంట్లను దృష్టిలో ఉంచుకుని, ఆయన పంపిన ఆహ్వానానికి రాలేకపోతున్నానని గవర్నర్‌కు రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా నరసింహన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పొగుడుతూ ఉపన్యాసాలిచ్చారన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను డబ్బులిచ్చి కొనుగోలు చేసే నీచ సంస్కృతికి తెర లేపారని తెలిపారు. ఫిరాయింపుదార్లయిన నలుగురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలతో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించి, ప్రజాస్వామానికి తిలోదకాలిచ్చారని పేర్కొన్నారు. గవర్నర్ స్థాయిలో ఉండి రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలను దుర్వినియోగం చేసి అవినీతి, ఫిరాయింపు రాజకీయాలకు ఆమోదముద్ర వేశారని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ కూడా గవర్నర్ ఆహ్వానాన్ని తిరస్కరిస్తూ ఇటీవల లేఖ రాశారు.

ప్రత్యేకం



రుద్రమకోటలో పురావస్తు తవ్వకాలు

రెండు వేల ఏళ్ల క్రితమే...

రుద్రమకోటలో ఓడరేవు..!

- గోదావరిపై తొలి ఓడరేవుగా భావన
- పురావస్తు నిపుణుల అంచనా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

పోలవరం ముంపు మండలాల్లోని రుద్రమకోటలో గోదావరి నది ఒడ్డున ఓడరేవు ఉండేదని పురావస్తు శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది సుమారుగా రెండు నుంచి మూడు వేల సంవత్సరాల క్రితానిది కావచ్చునని వారు ఊహిస్తున్నారు. ఈ ప్రాంతంలో తాజాగా తవ్వకాల్లో బయటపడుతున్న శిథిలాలు, పురాతన వస్తువులు, ఆ పరిసరాలు గమనిస్తే ఇక్కడ ఒక ఓడరేవు ఉండేదన్న భావన కలుగుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. చెబుతున్నారు. ప్రాంతాల్లోని రెండు గ్రామాల్లో దాదాపు రెండు వందలకుపైగా సమాధులను కూడా గుర్తించారు. ప్రధానంగా గోదావరి నదికి ఒడ్డున ఉన్న రుద్రమకోటలో నదిలోనే ఓడరేవు ఉండేదని. చుట్టుపక్కల గ్రామాల నుంచి సరుకులను నది ద్వారా సముద్ర తీరానికి రవాణా చేసి ఉంటారని ప్రాథమికంగా అంచనాకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇదే ఖరారైతే గోదావరి నదిపై తొలి ఓడరేవు అదే అయిఉంటుందంటున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రాలోకి విలీనమైన ఏడు మండలాల్లో తవ్వకాలకు కేంద్రం నుంచి అనుమతి వచ్చాక రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు, దేశ విదేశీ నిపుణులతో అధ్యయనం చేశారు. ప్రధానంగా పశ్చిమ గోదావరి జిల్లాలోకి వచ్చిన రుద్రమకోట, రాయనిపేట గ్రామాల్లో రెండు వందల వరకు ప్రాచీన కాలం నాటి సమాధులు గుర్తించారు. అవి మౌర్యులు, శాతవాహనుల కాలం నాటివిగా అధికారులు చెబుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని సమాధులను తవ్వగా, ప్రాచీన వస్తువులు లభిస్తున్నాయి. ఇందులో సాధారణంగా వినియోగించే మట్టి పాత్రలతోపాటు, కొన్ని ఎముకలు కూడా లభించాయి. అయితే అప్పట్లోనే శవ దహన విధానం అమలు చేయడం వల్ల ఎముకలు ఎప్పటివో గుర్తించడం కష్టమని, ఇతర వస్తువుల ద్వారా శవ దహనం చేసిన కాలాన్ని గుర్తించే అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ తవ్వకాల్లో అప్పట్లో స్త్రీలు ధరించే పూసలు, పచ్చలు, నీలాల వంటివి కూడా లభ్యమయ్యాయి. ఇప్పుడు లభిస్తున్న ఆధునిక నీలాలు, పచ్చల కన్నా అప్పట్లో లభించే పచ్చలు, నీలాలు అత్యంత విలువైనవిగా అంచనా వేస్తున్నారు. తాజాగా లభించే పచ్చలు గాజును పోలి ఉండగా, పురాతన పచ్చలు రాతిని పోలి బరువుగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తాజాగా మహిళలు ధరించే నల్లపూసల వంటివి కూడా తవ్వకాల్లో బయటపడ్డాయని, అవి చాలా చిన్నవిగా ఉన్నాయని వారు వెల్లడించారు.

గ్రామాలే మాయం...

తాజాగా తవ్వకాల్లో మరో కొత్త విషయాన్ని కూడా గుర్తిస్తున్నారు. ప్రాచీన కాలంలో ఉన్న అనేక గ్రామాలు గోదావరిలో కలిసిపోయినట్లు అంచనాకు వచ్చారు. రుద్రమకోటలో ఒక ఆలయం ఆనవాళ్లు ఉన్నాయని, ఇతర ప్రాంతాల్లోకూడా గ్రామాలు మటుమాయం అయినట్లు అధ్యయనంలో అంచనా వేస్తున్నారు. ఇప్పుడు ఉన్న గ్రామాలు తరువాత కాలంలో ఉద్భవించినవేనని వారంటున్నారు. డ్రోన్ల ద్వారా సమాధులు ఎక్కడున్నదీ గుర్తించి, ఆ తరువాత తవ్వకాలు చేపడుతున్నట్లు ఆర్కియాలజీ ఉప సంచాలకులు మల్లికార్జునరావు వెల్లడించారు. సమాధుల తవ్వకాల్లో అనేక విలువైన పురాతన వస్తువులు లభిస్తున్నాయని, వాటిని పరిశోధనా లయాలకు పంపించి వాటి వివరాలు సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. తమ సర్వేలో పూణెలోని దక్కన్ కాలేజి ఆర్కియాలజీ నిపుణులు కూడా పాల్గొంటున్నారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తవ్వకాలు జరపలేమని, అందుకే వీలయినంత త్వరగా తవ్వకాలు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

సంక్షిప్తం

మార్చి మొదటి వారం నుంచి బడ్జెట్ సమావేశాలు : స్పీకర్ కోడెల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మార్చి మొదటి వారం నుంచి ప్రారంభమవుతాయని స్పీకర్ కోడెల తెలిపారు. అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మార్చి నెలాఖరు వరకు సమావేశాలు కొనసాగుతాయన్నారు.

ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి డిప్యూటేషన్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్) కార్యదర్శి వి.రాములు డిప్యూటేషన్ గడువును ప్రభుత్వం రెండేళ్ళు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2017 నవంబరు 30 నుంచి 2019 నవంబరు 29వ తేదీ వరకూ డిప్యూటేషన్ గడువు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి : మంత్రి ఆనంద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'దళిత తేజం, తెలుగుదేశం' కార్యక్రమాన్నీ ప్రారంభించారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామన్నారు. సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడలను అభివృద్ధి పరుస్తున్నామని వివరించారు.

ఘనంగా గణతంత్రం



(మొదటిపేజీ తరువాయి)

పరేడ్ ప్రారంభమైంది. వివిధ రకాల క్షిపణులు, సైనికుల విన్యాసాలను ఆహూతులు ఆసక్తిగా తిలకించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన నేతలకు చెందిన పది దేశాల జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఆర్మీ, వాయు సేన, నావికా దళాలకు చెందిన శకటాలతో పాటు బిఎస్ఎఫ్ దళాలు, ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీసు బలగాలు, సశస్త్ర సీమబల్ బ్యాండ్, డిల్లీ పోలీసులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ బందాల ప్రదర్శన సందర్శకులను అబ్బుర పరిచింది. గణతంత్ర వేడుకలకు సుమారు 60 వేల మంది భద్రతా బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

ఈ గణతంత్ర వేడుకల సందర్భంగా శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ పథకాలతో పాటు పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలను ప్రదర్శించారు. ఆసియాన్ దేశాల విద్య, వైద్యం, సాంస్కృతిక వైవిధ్యాలపై ప్రదర్శించిన శకటాలు, ఆకాశ్, బ్రహ్మోస్ క్షిపణులకు సంబంధించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే మేక్ ఇన్ ఇండియా, ఖేలో ఇండియా, ఆదాయ పన్ను శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖ, ఆల్ ఇండియా రేడియా, సరిహద్దు భద్రతా దళాలు, ఇతర మంత్రిత్వ శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు. సబర్మతి ఆశ్రమం థీమ్‌తో గుజరాత్, ఛత్రపతి శివాజీ థీమ్‌తో మహారాష్ట్ర, అడవిలో వన్య మగాలకు సంబంధించిన థీమ్‌తో కర్ణాటక, చేతివత్తుల థీమ్‌తో త్రిపుర, బౌద్ధ క్షేత్రానికి సంబంధించిన థీమ్‌తో మధ్యప్రదేశ్ రాష్ట్రాలు శకటాలను ప్రదర్శించాయి. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన శకటాలు కూడా ఆకట్టుకున్నాయి. జాతీయ సాహస బాలల అవార్డులు అందుకున్న 18 మంది పిల్లలకు పరేడ్‌లో విశేష గౌరవం దక్కింది. వారు ప్రత్యేకమైన వాహనాల్లో పరేడ్‌లో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టకున్నాయి.

చరిత్ర సృష్టించిన బిఎస్ఎఫ్ మహిళా బైకర్

సరిహద్దు భద్రతా దళం(బిఎస్ఎఫ్)కు చెందిన మహిళా బైకర్స్ బందం "సీమా భవాని" తొలిసారిగా రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని చరిత్ర సృష్టించింది. గణతంత్ర వేడుకల్లో ఈ యువ మహిళలు అద్భుత ప్రదర్శన చేశారు. సరిహద్దు భద్రతా దళాలకు సంబంధించి పూర్తిగా మహిళలతో కూడిన మోటార్ సైకిల్ బందం వేడుకల్లో పాల్గొనడం ఇదే తొలి సారి. సబ్ ఇన్స్‌పెక్టర్ స్టాంజిన్ నోరంగ్ ఆధ్వర్యంలో 113 మంది యువతులు బైకింగ్ స్టంట్స్ అదరగొట్టారు. అంతా 25 నుంచి 30ఏళ్ల లోపు వారే. 350సిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ సైకిళ్లపై వారు వివిధ స్టంట్స్, ఆక్రోబాటిక్స్ ప్రదర్శించి ఆకట్టుకున్నారు. బిఎస్ఎఫ్ అకాడమీకి చెందిన సెంట్రల్ స్కూల్ ఆఫ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్‌లో వీరికి శిక్షణ ఇచ్చారు. బిఎస్ఎఫ్‌లోని వివిధ ర్యాంకుల్లో పని చేస్తున్న మహిళలను ఎంపిక చేసి ఈ బందాన్ని తయారు చేశారు.

రాహుల్‌కు ఆరో వరుసలో సీటు

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా తనకు కేటాయించిన ఆరో వరుసలోని సీటులో ఆశీనులయ్యారు. ఆయన పక్కన రాజ్యసభ ప్రతిపక్షనేత గులాం నబీ ఆజాద్ కూర్చొన్నారు. అయితే రాహుల్‌కు తొలుత నాల్గో వరుసలో సీటు కేటాయించినట్లు వార్తలు వచ్చాయి. కాని చివరకు ఆరో వరుసలో సీటు కేటాయించారు.

దీపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న సంప్రదాయాలకు తిలోదకాలిచ్చి చౌకబారు రాజకీయాలకు ప్రభుత్వం పాల్పడిందంటూ దుయ్యబట్టింది. గతంలో కాంగ్రెస్ అధినేత్రిగా సోనియా గాంధీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ముందు వరుసలో కూర్చునేవారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మొదటి వరుసలో మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, హెచ్.డి.దేవెగౌడ, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, థావర్ చంద్ గెహ్లాట్ కూర్చున్నారు.

నిబంధనలను ధిక్కరించిన మోడీ

ప్రధాని నరేంద్ర మోడీ రిపబ్లిక్ డే వేడుకల్లో భద్రతా నిబంధనలను ఉల్లంఘించారు. రాజ్‌పథ్‌లో ఆయన ప్రజల మధ్యకు యథేచ్ఛగా వెళ్లి అభివాదం చేశారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జరుగుతున్న కార్యక్రమాల్లో అలా చేయడం నిబంధనలు ఉల్లంఘించడమే. మోడీ ఇండియా గేట్ వరకు ఈ విధంగా అభివాదం చేసుకుంటూ నడిచి వెళ్ళారు. ఆయనకు భద్రత కల్పించడానికి భద్రతా సిబ్బంది చాలా కష్టపడ్డారు. గతంలో గుజరాత్ ఎన్నికల సమయంలో కూడా ఓటు వేసిన తరువాత ఇలానే అభివాదం చేసుకుంటూ వెళ్లడంపై ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారనే విమర్శలు వెల్లువెత్తాయి.

కనిపించని తెలుగు శకటాలు

ప్రతిష్ఠాత్మక గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన శకటాలు కనిపించలేదు. త్రిపుర, ఉత్తరాఖండ్, అస్సాం వంటి చిన్న చిన్న రాష్ట్రాల శకటాలకు కూడా ప్రాతినిధ్యం లభించింది. కానీ పెద్ద రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలకు మాత్రం చోటు దక్కలేదు. రిపబ్లిక్ దినోత్సవ పరేడ్‌లో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలను ప్రదర్శించడానికి ముందుగా... వాటి నమునాలను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు కొన్ని నెలల ముందే అందజేయాలి. అలా స్వీకరించిన నమునాల్లో అత్యుత్తమమైన వాటిని పరేడ్‌లో ప్రదర్శించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఎంపిక చేస్తుంది. వాటినే జనవరి 26న రిపబ్లిక్ పరేడ్‌లో ప్రదర్శిస్తారు. గత మూడేళ్లుగా తెలుగు రాష్ట్రాల శకటాలకు పరేడ్‌లో చోటు దక్కటం లేదు.





రాష్ట్రపతి కంటతడి

అమరవీరుని కుటుంబసభ్యులకు 'అశోక్‌చక్ర' అందజేస్తూ ఉద్వేగానికి లోనైన కోవింద్



న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భాగంగా సైనిక సాహస అవార్డులు అందజేసే ఒదర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్వేగానికి గురయ్యారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గార్డు కమెండో కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలకు మరణాంతరం ప్రకటించిన అశోక్ చక్ర అవార్డును ఆయన కుటుంబసభ్యులకు అందచేసే సమయంలో రాష్ట్రపతి కంటతడి పెట్టారు. కళ్లను తన హ్యాండ్‌కర్చీఫ్‌తో తుడుచుకున్నారు. భారత వాయుదళానికి చెందిన ప్రత్యేక దళంలో కార్పొరల్ నిరాల సభ్యుడు. ఈ దళాన్ని రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్ నిర్వహిస్తున్న 'ఆపరేషన్ రక్షక్'కు జతచేశారు. నవంబర్ 18న జమ్మూకాశ్మీర్‌లోని బందిపోర గ్రామంలో ఉగ్రవాదులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో నిరాల బృందం అక్కడకు వెళ్లింది. ఉగ్రవాదులు ఉన్న భవనం వద్దకు చేరుకోగానే వారు కాల్పులకు దిగారు. భద్రతా దళాలు కూడా ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో నిరాలకు తీవ్రగాయాలయ్యాయి. అయినా అతను లెక్కచేయకుండా ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాడు. చివరికి తానూ మృతి చెందాడు. ఈ సంఘటనలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో లష్కర్‌ఈతోయిబా చీఫ్ మేనల్లుడు, 26/11 ముంబాయి బాంబు పేలుళ్ల సూత్రధారి జుకి యుర్ రెహ్మాన్ లక్వీ కూడా వున్నాడు. నిరాల అద్భుతంగా పోరాడి, ఉగ్రవాదులు తప్పించుకునే మార్గాలను మూసివేశాడని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో ప్రశంసించింది. బీహార్‌లోని రోహ్తాస్ జిల్లాకు చెందిన నిరాల 2005లో వాయుసేనలో ప్రవేశించాడు. కాగా, కీర్తి చక్ర అవార్డును ఆర్మీ మేజర్ విజయంత్ బిస్తాకు అందచేశారు. యురి జిల్లాలో ఆకస్మికంగా జరిగిన దాడిలో బిస్తా తన తోటి సైనికుడి ప్రాణాలను రక్షించడమే కాకుండా, ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టాడు.

విట్ అమరావతిలో గణతంత్ర వేడుకలు

గౌరవ వందనం స్వీకరించిన సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలోని వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)లో 69వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సిఆర్‌డిఎ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడంతోపాటు ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అప్పుడే జీవితంలో అగ్రస్థానానికి వెళ్తారన్నారు. రాబోయే కాలంలో అమరావతి ప్రాంతం నుంచి వెళ్లిన వారే ఎక్కడైనా టెక్నాలజీలో ముందుండాలన్నారు. ప్రపంచస్థాయి నిపుణులు తయారు కావాలని ఆశాభవం వ్యక్తంచేశారు. అమరావతిలో ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు ఉండాలన్నదే సిఎం చంద్రబాబు ఆలోచన అన్నారు. ఈ ఏడాది జులై ఆఖరుకు రాజధానిలో సీడ్ యాక్సిస్ రోడ్లు పూర్తవుతాయని, కొద్ది రోజుల్లోనే ప్రపంచస్థాయి నగరం రూపుదిద్దుకోబోతోందని చెప్పారు. జెండా ఆవిష్కరణ అనంతరం గతేడాది నవంబర్ 12న ఫెర్రీ ఘాట్‌లో జరిగిన బోటు ప్రమాద సమయంలో పర్యాటకులను కాపాడిన మత్స్యకారులు నడికుదిటి పిచ్చయ్య, కన్నా శివదుర్గారావును శ్రీధర్ సన్మానించారు. అదే విధంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడబోయే వారిని కాపాడిన గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బండ్ల నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో విట్ ఎపి శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి శుభాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ సిఎల్‌వి శివకుమార్, విద్యార్థులు, ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -బత్తలపల్లి

విద్యుత్‌షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మాళ్యంతం గ్రామానికి చెందిన పూజారి దాసరి రాముడు పిఎబిఆర్ కుడి కాలువ పక్కనే తమకున్న రెండెకరాల పొలంలో వరిపంట సాగు చేశారు. ప్రభుత్వం నూతనంగా ఇస్తున్న మోటార్లను అమర్చేందుకు పాత మోటారును తొలగిస్తున్నారు దీని కోసం కురుబ దాసరి చంద్రశేఖర్(30), తాడిమర్రి మండలం ఏకపాదం పల్లి గ్రామానికి చెందిన మెకానిక్ మధుసూదన్(34) సాయంతో బోరుబావిలోని మూడు పైపులను తీస్తుండగా బరువు ఎక్కువై పక్కకు వాలాయి. ఆ పైపులు 11కెవి విద్యుత్ తీగకు తగిలాయి. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై రైతు చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మెకానిక్ మదుసూదన్ తీవ్రంగా గాయపడ్డాడు. బత్తలపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విదేశాలకు విమానాలు ఎగిరేనా?

- అమరావతికి రాని అంతర్జాతీయ విమాన సర్వీసులు
- ఇమిగ్రేషన్, కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం
- ప్రైవేటు సంస్థ మోకాలొడ్డడమే కారణమా?

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

అదిగో.. ఇదిగో అనడం మినహా గన్నవరం విమానశ్రయం నుంచి విదేశీ విమానయాన సర్వీసులు మాత్రం నడపడం లేదు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ హోదా ప్రకటించి నెలలు గడిచిపోతున్నా ఇమిగ్రేషన్, కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో అమరావతి ప్రాంతం నుంచి విదేశాలకు వెళ్లే వారికి రెండంచెల ప్రయాణం తప్పడం లేదు. ఈ నేపథ్యంలో సమీప రాష్ట్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు భాగస్వామ్య సంస్థ తమ ఆదాయానికి గండిపడుతుందనే ఉద్దేశంతో గన్నవరంలో సంబంధిత కార్యాలయాల ఏర్పాటుకు మోకాలొడ్డుతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి.



గన్నవరం విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం రూ.వందల కోట్లు వెచ్చించింది. ఈ విమానాశ్రయం నుంచి ఏడాదికి సగటున ఎనిమిది లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్రం ఏడు నెలల క్రితం అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తింపునిచ్చింది. అయితే విమానయాన సంస్థలు అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించాలంటే విమానాశ్రయాల్లో ప్రయాణీకులకు సంబంధించిన పాస్‌పోర్టు, వీసా తదితర తనిఖీలకు కస్టమ్స్, ఇమిగ్రేషన్ విభాగాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యాలయాల ఏర్పాటుకు, సిబ్బంది భర్తీకి చొరవ తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అంతర్జాతీయ సర్వీసులు నడిపేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ విమానాశ్రయం నుంచి ప్రయాణించే వారి సంఖ్యలో సగం మంది కూడా ప్రయాణించని తిరుపతిలో ముందుగానే ఇమిగ్రేషన్, కస్టమ్స్ కార్యాలయాలను ఏర్పాటు చేయడం గమనార్హం.

ప్రైవేటు కంపెనీ మోకాలడ్డు?

ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే పది లక్షల మంది వరకు ఎన్ఆర్ఐలు ఉంటారని అంచనా. విదేశాల నుంచి నేరుగా సర్వీసులు లేకపోవడంతో వీరంతా తమ ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు హైదరాబాద్, చెన్నయ్ విమానాశ్రయాలను ఆశ్రయిస్తున్నారు. రాజధాని ప్రాంతానికి విదేశీ ప్రతినిధుల బృందాలు, పర్యాటకుల తాకిడి అధికంగా ఉంది. ఈ క్రమంలో ఇక్కడి నుంచి నేరుగా విదేశీ యానానికి అవకాశం ఉంటే ఆ ప్రభావం సమీప రాష్ట్రంలో ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయ ఆదాయంపై ప్రభావం పడుతుంది. ఈ క్రమంలో సమీప రాష్ట్రానికి చెందిన ఆ ప్రైవేటు సంస్థ ఇమిగ్రేషన్, కస్టమ్స్ కార్యాలయాలు రాకుండా పైరవీలు చేస్తూ మోకాలొడ్డుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మల్టీ పర్పస్‌గా కియోస్క్

మూడు నెలల్లో పంచాయతీల్లో ఏర్పాటుకు యోచన

విజయవాడలో నేటికీ ఏర్పాటు కాని వైనం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

రవాణా శాఖలో ఆన్‌లైన్ సేవలను వాహనదారులు త్వరిత గతిన వినియోగించుకునేందుకు కియోస్క్ యంత్రాలను అమర్చుతున్నామని అధికారులు ప్రకటించారు. అయితే ఏడాది దాటినా నేటి వరకు విజయవాడలో ఒక్క కియోస్క్ యంత్రాన్నీ ఏర్పాటు చేయలేదు. గతేడాది నగరంలోని ప్రధాన కూడళ్లలో మూడు కియోస్క్ యంత్రాలను ఏటిఎం తరహాలో ఏర్పాటు చేయడం ద్వారా 83 రకాల సేవలను ఇందులో ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. రవాణా శాఖ ప్రకటించినా నేటికీ అమలుకు నోచుకోకపోవడాన్ని ప్రభుత్వం ప్రచారార్భాటంగా నూతన పథకాలను వినియోగించుకుంటుందనే విమర్శలు నగర వాసుల్లో వినవస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కియోస్క్ యంత్రాన్ని ప్రారంభించారు. రాబోయే మూడు నెలల్లో గ్రామ పంచాయతీ కేంద్రాలతోపాటు రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో కియోస్క్ యంత్రాలను అమర్చేందుకు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. కియోస్క్ సక్రమంగా అమలై వాడుకలోకి వస్తే ఎఎల్ఆర్ టెస్ట్, వాహనం ఫిజికల్ టెస్ట్, ఫిట్‌నెస్ పరీక్షలు మినహా మిగిలిన సేవలన్నీ రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లకుండానే పనులు చేసుకునే వీలుంటుంది. రాబోయే మూడు నెలల్లో ప్రభుత్వం మల్టీపర్పస్‌గా మినీ ఏటిఎంల తరహాలో ఉపయోగించుకునే అవకాశం కల్పించనుంది. ముఖ్యంగా రవాణా సేవలతోపాటు పింఛన్లు, రెవెన్యూకు సంబంధించి సవరణలు తదితర పనులను కియోస్క్ ద్వారా సేవలను వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం.



సిఎంకు కియోస్క్ పని తీరును వివరిస్తున్న రవాణ శాఖ కమిషనరు

ప్రత్యేకం

విలీనం పేరుతో తొలగింపు

- ఆరు నెలలని చెప్పారు.. ఇంత వరకూ తీసుకోలేదు
- ఆందోళనలో హాస్టళ్ల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సంక్షేమ హాస్టళ్లను గురుకుల పాఠశాలలుగా మార్చేసి, హాస్టళ్లను మూసివేయడంతో అక్కడ పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డునపడ్డారు. హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులను గురుకుల పాఠశాలలకు తరలించేయడంతో మూతపడ్డ వాటిలో పనిచేసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు 68 మందికి ఉద్వాసన పలకడంతో ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రస్తుతం 60 హాస్టళ్లు ఉన్నాయి. గతంలో 114 ఉండేవి. ఈ మూడేళ్లలో 54 హాస్టళ్లను గురుకుల పాఠశాలల్లో విలీనం చేశారు. 2015లో 22 హాస్టళ్లను, 2016లో 28 హాస్టళ్లను, 2017లో 11 హాస్టళ్లను విలీనం చేసేశారు. మూసివేసిన 54 హాస్టళ్లలో పనిచేసే సుమారు 68 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పక్కన పెట్టారు. గతేడాది మార్చి నెల వరకూ వీరిని ఉద్యోగాల్లో ఉంచారు. ఏటా మాదిరిగానే వేసవి సెలవుల తరువాత జూన్ నుంచి తిరిగి విధుల్లోకి తీసుకుంటామని చెప్పినా గాలికి వదిలేశారు. అప్పటివరకూ సంక్షేమ హాస్టళ్లలో కుక్, కమాటి, హెల్పర్ వంటి ఉద్యోగాల్లో అవుట్ సోర్సింగ్ ద్వారా పనిచేసిన వారంతా రోడ్డున పడ్డారు. నెలకు రూ.10,358 జీతం ఇచ్చేవారని, ఇప్పుడు తమ ఉపాధి పరిస్థితి ఏమిటని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. హాస్టళ్లనే నమ్ముకుని పదేళ్ల నుంచి పని చేస్తున్నామని, ఇప్పుడు అర్థాంతరంగా పొట్టకొట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరే ఉద్యోగాలైనా ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.



మండపేటలో ధర్నా చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

మాకు న్యాయం చేయండి



గోకవరం ఎస్‌సి హాస్టల్‌లో పనిచేసే వాణ్ణి. ఉద్యోగాన్నే నమ్ముకుని జీవిస్తున్నాను. మా కుటుంబానికి ఏ లోటూ రాకుండా చూసుకునేవాడిని. ఉన్నట్టుండి పక్కన పెట్టారు. ఆరు నెలల నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.హాస్టళ్లను మూసేసి మా ఉద్యోగాలకు ఎసరు పెట్టడం సరికాదు. అధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

– బండి బుచ్చిరాజు, కుక్

పదేళ్లుగా పని చేస్తున్నాను



రంగంపేటలో 2008 నుంచి కమాటిగా పనిచేస్తున్నాను. అధికారులు జూన్ నుంచి మళ్లీ పిలుస్తామని చెప్పి ఆ తర్వాత సమాధానం చెప్పడం లేదు. మా పరిస్థితిని అర్థం చేసుకుని జిల్లా కలెక్టర్ ఇతర శాఖల్లోనైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలి. లేకుంటే మా బతుకులు రోడ్డున పడతాయి.

– కె.అన్నపూర్ణ, కమాటి

సంక్షిప్తం

శ్రీవారిని దర్శించుకున్న సింగపూర్ మంత్రి

తిరుమల:తిరుమల శ్రీవారిని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈయన వెంట ఎపి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఉన్నారు.ఆలయ విశిష్టతను, ప్రాధాన్యతను ఆలయ పండితులు మంత్రికి వివరించారు. రంగనాయక మండపంలో కొద్ది సేపు ఉన్నారు. అనంతరం శ్రీవారి ప్రసాదాలను టిటిడి జెఈఓ అందజేశారు.

1,000 అడుగుల జెండా ప్రదర్శన

అనంతపురం: అనంతపురం జిల్లా హిందుపురం లో గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా వాసవీ క్లబ్ మరియు సువర్ణ భారతి కళాశాల ఆధ్వర్యం లో 1,000 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. పట్టణం మొత్తం జాతీయ గీతాలాపనతో తిరుగుతూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

దేవరాపల్లిలో 30 మేకలు సజీవ దహనం

దేవరాపల్లి, విశాఖ:విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం పెదనందిపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు మేకల దొడ్లు దగ్ధం కావడంతో 30 మేకలు సజీవ దహనమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. స్థానికుల కథనం మేరకు.. వీటిలో గొల్లపేటకు చెందిన ఆబోతు వెంకటేష్‌కు చెందిన 20 మేకలు, ఆబోతు అప్పారావుకు చెందిన 10 మేకలు ఉన్నాయి. ఉవ్వెత్తున ఎగసిన మంటలను గుర్తించిన స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని వాటిని అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సంఘటనా స్థలాన్ని గొర్రెలు మేకల పెంపకందారుల సహకార సంఘ జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రాజు, కెవిపిఎస్ జిల్లా నాయకులు కాటపల్లి అప్పారావు పరిశీలించారు.

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి- కదిరి

అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందిన ఐదేళ్ల బాలికపై ఆత్యాచారం జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసంది. విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పట్టణంలోని ఓ నగర్‌కు చెందిన ఐదేళ్ల బాలిక ఇంటిలో ఆడుకుంటుండగా బాబా కాలనీకి చెందిన ఖాజాహుసేన్ (27) అనే వ్యక్తి పదిరోజుల క్రితం ఆత్యాచారం చేసినట్లు తల్లితండ్రులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. బాలికకు పది రోజుల నుంచి జ్వరం వస్తుండటంతో వైద్యులకు చూపించారని చెప్పారు. బాలిక తనపై జరిగిన అఘాయత్యాన్ని తల్లితండ్రులకు చెప్పిందన్నారు. దీనిపై తల్లితండ్రులు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. శుక్రవారం వైద్యపరిక్షల నిమిత్తం బాలికను అనంతపురం ఆస్పత్రికి పంపినట్లు పోలీసులు తెలిపారు. డిఎస్‌పి బాబా కాలనీకి వెళ్లి విచారించారు. నిందితున్ని పట్టుకునేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారు.

రూ.50 లక్షల ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి-అచ్చంపేట (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా అచ్చంపేట మండల కేంద్రంలోని అలీ జ్యుయలర్స్‌లో శుక్రవారం భారీ చోరీ జరిగింది. సుమారు రూ.50 లక్షల బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలిని జిల్లా రూరల్ ఎస్‌పి సిహెచ్.వెంకట అప్పలనాయుడు, సిసిఎస్ ఎఎస్‌పి ఎం.వెంకటేశ్వర్లు పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపి వివరాలు సేకరించారు. దుకాణంలోని సిసి కెమెరాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌నూ దుండగులు ధ్వంసం చేయడంతో దుకాణ సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తామని ఎస్‌పి తెలిపారు. ఇదిలా ఉండగా ఈ దుకాణానికి సమీపంలోని మరో దుకాణంలో రెండేళ్ల కిందట ఇదే మాదిరి చోరీ జరగడం, ఆ కేసులో పురోగతి లేకపోవడం గమనార్హం.

సంపాదకీయం

శ్రీరంగ నీతులు

చెప్పే మాటలను ఆచరణలో చూపని వాడు పెద్ద మనిషి కాలేడు.. అని ఇంగ్లీషు సామెత. ప్రధాని మోడీకి ఇది సరిగ్గా నప్పుతుందని అనేక మార్లు నిరూపితమైంది. ఇటీవల దావోస్‌లో ఆయన చేసిన ప్రసంగం ఆ విషయాన్ని మరోమారు రుజువు చేసింది. ప్రపంచం ముందు మూడు సవాళ్లున్నాయని వాటిని ప్రపంచ దేశాలన్నీ ఐక్యంగా ఎదుర్కోవాలని మోడీ దావోస్ సభలు ప్రారంభిస్తూ చెప్పారు. ఉగ్రవాదం, ప్రపంచ వాణిజ్యంలో స్వీయ రక్షణ విధానాలు, పర్యావరణ విధ్వంసక విధానాలు.. ఈ మూడిటిపై ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కానీ ఈ మూడింటినీ పెంచి పోషిస్తున్నదెవరు? ప్రపంచంలో ఉగ్రవాదానికి బీజాలు వేసింది అమెరికా విస్తరణవాద విధానాలు. ఆఫ్ఘనిస్థాన్‌లో సోవియట్ ప్రాబల్యాన్ని ఎదుర్కొనే నెపంతో పచ్చి మతోన్మాద తాలిబన్లను పెంచి పోషించింది అమెరికా. ఎక్కడో సౌదీలో వ్యాపారం చేసుకుంటున్న అల్ ఖైదా నాయకుడు బిన్ లాడెన్‌ను ప్రోత్సహించి, పెంచి పోషించింది అమెరికా. ఒకప్పుడు ఆధునికతవైపు ఒడివడిగా అడుగులు వేస్తున్న ఆఫ్ఘనిస్థాన్ నేడు తాలిబాన్ల అడ్డాగా మారడానికి అమెరికా విస్తరణవాదమే కారణం. ఇరాక్, సిరియాలలో ఐఎస్‌ఐ ఉగ్రవాదం పుట్టి, పెరిగి, విస్తరించడానికి కారణం ఎవరు? మధ్య ప్రాచ్యంలో ఒకనాడు ఇరాక్, సిరియా, లిబియాలు సెక్యులర్ భావాలకు నిలయాలుగా ఉండేవి. అమెరికా ఆధిపత్య కాంక్షతో ఆ దేశాలపై దాడిచేసి అక్కడి జాతుల మధ్య చిచ్చుపెట్టడమే నేడు ఆ దేశాలు ఉగ్రవాద తండాల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోడానికి కారణం. అటువంటి అమెరికా విధానాలపై పోరాడకుండా ఉగ్రవాదంపై పోరాడ్డం ఎలా సాధ్యం? కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒకవైపు అమెరికాతో స్నేహాన్ని మరింత పెంచుకుంటూ, ఆసియాలో దాని విస్తరణవాద వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా మారుతూ మరోవైపు ఉగ్రవాదంపై పోరాటం చేస్తామంటే ఎవరిని నమ్మించడానికి?

పర్యావరణ విధ్వంసం నుండి ప్రపంచాన్ని కాపాడాలని ప్రధాని బాగానే పిలుపునిచ్చారు. కానీ నేడు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నది ఎవరు? ప్రపంచ పర్యావరణ చర్చలకు మోకాలడ్డుతున్న దెవరు? అమెరికా కాదా!.. ప్రపంచ జనాభాలో 5 శాతం గలిగిన అమెరికా ప్రపంచ వనరుల్లో 25 శాతం ఉపయోగిస్తున్నది. వాతావరణ కాలుష్యంలో 25 శాతం వాటా దానిదే. కానీ మూడు శాతం వాటా కూడా లేని చైనా, భారత్‌పై నెపాన్ని నెట్టేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్యారిస్ వాతావరణ చర్చల నుండి వైదొలిగాడు. దాంతో ఆ చర్చల ప్రక్రియే కుప్ప కూలిపోయింది. ఒకవైపు భూగోళం కాలుష్యం వల్ల తీవ్రమైన ప్రమాదం ఎదుర్కొంటుంటే ట్రంప్ అటువంటి ప్రమాదాన్ని మరింత పెంచే చర్యలు చేపట్టారు. అటువంటి ట్రంప్ చర్యలను ఖండించి ఆయన విధానాలకు వ్యతిరేకంగా పోరాడకపోగా, ఆయనతో గాఢాలింగనం చేసుకుంటూ మరోవైపు పర్యావరణ విధ్వంసకులపై పోరాడతామని మోడీ ప్రసంగించడం ఎవరిని మోసగించడానికి? అంతర్జాతీయ వాణిజ్యంలో రక్షణాత్మక విధానాలను అనుసరిస్తున్నది కూడా ట్రంప్ ప్రభుత్వమే. అమెరికా బహుళజాతి కంపెనీలు ప్రపంచ దేశాలను కబళిస్తుంటే మరోవైపు తమ దేశంలో నిరుద్యోగానికి స్వేచ్ఛా వాణిజ్యమే కారణమంటూ ట్రంప్ వర్ధమాన దేశాలకు వ్యతిరేకంగా అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ విధానాల వల్ల పెద్దగా నష్టపోతున్న దేశాల్లో భారత్ ఒకటి. భారతీయ సాఫ్ట్ వేర్ పరిశ్రమలపైనా, ఉద్యోగులపైనా కక్ష కట్టినట్లు ట్రంప్ తీసుకుంటున్న చర్యలను మౌనంగా చూస్తున్న మోడీ అంతర్జాతీయంగా అమెరికాతో భాగస్వామ్యమే తన విదేశాంగ విధానంగా వ్యవహరించడం విడ్డూరం కదూ!

గంభీరమైన ఉపన్యాసాలతో కాదు, ఆచరణ చూసే ఎవరినైనా అంచనా కట్టాలి. ఈ విషయంలో మోడీ వ్యవహారం చెప్పేదొకటి, చేసేదొకటిగానే మొదటి నుండీ ఉంటోంది. ఇంటా బయటా ఆయన వ్యవహార శైలి అదే. 'బహుళత్వమే భారత్ బలం, ప్రజాస్వామ్యం, వైవిధ్యం కలిగి ఉన్న భారత్ మాకు ఎంతో గర్వకారణం' అని మోడీ అదే ప్రసంగంలో చెప్పారు. కానీ ఆయన పరివారం మాత్రం దేశంలో బహుళత్వాన్ని ధ్వంసం చేయడానికీ, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికీ చేయని దుర్మార్గం లేదు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలోనే ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుతో కర్ణిసేన మూకలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో పద్మావత్ సినిమాకు వ్యతిరేకంగా థియేటర్లను ధ్వంసం చేస్తున్నాయి, నగరాలు, పట్టణాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఆయన ప్రభుత్వం అండతో కాషాయ మూకలు మైనారిటీలపై దాడులకు తెగబడుతున్నాయి, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులకు దిగుతున్నాయి. మోడీ ప్రసంగానికి గొప్ప కితాబులిస్తున్న కార్పొరేట్ మీడియా ఆయన ప్రభుత్వమూ, పార్టీ చేస్తున్న నిర్వాకాలను కప్పిపుచ్చాలనుకుంటున్నా ప్రజలు గ్రహిస్తున్నారు. ఈ గోముఖ వ్యాఘ్ర విధానాలను తిప్పి కొడతారు.

ఇదీ విషయం



నేను చదువుకోలేదు
నాకంతే తెలుసు...
సీఎం సీటని తెలీదు
నాకంతే తెలుసు!

నాకు తెలిసిందొక్కటే
సీట్లో కూర్చోవాలని...
బావైనా బాబైనా
పక్కకు నెట్టెయ్యాలని!

\- కొల్లూరు వెంకట్

డార్విన్ అంటే అంత వ్యతిరేకత ఎందుకు?

విశ్లేషణ




కె ఎల్ కాంతారావు

అనాది నుండి ప్రపంచంలోని తత్వవేత్తలు, శాస్త్రవేత్తలలో భూమి మీద ఉన్న ఈ జీవులు, మానవుడు ఎలా సృష్టించబడ్డారనే విషయాన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండేది. మత గ్రంథాలన్నీ ఈ భూమి మీద ఉన్న అన్ని జీవులూ, మానవులతో సహా ఒక మానవాతీత శక్తిచే ఇప్పుడున్న రూపంలోనే ఏక కాలంలో సృష్టించబడ్డాయనీ, ఇవి ఇలాగే కొనసాగుతున్నాయనీ చెప్పాయి. బైబిల్ ప్రకారం ప్రపంచమంతా భగవంతునిచే ఆరు రోజుల్లో సృష్టించబడ్డది. హిందూ మత గ్రంథాలు సృష్టిని గూర్చి రకరకాలుగా చెప్పాయి. రామాయణం అరణ్య కాండలో కశ్యప ప్రజాపతికి దేవతలు, దైత్యులు, మానవులు, పశువులు, పక్షులు, పాములు, ఏనుగులు, పెద్ద పులులు, కొండముచ్చులు పుట్టాయని చెప్పారు. మహాభారతం, ఆదిపర్వం, ఒకటవ అధ్యాయం ప్రకారం బ్రహ్మాండమైన గుడ్డు నుండి ప్రజాపతులు, వస్తువులు, యక్షులు, బ్రహ్మర్షులు జన్మించారు. వారి తర్వాత రాజర్షులు జన్మించారు. ఆ తర్వాత వరుసగా నీరు, భూమి, గాలి, ఆకాశం, సంవత్సరాలు, రుతువులు, నెలలు, పక్షాలు, పగలు, రాత్రి ఉద్భవించాయి. ఇలా వివిధ మత గ్రంథాలు సృష్టిని గూర్చి అనేక రకాలుగా చెప్పాయి. ఈ వాదాలను ఖండిస్తూ ఒకరిద్దరు తత్వవేత్తలు జీవులు పరిణామం ద్వారా అవతరించాయి అనే వాదనను తమ సునిశిత పరిశీలన ద్వారా చేసినా, వారు తమ వాదనకు సరైన రుజువులు చూపలేక పోవడంతో, మెజార్టీ ప్రజలు ఆ వాదనను అంగీకరించలేదు. ఉదాహరణకు క్రీ.పూ 400 ప్రాంతానికి చెందిన తత్వవేత్త డెమోక్రటిస్, జీవులన్నీ మట్టి అణువులు కలవేననీ, ఉపాయం, ధైర్యం, వేగం కలిగినవి మాత్రం నిలిచాయనీ, వాటిలో నుండి ఎప్పుడో మనిషి పరిణామం చెందాడనీ ప్రకటించాడు. అలాగే క్రీ.పూ 384–322 కాలం వాడైన అరిస్టాటిల్, ప్రాణులు మరింత ఉన్నత దశకు పరిణామం చెందుతాయనీ, అన్నిటిలోకి ఉన్నతమైనవి వానరాలు అనీ, వాటి కంటే ఉన్నత శ్రేణి నరజాతి అనీ ప్రకటించాడు. భవిష్యత్తులో నరజాతి కంటే ఉన్నతమైనవి రావచ్చునని కూడా భావించాడు. భారత దేశంలో చార్వాకులు గాలి, నీరు, నిప్పు, నేల ఈ నాలుగే మూల భూతాలు. అవి తగిన పాళ్లలో కలవడం వల్లనే ప్రాణులు పుడతాయి అన్నారు. అంతేకాదు, తమలపాకు, వక్క, సున్నం కలయికతో ఎర్ర రంగు ఎలా పుడుతుందో, జడ పదార్థాలుగా ఉన్న చతుర్భూతాల మేళవింపుతో, ప్రాణుల్లో చైతన్యం పుడుతుందని అన్నారు. పై వారందరూ, వారి వాదనలకు బలమైన సాక్ష్యాధారాలు చూపలేకపోయారు. అయితే, 1859లో బ్రిటిష్ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ 'ఏకకాలంలోనే సృష్టి' అనే వాదాన్ని పటాపంచలు చేసి, మనం చూస్తున్న జీవ జాతులన్నీ తమకు ముందు జీవించిన జీవుల నుండి పరిణామం ద్వారా కొత్త జీవులుగా ఆవిర్భవించాయి, అనే పరిణామ వాద సిద్ధాంతాన్ని అనేక సాక్ష్యాధారాలతో ప్రతిపాదించారు. అంతేకాదు, కోతి దశలో ఉన్న జీవి పరిణామం ద్వారా మానవుడుగా మార్పు చెందాడని రుజువులతో నిరూపించాడు. డార్విన్ పరిణామ వాద సిద్ధాం తాన్ని విజ్ఞాన శాస్త్ర ప్రపంచం ఆమోదించింది. రుజువులతో ఉన్న ఏ విషయాన్నైనా ఆమోదిం చడం శాస్త్ర ప్రపంచానికి సహజమే కదా! గత 160 ఏళ్లలో, పై వాదానికి అనుకూలంగా మరిన్ని సాక్ష్యాలు, రుజువులు ఆధునిక శాస్త్రాలైన మాలికులర్ బయాలజీ, జీవ రసాయన శాస్త్రం, జన్యు శాస్త్రాలు చూపించి, డార్విన్ వాదాన్ని మరింత పరిపుష్టం చేశాయి.

డార్వినిజం ఆవిష్కరణ జరిగిన వెంటనే పాలకవర్గం, మతాచార్యులు దానిని ఆమోదించ లేదు. దానిని తిరస్కరించారు. విశేషమేమిటంటే మతాచార్యులు కొన్ని దశాబ్దాల తర్వాత ఏక కాలంలో సృష్టి వాదం, పరిణామ వాదాల మధ్య చర్చ నుండి క్రమంగా వెనుకకు తగ్గారు. చివరకు 1925లో చర్చి నాయకులు ఈ రెండు వాదాల మధ్య లడాయిని శాశ్వతంగా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు, డార్విన్‌ను గూర్చి అవమానకరంగా మాట్లాడినందుకు 2008లో చర్చి క్షమాపణ కోరింది. కాని ప్రజల మూఢ నమ్మకాలను పట్టి వుంచాలనే ఆలోచన గల పాలక వర్గాలు ఈ లడాయిని వదలలేదు సరిగదా, వారిపై చర్చను పట్టుదలగా ఏదో ఒక రీతిలో కొనసాగిస్తూనే వున్నాయి. 1990లలో 'తెలివిగల సృష్టి' అనే కొత్త వాదాన్ని వారు లంకించు కున్నాయి. ఆ వాదం సృష్టికర్తలు ఛాప్‌మన్, మేయర్ అయినా దానిని అమెరికా అధ్యక్షుడు బుష్ 2005 అక్టోబరులో అందుకొని 'పరిణామ వాదాన్ని, తెలివిగల సృష్టికర్త వాదాన్నీ రెండింటినీ పాఠశాలల్లో బోధించాలి' అన్నాడు. అలా రెండు వాదాల్నీ విన్న విద్యార్థులు గందరగోళంలో పడిపోతారు. అదే పాలక వర్గాలకు కావలసింది. కాని, ఆశ్చర్యకరంగా, చర్చి ప్రతినిధులు ఈ చర్చలో తల దూర్చడానికి ఇష్టపడక పోవడమే గాక సృష్టి వాదం శాస్త్రీయ ఆధారాలు గల సిద్ధాంతంగా సైన్సు క్లాసుల్లో బోధించ కూడదని ప్రకటించారు. (ది హిందూ,18.9.2008)

ఈ పరిస్థితుల్లో భారతదేశ పాలక వర్గం దానికి నాయకత్వం వహిస్తున్న బిజెపి, ప్రజలలో మూఢ నమ్మకాలు పెంచే అనేక చర్యలు చేపడుతోంది. వారి నాయకులు అనేక ప్రకటనలు చేస్తున్నారు. ప్రధానమంత్రే స్వయంగా వినాయకుడి కథ అనేక వేల సంవత్సరాల కిందట, భారత శాస్త్రజ్ఞులకు ప్లాస్టిక్ సర్జరీ తెలుసుననే విషయాన్ని రుజువు చేస్తున్నదని ప్రకటించడం బాధాకరం. వినాయకుడి కథ కృతయుగంలో జరిగిందని పురాణాలు పేర్కొంటున్నాయి. అంటే వినాయకుడి కథ ఇప్పటికి 22 లక్షల సంవత్సరాల కిందటిదని పౌరాణికులందరూ అంగీకరిస్తున్నారు. చరిత్ర, పురాతత్వ శాస్త్రం ఏం నిరూపిస్తున్నాయి? 22 లక్షల ఏళ్ల క్రితం మానవుడు పచ్చి మాంసం తినే అత్యంత అనాగరిక స్థితిలో ఉన్నాడని నిరూపిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ సర్జరీ చేయగలిగిన శాస్త్ర విజ్ఞానం ఆనాటికెక్కడిది? అది దేవుడి కథ, మేం నమ్ముతాం అని ఎవరైనా అంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు కాని ఆ కథలో సైన్సు ఉందంటే నిరూపించమంటాం. ఇక ఇప్పుడు కొత్తగా వారి దాడి డార్వినిజం పైకి మరలింది. కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ ఒక వైదిక సమ్మేళనంలో మాట్లాడుతూ 'డార్విన్ పరిణామ వాద సిద్ధాంతం తప్పు. మానవుడు మొదటి నుండి మానవుడుగానే వున్నాడు' అన్నారు. అంతకంటే ముఖ్యంగా ఆయన చేసిన వాదన ఏమిటంటే, 'మన పూర్వీకులు కోతి మానవుడుగా మారడాన్ని ఎవరూ చూడలేదు. మన అమ్మమ్మలు, తాతయ్యలు అలాంటి విషయాలు ఎప్పుడూ చెప్పలేదు' అన్నారు.

ఇదేమి వింత? ప్రపంచం మొత్తంలోని శాస్త్ర లోకం అంతా సాక్ష్యాలు, రుజువులతో కూడిన డార్విన్ సిద్ధాంతాన్ని ఆమోదిస్తుంటే, మన అమ్మమ్మలు, తాతయ్యలు చెప్పలేదనే కారణంతో ఆ విజ్ఞాన విషయాన్ని తిరస్కరిస్తామా? కేవలం వాళ్లు చెప్పినవే అంగీకరిస్తామా? అలా అయితే పావురాళ్లు, ఎలుకలు, పులులు, మనుషులు ఒకరితో ఒకరు మాట్లాడుకున్న పంచతంత్ర కథలు వాస్తవమని అంగీకరించాలి. ఎందుకంటే అవి తాతయ్యలు చెప్పిన కథలు గదా!



మన పాలకులకు సైన్సు అందించే అన్ని ప్రయోజనాలూ కావాలి. సైన్సు అందించిన ఎసి కార్లూ, విమానాలూ, సెల్‌ఫోన్లూ, అన్నీ కావాలి. కాని సైంటిఫిక్ థీరీలు మాత్రం వద్దు. అలా శాస్త్రీయ ప్రపంచానికి తలుపులు బార్లా తీసిన డార్విన్ అంటే వారికి అందుకే అంత కోపం. ప్రజలు దీనిని అర్థం చేసుకోవాలి. శాస్త్రీయ దృక్పథం మీద ఆధారపడిన సమాజం కోసం కృషి చేయాలి. అలాంటి సమాజాన్ని వ్యతిరేకించే వారి గుట్టు రట్టు చేయాలి.

మన కేంద్రమంత్రికి డార్విన్‌పై అంత కోపం ఎందుకు? పరిశీలిద్దాం.

డార్విన్ పరిణామ వాదపు వెలుగులో పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు ఇప్పటికి 44 లక్షల సంవత్సరాల క్రితం కోతి దశ నుండి వెన్నెముక నిటారుగా కలిగిన మానవుడు పరిణామం చెందాడనీ, ఇప్పటికి 20 వేల సంవత్సరాల కిందటి వరకూ అత్యంత అనాగరికుడుగా జీవించాడనీ, 20 వేల సంవత్సరాల క్రితమే నిప్పును తయారుచేయడం నేర్చుకున్నాడనీ, అప్పటి నుండే మానవ నాగరికత అభివృద్ధి చెందిదనీ, ఇప్పటికి 5 వేల సంవత్సరాల క్రితమే మేడలు కట్టే నాగరికత మానవ సమాజంలో అభివృద్ధి అయిందనీ నిరూపించారు. ఇది అంగీకరిస్తే 22 లక్షల సంవత్సరాల క్రితం ప్లాస్టిక్ సర్జరీ మన వాళ్లు చేశారనే విషయం, త్రేతాయుగంలో అంటే ఇప్పటికి 9 లక్షల సంవత్సరాల క్రితం బంగారు కిరీటాలు ధరించినవారూ, బంగారు మేడలలో నివసించేవారూ ఉన్నారనే విషయం వాస్తవ విషయాలు కాకుండా, 'ప్రజల నమ్మకాలలో భాగంగా మిగిలిపోతాయి. వారు నిర్మించదలచుకున్న సమాజం అది కాదు. వారి సిద్ధాంత వేత్త ఆశీష్ నంది ఆ సమాజాన్ని గూర్చి చాలా స్పష్టంగా చెప్పారు. ప్రజల దృక్పథంలో మార్పు రావాలి. కాని ఆ మార్పు అశాస్త్రీయ దృక్పథం నుండి శాస్త్రీయ దృక్పథానికి మాత్రం కాదు. సైన్సు ఆధిపత్యాన్ని అంగీకరించే దృక్పథం నుంచి మానవ ఔన్నత్యాన్ని, ఆ ఔన్నత్యానికి పునాది వేసే జీవిత పరిస్థితులను మళ్లీ ప్రచారంలోకి తీసుకొని వచ్చే దృక్పథానికి ఆ మార్పు రావాలి. ఆ పునాదిలో అనేక సంప్రదాయాలు, మతం, పురాణ గ్రంథాలు ఉంటాయి'. (మెయిన్ స్ట్రీమ్ పత్రిక 10.10.1981)

ఎంత స్పష్టంగా చెప్పారు. సైన్సు ఆధిపత్యాన్ని అంగీకరించే దృక్పథం వద్దట! పురాణ గ్రంథాలు పునాదిగా గల సమాజం కావాలట! అసలు సైన్సంటే ఏంటి? నిరూపించబడిన విషయాల సమాహారం! దానిని వదిలివేస్తే సమాజం ఏమవుతుంది? ప్రజలు రుజువులు లేని విషయాలనే అంగీకరిస్తే, మనం మరల మధ్య యుగాల లోనికి పోమా? మూఢ నమ్మకాలలో కూరుకుపోమా? మన పాలకులకు సైన్సు అందించే అన్ని ప్రయోజనాలూ కావాలి. సైన్సు అందించిన ఎసి కార్లూ, విమానాలూ, సెల్‌ఫోన్లూ, అన్నీ కావాలి. కాని సైంటిఫిక్ థీరీలు మాత్రం వద్దు. అలా శాస్త్రీయ ప్రపంచానికి తలుపులు బార్లా తీసిన డార్విన్ అంటే వారికి అందుకే అంత కోపం. ప్రజలు దీనిని అర్థం చేసుకోవాలి. శాస్త్రీయ దృక్పథం మీద ఆధారపడిన సమాజం కోసం కృషి చేయాలి. అలాంటి సమాజాన్ని వ్యతిరేకించే వారి గుట్టు రట్టు చేయాలి. శాస్త్రీయ విజ్ఞానం మీద ఆధారపడిన మహోన్నత భారతదేశం కోసం నిర్విరామ కృషి చేయాలి.

మాటకు మాట



• ముందస్తుకు బిజెపి సిద్ధం- అమిత్ షా
అందుకేనా ఇన్ని దాడులూ దౌర్జన్యాలూ

• భిన్నాభిప్రాయాలను గౌరవించాలి- రాష్ట్రపతి సందేశం
ముందు ఆలకించమనండి చాలు! అసహనం లేకుండా..

• టెట్ గందరగోళం
అది లేనిదేమిటో చెప్పండి



• ఇళయరాజాకు పద్మ విభూషణ్
పోనీలే! తెలుగువారు కాకున్నా తెలుగు సినిమాలకు చేసిన వారొక్కరైనా వున్నారు

• వానరుల నుంచి నరులు పరిణామం చెందారనడానికి ఆధారాలు లేవు : సత్యపాల్ సింగ్
అదలా వుంచితే– నరులు వానరులవుతున్నారని చెప్పడానికి మాత్రం మీ మాటలే నిదర్శనం


• 29 నుంచి బడ్జెట్ కసరత్తు
ఉత్తుత్తి వ్యవహారం గనక చాలా కసరత్తు చేస్తే గాని కుదర్దు



• చంద్రబాబు ముఖ్యమంత్రిగా దొరకడం రాష్ట్రం అదృష్టం- గవర్నర్
ఇలాంటి భజనపరులు రాజ్యాంగ పీఠాలెక్కడం మాత్రం నిజంగా దురదృష్టం

• పోలీసు వలయంలో గొట్టిపాడు
రాష్ట్రమే బందిఖానాగా మారిపోతుంటే ఆ ఒక్క వూరుదేముంది! దళిత జపం, బహిష్కరణపై మౌనం!!


• చంద్రబాబు సునీత ఫోటోలకు క్షీరాభిషేకం
పిచ్చి కుదిరింది గనక తలకు రోకలి చుట్టుకుంటారు మరి



• సిఎం సీట్లో బాలయ్య
అమరావతి సెట్ అనుకుని వుంటారు. అయినా పాపం ఆశ చెడ్డది

• విదేశీ పర్యటనలతో నిరుద్యోగులకు ఉపాధి- మంత్రి జవహర్
ఆ దేశాల వారికి సరే సార్..మన వాళ్ల మాట చెప్పండి

• ఏడాదికి రెండు సార్లే వెంకన్న దర్శనం కోటా- మంత్రి
భక్తి ముదిరి భక్తులు పెరిగితే ఆయన మాత్రం ఏం చేస్తారులే!



• బిజెపితో కలసి పోటీ చేస్తామని చెప్పలేదు- విజయసాయి రెడ్డి
భూస్థాపితమై పోయిన ప్రత్యేక హోదా ఇస్తే కలుస్తామంటే అర్థమేమిటో ఆడిటర్ గారూ!

• సీమలో హైకోర్టు కోసం ర్యాలీ
న్యాయమే జరగలేదు, ఇక ఉన్నత న్యాయస్థానం వస్తుందా?

• అవే సంస్థలు, అవే చర్చలు-దావోస్‌లో చంద్రబాబు పర్యటన
అక్కడైనా ఖాళీగా వున్నవాళ్లేగా సమయం ఇచ్చేది

\- పీపీ

జన వాక్యం

చంద్రగ్రహణం చూద్దాం

ఈ నెల 31న ఏర్పడే చంద్రగ్రహణం నాడు రాష్ట్ర వ్యాప్తంగా వున్న దేవాలయాలన్నీ మూసివేస్తున్నారు. చంద్రుడిని మింగే రాహు కేతువుల సొంగ ఈ దేవుళ్ళ మీద పడి మైలపడి పోతారంట! అందుకే గుళ్ళు, గోపురాలు మూసివేస్తున్నారు. అంతే కాక ఆ రోజు గర్భిణీలు బయట తిరిగితే, వారికి పుట్టే పిల్లలు మొఱ్ఱితో పుడతారని భయపెడుతున్నారు. స్కూళ్లలో చంద్రుడు, భూమి ఒక దాని చుట్టూ మరొకటి తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో భూమి నీడ చంద్రునిపై పడటం వల్ల గ్రహణం ఏర్పడుతుందని చెప్పే కొందరు సైన్సు టీచర్లు కూడా పట్టు విడుపు స్నానాలు చేస్తారు. ఇంకా ఆ సమయంలో ఏం తినకూడదు, ఏ పనీ చెయ్యకూడదని ఇప్పటికీ భయపెడుతూనే వుంటారు. వేల సంవత్సరాలుగా ఇదే తంతు జరుగుతోంది. అవన్నీ మూఢ నమ్మకాలు. వాటిని వదులుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా ఇటువంటి మూఢ నమ్మకాలను ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. ఆ పని ప్రభుత్వమే చెయ్యాలి. అందుకోసం ప్రజలే ప్రభుత్వంపై వత్తిడి తేవాలి.

నార్నె వెంకట సుబ్బయ్య,
హేతువాద సంఘం.

సవరణ

25.1.18 జన వాక్యంలో 'రాహువు, కేతువు గ్రహాలు కావని నిరూపితమై నానమ్మ చెప్పిన కథ కంచికి చేరింది' అని చదువుకోగలరు.

\- ఎడిటర్

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

రైల్వే జోన్ కోసం 'రైల్ దీక్ష'





కొణతాల రామకృష్ణ

రాజకీయ ప్రయోజనాల కోసం అర్థాంతరంగా రాష్ట్ర విభజన జరిపి, అవశేష ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాన్ని నాటి యుపిఏ ప్రభుత్వం నడి సముద్రంలో పడవేసింది. ఆ తరువాత ఘనమైన హామీలతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం సహితం అధికార చరమాంకానికి చేరుకొని, తిరిగి ఎన్నికలకు సిద్ధపడుతోంది. హామీలను నెరవేర్చక పోగా, కనీసం పార్లమెంట్ సాక్షిగా ఆమోదించిన విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చడం పట్ల కించిత్తు శ్రద్ధ చూపకపోవడం దారుణం. ముఖ్యంగా రెండు దశాబ్దాలకు పైగా కోటి మంది జనాభా గల ఉత్తరాంధ్ర ప్రజలు కోరుతున్న విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు గురించి మాట్లాడకపోవడం నమ్మిన ప్రజలను వంచించడమే.

ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌కు సమర్పించే బడ్జెట్‌లో రైల్వే అంశాలు కూడా ఉంటాయి. ఈ ప్రభుత్వానికి ఇదే పూర్తి స్థాయి చివరి బడ్జెట్. ఈ బడ్జెట్‌లో రైల్వే జోన్ ప్రకటించనిచో ఈ ప్రభుత్వం కూడా ఈ విషయంలో ప్రజలను వంచనకు గురిచేసినట్లే. అందుకే ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంపై మరోసారి వత్తిడి తెచ్చేందుకు రాజకీయాలతో నిమిత్తం లేకుండా, ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో జనవరి 27 నుండి 29 వరకు 'రైల్ దీక్ష' చేపట్టాం.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్–2014లో కొత్తగా ఏర్పడే అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం... ఆరు నెలల్లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి... సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ... కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ చట్టంలో చేర్చడంతో... తమ చిరకాల ఆకాంక్షలు తీరబోతున్నట్లు ఈ ప్రాంత ప్రజలు సంతోషించారు. పైగా తాము అధికారంలోకి వస్తే రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ బిజెపి ఎన్నికల ప్రణాళికలో స్పష్టమైన హామీ ఇచ్చింది.

పలువురు కేంద్ర మంత్రులు పలు సందర్భాలలో పార్లమెంట్‌లో, బయట కూడా ఈ విషయమై కేంద్రం వేగంగా తగు చర్యలు తీసుకోబోతున్నట్లు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి 44 నెలలైనా ఈ విషయంలో ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఈ ప్రాంత ప్రజలను దారుణంగా మోసం చేయడమే. మధ్యలో రైల్వే జోన్ ఏర్పాటుకు సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉన్నాయన్న సంకేతాలను మీడియాలో వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే ప్రయత్నం కూడా చేసారు.

అందుచేత ఇప్పటి వరకు రైల్వే జోన్ కోసం విశాఖపట్నంకే పరిమితమైన ఈ ప్రాంత ఆందోళనలను మొదటిసారిగా రైల్ దీక్ష ద్వారా ఢిల్లీకి, కేంద్ర ప్రభుత్వ ముంగిటికి తీసుకెళుతున్నాం. దేశంలో ప్రతి రాష్ట్రంలో ఒక రైల్వే జోన్ ఏర్పర్చడం కేంద్ర ప్రభుత్వ విధానంగా ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మూడు రైల్వే డివిజన్‌లున్నా రైల్వే జోన్ లేకపోవడం గమనార్హం. ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్ తెలంగాణ ప్రాంతానికి వెళ్ళిపోయింది. కొత్తగా ఏర్పడిన చిన్న, చిన్న రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్‌లకు కూడా రైల్వే జోన్లను ఏర్పాటు చేశారు.

ప్రస్తుత ప్రమాణాల ప్రకారం రైల్వే జోన్‌కు అవసరమైన వసతుల కల్పన కోసం 200 ఎకరాల భూమి అవసరం అవుతుంది. అయితే విశాఖపట్నంలో రైల్వేల వద్దనే 782 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. పైగా రైల్వే ఆసుపత్రి, క్వార్టర్స్ వంటి పలు మౌలిక సదుపాయాలు ఇప్పటికే ఇక్కడ ఉన్నాయి. దేశంలో అతి పెద్ద డీజిల్ లోకో షెడ్ ఇక్కడే ఉంది. వ్యాగన్ వర్క్ షాప్, కోచ్ డిపో వంటి పలు కీలక రైల్వే మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయి. ఒక రైల్వే జోన్‌కు అవసరమైన అనువైన పరిసరాలు బహుశా దేశంలో మరెక్కడా లేవని చెప్పవచ్చు.

ఇక్కడ రైల్వే జోన్ ఏర్పాటు చేయడంలో ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి ఏకాభిప్రాయం ఉంది. ఇప్పటికే రాష్ట్ర శాసనసభ మూడు తీర్మానాలు కూడా చేసింది. ఇక్కడ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక పర్యాయాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పారిశ్రామికాభివృద్ధికి అవకాశం వున్న ప్రాంతమే రైల్వేలకు సహితం లాభదాయకంగా ఉంటుంది. ముమ్ముందు ఈ ప్రాంతంలో మరిన్ని భారీ పారిశ్రామిక పెట్టుబడులకు రంగం సిద్ధమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

ఎన్నో ఆశలు కల్పించి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ విషయంలో మొండి చేయి చూపితే ఉత్తరాంధ్ర ప్రజలలో తీవ్ర అశాంతికి కారణమయ్యే ప్రమాదం ఉంది. తమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి చేతికి అందొచ్చిన అవకాశాన్ని దారుణంగా ఈ ప్రభుత్వం తీసేసుకున్నట్లు భావించవలసి వస్తుంది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా ఒక నిర్ణయం తీసుకోలేక పోవడం వల్లనే జాప్యం జరుగుతున్నది గాని, మరెటువంటి అడ్డంకులు లేవు.

2016 మార్చి 16న లోక్‌సభలో కేంద్ర రైల్వే సహాయమంత్రి మనోజ్ సిన్హా ఒక ప్రశ్నకు సమాధానంగా 'ఈ విషయమై కమిటీ నివేదికను సమర్పించింది. అయితే చివరి నిర్ణయం తీసుకొనే ముందు పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సహా అందుకు సంబంధించిన వివిధ వర్గాల వారిని కూడా సంప్రదించమని ఆ కమిటీని రైల్వే మంత్రి అడిగారు' అని చెప్పారు. ఈ మాట చెప్పి రెండు ఏళ్ళు కావస్తున్నది. ఇంకెంతకాలం సంప్రదించాలి? అసలు ఇప్పటి వరకు ఎవరిని సంప్రదించారు? ఇవన్నీ కాలయాపన కోసం చెబుతున్న కుంటిసాకులుగానే భావించవలసి వస్తుంది.

పార్లమెంట్‌లో చేసిన చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వంలో భాగస్వామి. టిడిపికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రివర్గంలో ఉన్నారు. వారిలో ఒకరు ఉత్తరాంధ్రకు చెందినవారే. అదే విధంగా బిజెపికి చెందిన ఇద్దరు రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్నారు. అయినా రైల్వే జోన్ విషయంలో కేంద్రానికి వినతి పత్రాలు ఇచ్చి ఊరుకోవడం మినహా ప్రధాని మోడీపై, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడం పట్ల, రైల్వే జోన్ సాధనకు తగు ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలసి, భేషజాలకు పోకుండా ఉమ్మడిగా కేంద్రంపై వత్తిడి తెస్తే గాని రైల్వే జోన్ సాధించుకోలేమని గ్రహించాలి.

(రచయిత మాజీ మంత్రి, పార్లమెంట్ మాజీ సభ్యులు)

jeevanapageps@gmail.com
ప్రజాశక్తి
జీవన the family
JEEVANA

మానవ దేహం అంగడి సరుకా?!

రామ్‌గోపాల్ వర్మ.. ఒకప్పుడు క్రియేటివ్ డైరెక్టర్‌గా పేరున్న దర్శకుడు. తర్వాత తాను తీసిన దెయ్యం, భూతం, రక్తపాతాల సిన్మాల వల్ల.. ఆ సినిమాలు తెచ్చిన సంచలనాల వల్ల.. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా చేసే ట్వీట్ల వల్ల 'క్రియేటివ్ డైరెక్టర్' ట్యాగ్‌లైన్ కాస్తా వివాదాస్పద డైరెక్టర్‌గా మారింది. అటు మీడియా, ఇటు ప్రేక్షకులూ.. వర్మ తీసే సినిమాల కంటే.. చేసే ట్వీట్లపైనే ఎక్కువ ఫోకస్ పెట్టేలా అటెన్షన్ క్రియేట్ చేస్తున్న వర్మ తాజాగా 'గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ (జిఎస్‌టి)' అనే యూట్యూబ్ ఛానల్ సినిమా టీజర్‌తో మరోసారి వార్తల్లోకెక్కాడు. ఈసారి పెద్దఎత్తున మహిళా సంఘాలు, సాంస్కృతికరంగ మేధావులు, మానసిక వైద్యులు వర్మ చేసే వితండవాదాన్ని, రిలీజ్ చేసిన టీజర్‌ని అంతేస్థాయిలో నిరసించారు. అంతేకాదు వర్మపై పలుచోట్ల కేసులూ పెట్టారు. అయినా.. వర్మ మాత్రం 'నా సినిమా.. నా ఇష్టం' అంటూ తనదైన శైలిలో వాదనలు వినిపిస్తున్నారు. వర్మ 'సినిమా' తీరుపై సమాజం ఘాటుగానే స్పందిస్తోంది. మానవ దేహం సరుకు కాదు. అది అపారమైన సహజ వనరు. కనుక మానవ దేహాల వ్యాపారాన్ని, మానవ అవయవాల వ్యాపారాన్ని ప్రపంచం నిషేధించింది. అయినా ఈ వ్యాపారాలు చీకటి రాజ్యంగా సాగుతూనే ఉన్నాయి.

- జీవన డెస్క్



ఇది.. లైంగిక దోపిడీ

స్త్రీలు స్నానాలు చేస్తుంటే, బట్టలు మార్చుకుంటుంటే, స్త్రీ-పురుషులు వారి ఏకాంతంలో ఉన్నప్పుడు వారి కార్యకలాపాల్ని దొంగచాటుగా చూసి ఉద్రేకపడి సంతృప్తి చెందే బాపతు అన్ని కాలాల్లోనూ ఉన్నారు. ఇటువంటి జాఢ్యానికి ప్రస్తుతం కేరాఫ్ అడ్రసు నెట్. నువ్వెవ్వరో తెలియకుండా నీవు ఏదైనా చూడవచ్చు. దొరక్కుండా నీచంగా మాట్లాడొచ్చు.. కనబడకుండా వేధించవచ్చు. అత్యాచారాలు కూడా చేయొచ్చు. ఇదో చీకటి లోకం. ఈ నెట్‌కి సంబంధించిన 'పగటి'లోకంలో ఉన్నవారి కంటే ఈ అంధకార జగతిలో బతికే జీవులు బాగా పెరిగిపోయారు. ఈ జీవులకు ఆహారంలో ప్రధానభాగం పోర్నోగ్రఫీ.

విచ్చలవిడి.. దైవత్వమా?!

విచ్చలవిడి లైంగిక భోగాలు ఒక దైవత్వం అంటారు కొందరు. ఓషో (రజనీష్)తో సహా పత్రి దాకా, నిత్యానంద నుంచి డేరాబాబా దాకా అదే పనిలో బతికారు. ఇది సుఖరోగాలు, ఎయిడ్స్ వ్యాపించడానికే కాదు.. అనేకమంది స్త్రీ-పురుషులు ఈ లైంగిక దైవత్వాన్ని నమ్మి, లైంగిక బానిసలుగా బతికారు. ఇది చాలా గొప్ప అని ఎవరైనా అంటే అది అజ్ఞానం అన్నా కావాలి, నిర్లజ్జగా దోపిడీ చేసే సాధనంగా వాడుకునే స్వార్థం అన్నా కావాలి.

పోర్న్ సినిమాల్లో జరిగే శరీరపు దోపిడీ చాలా క్రూరమైంది. వాటిలోని యాంత్రికతను, హింసనూ చూసి ఆనందించడం ఒక ప్రత్యేకమైన జబ్బు. ఇటువంటి జబ్బులు వైద్యశాస్త్రంలో నమోదై ఉన్నాయి. పోర్నోగ్రఫీ వల్ల అనేక వికృత పోకడలు స్త్రీ-పురుష సంబంధాల్లో బాగా పెరిగాయి.

ఇదొక వికృత వ్యాపారం

జీవితం మొత్తాన్ని వినిమయంలో లెక్కగడుతున్న మార్కెటీకరణ ప్రస్తుతం శరీరాల వ్యాపారాన్ని, లైంగిక సంబంధాల వ్యాపారాన్ని ఎలక్ట్రానిక్ మాధ్యమంలో నాలుగు కోట్ల పోర్న్‌సైట్ల ద్వారా విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇది రకరకాల వికృతాలు, పైశాచిక స్వభావం గల వారికి రంగంగా మారింది. 'వికృత' అవసరాన్ని సృష్టించడం.. దాన్నుంచి లాభం పిండుకోవడం దోపిడీ ధర్మం. కొందరు మాదక ద్రవ్యాల్లో మునిగి తేలుతున్నట్టు మరో కోణంలో పోర్నోగ్రఫీ పనిచేస్తుంది.



ఇప్పటిదాకా చాటుమాటున చూసుకుంటున్న వారికి ధైర్యం కలిగించి, ఇదొక విప్లవం అని చెప్పుకుంటూ గర్వపడటం అనాగరికమే. వర్మ గొప్పగా చెప్పుకుంటున్నదాని సారాంశం ఇదే!

స్వేచ్ఛ గురించి స్త్రీకి తెలుసు

స్త్రీలకు ఎలాంటి స్వేచ్ఛ కావాలో స్త్రీలు కచ్చితంగా నిర్ణయించుకోగలరు. ఆ విజ్ఞత వారికి లేదనుకోవడం పచ్చి పితృస్వామ్య ఆధిపత్యం. గొప్పగా గొప్ప పదాలు వాడినంత మాత్రాన దాని అసలు రూపం మారదు. స్త్రీ శరీరాన్ని లైంగిక హింస దోపిడీతో ఛిద్రం చేసి, దాన్ని కొత్తదనంగా చెప్పుకుని ఆనందించటం ఒక అనాగరికం, గర్హనీయ నేరం.

ఇది తిరోగమనం

లైంగిక సంబంధాల్ని బహిరంగంగా అందరికీ చూపించడమే వీరత్వం.. అనుకుంటే ఆ పని జంతువులన్నీ రోజూ చేస్తూనే ఉన్నాయి. మనిషి జంతుస్థాయిలో ఉన్నపుడు అదే జరిగింది. మనిషిగా మనిషి మారుతున్న క్రమమే ప్రేమ భావనలు, లైంగిక చర్యల్లో గోప్యత (ప్రైవసీ) ఏర్పడ్డాయి. ప్రేమ లేని కామవాంఛలు, ఎక్కడంటే అక్కడ ఎప్పుడంటే అప్పుడు.. ఎవరితో బడితే వారితో తీర్చుకోవాలి అనే వాదన తిరిగి జంతుదశకు తీసుకెళుతుంది. సెక్స్, భక్తీ ఎప్పుడైనా లాభాలార్జించి పెడతాయి. రేటింగ్స్ కోసం ఈ సదరు రుగ్మత గల వ్యక్తులకు గంటల తరబడి సమయాన్ని టీవీ ఛానల్స్ కేటాయించడమూ తప్పే.

దోపిడీ ప్రపంచం సృష్టించే సాంస్కృతిక లంపెన్స్ గురించి కాదు; అవి చేసే హానిపై ప్రచారం జరగాలి. అవగాహన పెరగాలి. ప్రత్యేకించి యువతరం ఈ టాక్సిక్ వేస్ట్ ప్రమాదాన్ని గుర్తించాలి. మానవ దేహాల్ని సరుకుగా మార్చే క్షుద్రత్వాలను అంతం చేయాలి.

- దేవి,
సాంస్కృతిక కార్యకర్త



ఇది.. మానసిక రోగమే

గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ దర్శకుడు వర్మ.. తనలోని అపసవ్య లైంగిక మనస్తత్వాన్ని సమర్థించుకుంటూనే తనలాంటి వారి మద్దతును కూడగట్టుకోవాలనే తాపత్రయం ఇందులో ఎక్కువగా కన్పిస్తోంది. తన విశృంఖలతని ఫెమినిస్టులు కోరుతున్న లైంగిక స్వేచ్ఛగా తప్పుడు అభిప్రాయాన్ని ప్రచారంలోకి తెస్తున్నాడు. ఫెమినిస్టులు కోరుకునేది లైంగిక విశృంఖలత కాదన్న వాస్తవాన్ని ముందు అతడు తెలుసుకోవాలి. స్త్రీ-పురుష సమానత్వం కోసం ఫెమినిస్ట్ ఉద్యమం మొదలైందన్న చారిత్రక వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదు.




వ్యక్తికి నైతిక విలువలు ఉన్నట్టే- వ్యక్తుల సమూహానికీ సామాజిక నైతిక విలువలు ఉంటాయి. అవి సమాజ గమనాన్ని అభ్యుదయం వైపు తీసుకెళ్లేందుకు తోడ్పడతాయి. అసభ్యకరమైన రీతిలో మీడియాలో ప్రశ్నలు వేస్తూ తనను తానో మేధావిగా భావిస్తున్న వర్మ ప్రవర్తన ఏ కోణంలో చూసినా చాలా అపసవ్యమైనదే!

లైంగిక స్వేచ్ఛ వేరు... విచ్చలవిడితనం వేరు

చెడుని పదే పదే చూపిస్తూ ప్రచారం చేయడం ద్వారా అది చెడు కాదని, ప్రజల్లో చెడుకు అలవాటుచేసే ధోరణి, ఆమోదించే ధోరణి ఈ మధ్య కాలంలో చాలా ఎక్కువైంది. అందుకు సినిమా పరిశ్రమా మరింత దారులు వేస్తోంది. మనిషిగా ఆలోచించే ప్రతి ఒక్కరికీ సామాజిక నైతిక విలువలు కాపాడడం ఒక బాధ్యత. అంతేగానీ వర్మ చెబుతున్న సెక్స్ లిబరేషన్ నైతిక విలువలకు పూర్తిగా భిన్నమైనది. తన సినిమా ఉమెన్ సెక్స్ లిబరేషన్ కోసం అంటూ అతను చేస్తున్న ప్రచారం చాలా తప్పు. పురుషాధిక్యతని వ్యతిరేకించే ఫెమినిస్టులు ఎక్కడా విశృంఖల సెక్స్‌ని సమర్థించటం లేదు.

ఇంటర్నెట్ అందరికీ ఆందుబాటులోకి వచ్చాక- సమాచారం కోసమో, వ్యాపార ప్రకటనల కోసమో, విజ్ఞాన వినోదాల కోసమో పరిమితం కావడం లేదు. ఆలోచించే, ప్రశ్నించే, కొత్తదనాన్ని ఆవిష్కరించే శక్తి గల యువత మెదళ్లను మొద్దుబరిచేందుకు, పక్కదోవ పట్టించేందుకూ వాడుతున్నారు. ఈ సమాజంలోని చెడును రక్షించాలనుకునే శక్తులే ఈ పని చేస్తున్నాయి. వర్మ కూడా అందులో భాగమవుతాడా? లేక పునరాలోచన చేస్తాడా? అన్నది అతని నిర్ణయం.



సెక్స్ ఎడ్యుకేషన్ వేరు - పోర్నోగ్రఫీ వేరు

పోర్న్ చిత్రాలు ఎంతమాత్రమూ సెక్స్ ఎడ్యుకేషన్‌ని అందించవు. సెక్స్ ఎడ్యుకేషన్ అంటే స్త్రీ, పురుషుల్లో వయసు పెరిగేకొద్దీ వచ్చే లైంగిక మార్పులు, శరీర ఎదుగుదల, హార్మోన్ల ప్రభావంతో వచ్చే మార్పులు, సంసార సమస్యలు, లైంగిక వ్యాధులు తదితర విషయాలు. అంతేగానీ బూతు సినిమాలు కాదు. అలా చూపించాలనుకోవడం.. అందుకోసం ఎంతకైనా బరితెగించడం 'బోర్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్' అనే ఆ మానసిక వ్యాధికి ఉన్న లక్షణం. ప్రజల పర్సనల్ లైఫ్‌ని తన అపసవ్య లైంగిక ఉద్వేగాలతో రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం నేరం. మానసిక రోగం కూడా!

- డాక్టర్ జి. సమరం,
సెక్సాలజిస్ట్

సన్నిహిత



నా పేరు గిరి. నేను పుట్టుకతోనే అంధుడిని. లతను నేను ప్రేమించి పెళ్లి చేసుకున్నా. లతకు నా అంత అంధత్వం లేదు. ఆమెకు కొంచెంకొంచెం కనబడుతుంది. మేమిద్దరం చాలా సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నాం. మాకొక పాప. ఇరుగుపొరుగు సాయంతో పాపను చాలా చక్కగా పెంచగలుగుతున్నాం. పాప ప్రస్తుతం స్కూలుకు వెళ్లే వయస్సుకొచ్చింది. టీవీలో ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాల గురించి వింటూంటే చాలా భయమేస్తుంది. ఈ సమాజంలోని చెడ్డ వ్యక్తుల నుంచి నా కూతురుని ఎలా కాపాడుకోవాలో సలహాలివ్వండి?

బ్యాడ్.. గుడ్.. టచ్

పాప దృష్టి సవ్యంగానే ఉందని ఆశిస్తున్నాను. మీ ఉత్తరంతో పాప దృష్టి సవ్యంగా ఉందని అర్థం చేసుకుంటున్నా. అయితే ఏదైనా లోపం ఉన్నా లేకపోయినా ప్రతి బిడ్డపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు మీరు తీసుకుంటూ, పాపకూ తగిన జాగ్రత్తలు నేర్పిస్తే మీరు దిగులు పడాల్సిన అవసరం ఉండదు. మీ పాపకు స్కూలుకు వెళ్లే వయస్సు వచ్చింది కాబట్టి.. తనను ఆటోల్లోనో, రిక్షాల్లోనో, ఇరుగుపొరుగు పురుషులుగానీ, ఇతరులు ఎవరైనాగానీ పాపను తాకే విధానంలో ఉండే తేడాలను పాపకు అర్థమయ్యేలా వివరించండి. ఇతరులు తన శరీరంలో తాకే ప్రదేశాన్ని బట్టి బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్ ఏమిటో పాపకు అర్థమయ్యేలా చెప్పండి. తనను బ్యాడ్‌టచ్ చేస్తే వెంటనే తను అప్రమత్తమవ్వాలనే విషయాన్ని పాపకు వివరించండి. ముఖ్యంగా తన తల్లి సహాయంతో అన్ని విషయాలను పాప తెలుసుకుంటే మంచిది. ఇతరులు తనను తాకరాని చోట తాకితే పాప తనను తాను ఎలా రక్షించుకోవాలో పాపకు తెలపండి. ఆ సమయంలో ఇతరుల సాయం తీసుకునేలా పాపను సిద్ధం చేయండి. ఇతరులు ఏదైనా తిండిని ఆశచూపితే ఆ వస్తువును పాప తీసుకోకుండా ఉండేలా చూడండి. ఎవరైనా తనను అతిగా పక్కకు తీసుకెళ్తుంటే తనను తాను రక్షించుకోవడం నేర్పండి. అలాంటి సమయంలో తాను ధైర్యంగా ఎలా ఉండాలి.. తనకు అండగా ఉండే ఇరుగుపొరుగు లేదా మీ సాయం ఎలా తీసుకోవాలి.. అనేది నేర్పండి. తన స్వీయ రక్షణ గురించి చిన్నచిన్న జాగ్రత్తలు చిన్నప్పటి నుంచి పాపకు నేర్పండి. ఇది పాపగానీ, బాబుగానీ ఇతరులు తమపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటే ఎలా గుర్తించాలి అనేది చిన్నచిన్న సూచనల ద్వారా తెలపండి. వీలైనంత వరకు పాపను ఒంటరిగా కాకుండా సమూహాల్లో ఉండేలా చూడమనండి. ఎవరినీ అతిగా నమ్మకుండా ఉండమని చెప్పండి. తను స్కూలుకు ఏ పిల్లలతోనైతే కలిసి వెళుతుందో ఆ పిల్లల తల్లిదండ్రుల సహాయమూ తీసుకోమనండి. ఏదైనా సమస్యను అందరూ కలిసి ఆలోచించేలా ఉంటే మంచిది. ★





డా. పద్మజ, సైకాలజిస్టు

మీ కోసం



నెయ్యి త్వరగా పేరుకుపోకుండా ఉండాలంటే మీగడ కట్టేటప్పుడు కొద్దిగా నీళ్లు చల్లాలి.

జీవన సౌరభం

చెడు అలవాటును అరికట్టకపోతే, అది అతి త్వరలోనే ఒక అవసరంగా మారిపోతుంది.

కాళ్ల పగుళ్ల నివారణ ఇలా..

చర్మం పొడిబారడం, అధిక బరువు, ఎక్కువసేపు నిలబడి ఉండడం, పాదాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం వంటి వాటివల్ల కాళ్లు పగులుతాయి. కొంతమందికైతే కాళ్ల పగుళ్ళ నుంచి రక్తమూ వస్తుంటుంది. కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా కాళ్ల పగుళ్ల నుంచి బయటపడవచ్చు.

- పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడుక్కొని, తడి లేకుండా తుడుచుకోవాలి. తర్వాత వాజిలీన్, పెట్రోలియం జెల్లీ లేదా కొబ్బరినూనె రాసుకొని.. కాటన్ సాక్స్ వేసుకొని పడుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేయడం వల్ల పాదాలు చాలా తక్కువ రోజుల్లోనే సున్నితంగా తయారవుతాయి.
- నిమ్మరసంలో ఆముదం నూనె, రోజ్‌వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని పాదాలను శుభ్రం చేసుకున్నాక రాసుకోవాలి.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా రాతిఉప్పు, నిమ్మరసం వేయాలి. ఆ నీటిలో పది నిమిషాలు పాదాలను ఉంచాలి. ఇలా చేయడం వల్ల పాదాలు శుభ్రం అవ్వడమే కాకుండా మృదువుగా తయారవుతాయి.
- ప్రతిరోజూ పాదాలను శుభ్రంచేసుకొని, ఆలివ్ ఆయిల్ రాసుకోవడం ద్వారా కాళ్ల పగుళ్ల నుంచి బయటపడొచ్చు.
- ఆముదం, కొబ్బరినూనె రెండింటినీ సమపాళ్లల్లో కలపాలి. అందులో చిటికెడు పసుపు కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ పేస్ట్‌ను కాళ్లపగుళ్లపై రాయాలి.



- కొద్దిగా గ్లిజరిన్ కలిపిన రోజ్‌వాటర్‌ని పగుళ్లపై రాసుకోవడం వల్ల పగుళ్లు మానిపోతాయి.
- వేప నూనెలో పసుపు వేసి మిశ్రమాన్ని తయారుచేసుకోవాలి. దాన్ని కాళ్ల పగుళ్ళున్న చోట రాసుకోవాలి.
- నిమ్మచెక్కను ప్రతిరోజూ పగుళ్లకు రుద్దుకోవడం ద్వారా కొన్నిరోజులకు కాళ్లు మృదువుగా తయారవుతాయి.

★

కనుబొమ్మల సొగసు



ముఖానికి అందం కన్నులు, వాటికి అందం కనుబొమ్మలు. అందుకే కనుబొమ్మలకి చక్కటి ఆకృతినిస్తే చాలు ముఖం ఎంతో ఆకర్షణీయంగా కనబడుతుంది. అంత ముఖ్యమైన కనుబొమ్మలు ఏ ముఖాకృతికి ఎలా ఉండాలో తెలుసుకుంటే మరింత బాగుంటుంది కదూ! ముఖం గుండ్రంగా చంద్రబింబంలా ఉందనుకోండి.. ఐబ్రో ఎంత పొడవు ఉంటే అంత పొడవు ఉంచుకుని, చివర్లు మరీ సన్నగానూ, మరీ లావుగానూ లేకుండా చూసుకోవాలి. ఓవెల్ షేప్‌లో అంటే ముఖం బాదం ఆకృతిలో ఉన్నప్పుడు కనుబొమ్మల షేప్ చిన్నగా ఉండాలి. మధ్య భాగం ఒత్తుగా.. కంటి చివరికి వచ్చేసరికి సన్నగా ఉండాలి. చతురస్రాకారాన్ని పోలి ఉన్న ముఖాకృతి గలవారు కనుబొమ్మల్ని చిన్నగా చంద్రవంకలా షేప్ చేయించుకోవాలి. ★

మార్కెట్లకు సెలవు

ముంబయి : జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లకు సెలవు ప్రకటించారు. అదే విధంగా బాండ్స్, కరెన్సీ మార్కెట్లు కూడా పనిచేయవు. కాగా శనివారం, ఆదివారం సాధారణ సెలవులు రానున్నాయి. దీంతో తిరిగి సోమవారం మార్కెట్లు తెరుచుకోనున్నాయి. కాగా గురువారం సెషన్‌లో సెన్సెక్స్ 111 పాయింట్లు నష్టపోయి 36,050 వద్ద ముగిసింది. నిఫ్టీ 16 పాయింట్ల తగ్గుదలతో 11,070 వద్ద నమోదయ్యింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేటాయించిన తక్కువ మూలధనం మదుపర్లను నిరాశకు గురి చేశాయి.

మినరల్, లోహ కాన్ఫరెన్స్..

వచ్చే సెప్టెంబర్‌లో 'ఖనిజ వనరులు, లోహాల'పై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ఎన్ఎండిసి నిర్ణయించింది. దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ఆ కంపెనీ సిఎండి బాయిజేంద్ర కుమార్ ఆవిష్కరించారు.



ఎన్ఎండిసిని కొత్త శిఖరాలకు చేర్చాలి

చైర్మన్ బాయిజేంద్ర కుమార్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అధిక ఉత్పత్తి, అమ్మకాలు సాధించాలని ఎన్ఎండిసి సిబ్బందికి ఆ కంపెనీ చైర్మన్ ఎన్ బాయిజేంద్ర కుమార్ నిర్దేశించారు. ప్రస్తుత సవాళ్ల కాలంలోనూ తమ లోహ దృఢత్వాన్ని నిరూపించాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్ఎండిసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో మాట్లాడుతూ భవిష్యత్తులో ఎన్ఎండిసి నూతన శిఖరాలకు చేరడానికి ఉద్యోగులంతా అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రపంచ వర్ధమాన దేశాల్లో భారత్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాడానికి పాటుపడాలన్నారు. ఎన్ఎండిసి విజయవంతంగా డైమాండ్ జూబ్లీ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందని గుర్తు చేశారు. కాగా ఇదే స్ఫూర్తితో ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొని ఎన్ఎండిసి కుటుంబం మరింత ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా కొన్ని కార్పొరేట్ స్థాయిలో జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించాలని ఎన్ఎండిసి నిర్దేశించుకుందన్నారు. ఈ క్రమంలోనే 2018 సెప్టెంబర్‌లో ఖనిజ వనరులు మరియు లోహాలపై అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. దీని కోసం రూపొందించిన వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండిసి డైరెక్టర్లు ఎన్‌కె నందా, పికె సత్‌పతి, డిఎస్ అహ్లువాలియా ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత బ్యాంకింగ్‌లోకి అమెజాన్..!

పొంచి ఉన్న ముప్పు



న్యూఢిల్లీ : అమెరికా కేంద్రంగా పని చేస్తున్న ప్రముఖ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ భారత్, మెక్సికో లాంటి దేశాల్లో పేమెంట్ బ్యాంకింగ్ సర్వీసుల్లోకి రావడానికి కసరత్తు చేస్తోన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే భారత బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. ఇప్పటికే ఆన్‌లైన్ మార్కెట్‌తో భారత్‌లోని అనేక స్టోర్లు, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ బ్యాంకింగ్ సేవల కోసం అమెజాన్ పెట్టుబడులు, కొనుగోళ్ల కోసం ఫైనాన్స్ టెక్నాలజీ స్టార్టప్‌లను కూడా సంప్రదిస్తున్నట్లు సిబి ఇన్‌సైట్స్ రీసెర్చ్ ఒక రిపోర్టులో తెలిపింది. పైగా ఇంటివద్దే నగదు తీసుకునే సర్వీసుల కోసం అమెజాన్ ప్రత్యేకంగా డిజిటల్ వ్యాలెట్‌ను తీసుకొస్తుంది. భారత్‌లోనూ ఈ సేవలు ప్రారంభించనుంది. అదే జరిగితే వినియోగదారుడు ఈ వాలెట్‌లో నగదు డిపాజిటును ఇంటి వద్ద నుంచే చేయవచ్చు. ఈ వ్యాలెట్ కూడా బ్యాంక్ ఎలా పని చేస్తుందో అదే విధమైన సర్వీసులను అందించనుంది. విత్త స్టార్టప్‌లను కొనుగోలు చేయడం వాటిల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా వేగంగా విస్తరించాలని భావిస్తోంది. కాగా మెక్సికోలో కూడా క్రెడిట్, డెబిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా అమెజాన్ క్యాష్‌పేమెంట్ సర్వీసులను తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. కాగా అమెరికాలో ప్రారంభించిన ఈ సర్వీసులకు అనూహ్య స్పందన లభిస్తుంది. అమెరికాలో ఈ సేవలను 3 కోట్ల మంది ఉపయోగించుకుంటున్నారని, దీంతో వారు సాంప్రదాయ బ్యాంకులకు వెళ్లడం మానేశారని పలు రిపోర్టులు పేర్కొన్నాయి. ఇది ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని అక్కడి నిపుణులు, బ్యాంకింగ్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఆటోమేషన్ ఐదు రెట్లు పెరుగొచ్చు

చెన్నయ్ : వచ్చే 2025 నాటికి భారత్‌లో ఆటోమేషన్ మార్కెట్ 25 రెట్లు పెరగనుందని బిఐఎస్ రీసెర్చ్ ఒక రిపోర్టులో అంచనా వేసింది. 2017-2025 మధ్య రోబోటిక్ మార్కెట్ ప్రతీ ఏడాది 20 శాతం చొప్పున పెరగనుందని పేర్కొంది. దీంతో వచ్చే ఏడేనిమిది ఏళ్లలో 350 మిలియన్ డాలర్ల విలువ చేయనుందని అంచనా వేసింది. 2016లో ఈ విలువ 64.9 మిలియన్ డాలర్లుగా ఉంది. ఈ రిపోర్టు ప్రకారం అత్యధికంగా దీర్ఘకాల వ్యాధుల నయానికి అత్యాధునిక టెక్నలాజీ అందుబాటులోకి రానుంది. సర్జరీల్లో రోబోల పాత్ర పెరగనుంది. అదే విధంగా ఆటోమేషన్ రంగం అభివృద్ధి, పరిశోధనకు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు భారీగా వ్యయం చేయనున్నాయి. అంతర్జాతీయంగా రొబోటిక్ టెక్నలాజీ ప్రతీ ఏడాది 12 శాతం చొప్పున పెరిగి 12.6 బిలియన్ డాలర్లకు చేరొచ్చు. ప్రస్తుతం భారత్‌లో ఈ రంగంలో 25 కీలక సంస్థలున్నాయి.

64 మిలియన్ టన్నుల...

సరుకు రవాణ లక్ష్యం

- ఇప్పటికే 51ఎంటి సాధించాం
- సామాజిక కార్యక్రమాలకు ప్రాధాన్యత
- వైజాగ్ పోర్టు చైర్మన్ క్రిష్ణ బాబు వెల్లడి



విశాఖపట్నం : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి విశాఖపట్నం పోర్టు నుంచి 64 మిలియన్ టన్నుల (ఎంటి) సరుకు రవాణ చేయగలమని ఆ పోర్టు చైర్మన్ ఎంటి క్రిష్ణ బాబు అన్నారు. 2017-18 డిసెంబర్ ముగింపు నాటికి 51 మిలియన్ టన్నుల సరుకు రవాణ చేశామని తెలిపారు. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం సరుకుతో పోల్చితే 1.5 మిలియన్ టన్నులు అదనమని అన్నారు. మార్కెట్‌లోనే అనేక తీవ్రమైన సవాళ్లు ఎదురైనప్పటికీ మెరుగైన కార్గోను నమోదు చేశామన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 64 మిలియన్ టన్నుల సరుకు రవాణ చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

కుకింగ్ కోల్, స్టీమ్ కోల్, కంటెయినర్ కార్గో, ఇతర సరకు రవాణ అదనంగా 3 మిలియన్ టన్నులు పెరిగిందన్నారు. మరోవైపు ముడి ఇనుప ఖనిజం, పెట్రోలియం, ఆయిల్ అండ్ ల్యూబ్రికెంట్స్ రవాణ నిరాశపర్చిందన్నారు. ఏది ఏమైనా తమ పోర్టు పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు. సాంకేతికంగా అంతర్జాతీయ ప్రమాణాలను మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుత ఏడాదిలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఉత్పత్తులు తమ పోర్టు నుంచే ఎక్కువగా ముంబయి, కొచ్చి, అహ్మాదాబాద్‌కు రవాణ అవుతున్నా యన్నారు. అదే విధంగా నేపాల్‌తో కలిగి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందం తమకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. ఇప్పటి వరకు విశాఖపట్నం నుంచి నేపాల్‌కు 1900 టిఇయుకు చెందిన కంటెయినర్ కార్గోల సరఫరా జరిగిందన్నారు.

ప్రాజెక్టుల అభివృద్ధి..

ముడి ఇనుప ఖనిజం హాండ్లింగ్ కాంప్లెక్స్ తొలి దశ అధునీకరణ జరుగుతుందని క్రిష్ణబాబు తెలిపారు. ఎస్సార్ రూ.580 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి దగ్గరగా ఉంది. త్వరలోనే నిర్వహణలోకి రానుందన్నారు. రూ.243 కోట్లతో చేపట్టిన డబ్ల్యుక్యూ7, డబ్ల్యుక్యూ8 వచ్చే మార్చి ముగింపు నాటికి రెడీ కానుందన్నారు. ఇక్యూ2, ఇక్యూ5 పాత బెర్తులను పునర్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రూ.182 కోట్లతో చేపడుతున్న ఈ రీకన్‌స్ట్రక్షన్ వచ్చే సెప్టెంబర్ ముగింపు నాటికి పూర్తి కానుందని తెలిపారు. మరో రూ.185 కోట్లతో చేపడుతున్న ఒఆర్1, ఒఆర్2 అదనపు ఆయిల్ హాండ్లింగ్ సదుపాయాలు అభివృద్ధిలో ఉన్నాయన్నారు. బల్మెర్ లారీ అండ్ కో భాగస్వామ్యంతో చేపట్టిన మల్టీ మోడల్ లాజిస్టిక్ హబ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే అందుబాటులోకి రానుందన్నారు. దీని కోసం రూ.211 కోట్ల పెట్టుబడి పెడుతున్నారని తెలిపారు. పర్యావరణ రక్షణతో పాటు కాలుష్యాన్ని తగ్గించడానికి కూడా తాము జాగ్రత్తలు తీసుకుంటున్నామని క్రిష్ణబాబు తెలిపారు. తమ 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ కూడా సంతృప్తికరంగా పని చేస్తుందన్నారు. అదే విధంగా పోర్టు పరిసరాల్లో 1.6 లక్షల మొక్కలు నాటామన్నారు. అదే విధంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా వివిధ సహాయ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

నికి.ఎఐతోఫెడరల్ బ్యాంకు జట్టు

హైదరాబాద్ : ఫెడరల్ బ్యాంకు, నికి.ఎఐతో కలిసి ఒక వర్చ్యువల్ చాట్‌బాట్‌ను రూపొందించినట్లు ఆ సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ వర్చువల్ అసిస్టెంట్ చాట్ బాట్‌ని ఫెడ్ మొబైల్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నాయి. దీని ద్వారా ఎమ్-కామర్స్ సేవలు పొందడానికి వీలుందని వెల్లడించాయి. మొబైల్ రీచార్జ్, వివిధ ప్రయాణ టికెట్ల కొనుగోళ్లు, ఇతర ఆర్థిక చెల్లింపులకు దీన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపాయి.

పలు కంపెనీలతో బోధ్‌ట్రీ భాగస్వామ్యం

హైదరాబాద్ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) సువిధ సేవలను దేశ వ్యాప్తంగా అందించేలా ఐటి సేవల సంస్థ బోధ్‌ట్రీ కన్సల్టింగ్ లిమిటెడ్ పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా జిఎస్‌టి క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు అందించనున్నట్లు బోధ్‌ట్రీ ఎండి ఎల్ఎన్ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం హైటెక్ హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్ ప్లేయర్స్, తయారీ, విద్యా, విత్త సేవల సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు.


భారీగా విలీన, సంలీనాలు

న్యూఢిల్లీ : గతేడాది భారత్‌లో భారీ మొత్తం విలువ చేసే విలీన, సంలీనాలు (ఎంఅండ్ఎ) జరిగాయి. 2017లో మొత్తంగా 54.7 బిలియన్ డాలర్ల విలువ చేసే కంపెనీల ఎంఅడ్ఎ లావాదేవీలు జరిగాయని మెర్జర్‌మార్కెట్ ఒక రిపోర్టులో వెల్లడించింది. 2016లో ఈ మొత్తం విలువ 59.7 బిలియన్ డాలర్లుగా ఉంది. ముఖ్యంగా గతేడాది మూడు రంగాల్లో అత్యధికంగా ఈ విలీన, సంలీనాలు చోటు చేసుకున్నాయి.. చమురు కంపెనీల్లో ఎస్సార్ ఆయిల్‌ను రష్యా కంపెనీ కొనుగోలు చేయడం జరిగింది.

టెట్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

టెట్

ద్రవ్యం - పరిణామక్రమం





టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

ద్రవ్యం

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. దైనందిన జీవితంలో ప్రజలు, ప్రభుత్వం చేపట్టే పలురకాల వ్యవహారాలకోసం సమాజానికి ద్రవ్యం అవసరం అవుతుంది. ద్రవ్యం అవసరంలేని సమాజాన్ని, ఈనాడు మనం ఊహించలేం. సమాజం పరిత్యజించలేనిది ద్రవ్యం. అయితే దేన్ని ద్రవ్యం అంటాము? ద్రవ్యం విధులేంటి? వాస్తవంలో అది ఏవిధమైన పాత్ర నిర్వహిస్తుంది? ద్రవ్యం గురించి మనం ఆలోచించినప్పుడల్లా ఈ మౌలిక ప్రశ్నలు ఉదయిస్తాయి. వీటికి మనం సమాధానాలు కనుక్కోవాలి.

ద్రవ్యం-పరిణామక్రమం

రోమ్ దేవత జూనోమనేటా పేరు నుంచి 'ద్రవ్యం' అనే పదం ఉత్పన్నమయ్యింది. ద్రవ్యం ప్రవేశపెట్టక పూర్వం, వస్తు మార్పిడి పద్ధతి (బార్టర్ సిస్టమ్) అమలులో ఉండేది. ఆ పద్ధతిలో ఒక వస్తువుకు బదులు మరొక వస్తువు మార్పిడి జరుగుతూ వచ్చింది. అయితే ఆ పద్ధతిలో కొన్ని చిక్కులు ఉండేవి. ఆ చిక్కులను అధిగమించడానికి ద్రవ్యాన్ని రూపొందించారు. తొలిదశలో జంతువును ద్రవ్యంగా ఉపయోగించారు. కాలక్రమేణా లోహద్రవ్యం దాని స్థానాన్ని ఆక్రమించింది. మూడో దశలో నాణాలు ఉపయోగంలోకి వచ్చాయి. తరవాత కాగిత ద్రవ్యం వచ్చింది. తాజాగా పరపతి ద్రవ్యం చెలామణిలో ఉంది. ఆ విధంగా ద్రవ్యం తన పరిణామ క్రమంలో పలు దశలు దాటింది.

వస్తు మార్పిడి పద్ధతి ఇబ్బందులు

వస్తుమార్పిడి పద్ధతిలో ఉన్న ఇబ్బందులు తొలగించడానికి ద్రవ్యం ప్రవేశపెట్టారు. వస్తుమార్పిడిలోని ఇబ్బందులను కింది విధంగా వివరించవచ్చు.

కోర్కెల పరస్పర ఏకీభావం

వస్తుమార్పిడి పద్ధతిలో అమ్మకందారుడు ఏ వస్తువునైతే మార్పిడి కింద ఇవ్వడానికి అంగీకరిస్తాడో ఆ వస్తువునే కొనుగోలుదారుడు అంగీకరించాల్సి వచ్చేది. కొనుగోలుదారుడు, అమ్మకపుదారుల కోరికలు ఒకేవిధంగా కలవాల్సిన అవసరం ఉంటూ వచ్చింది. దీనినే కోర్కెల పరస్పర ఏకీభావం (డబుల్ కోఇన్సిడెంట్స్ ఆఫ్ వాంట్స్) అనేవారు. ఉదాహరణకు అమ్మకందారుడి వద్ద మేక ఉండి అతడు బియ్యానికి మార్పిడిగా మేకను ఇవ్వదలచుకున్నాడని అనుకుందాం. అప్పుడు కొనుగోలుదారుడికి బియ్యం ఉండి అతడు బియ్యానికి బదులుగా మేకను అంగీకరించాల్సి ఉంటుంది. ఆ విధంగా వారిద్దరి కోరికలు కలవకపోతే, వారిద్దరి మధ్య ప్రత్యక్ష మార్పిడి సాధ్యం కాదు. సమాజంలో కొత్త, కొత్త వస్తువులు ఉత్పత్తిచేయడం వల్ల వస్తువులలో వైవిధ్యం పెరిగేకొద్దీ, వినియోగపు ధోరణులు మార్పుచెందే కొద్దీ వస్తుమార్పిడి సంక్లిష్టమైపోయింది.

విలువ నిధి లేకపోవడం

కొన్ని వస్తువులు నశ్వరాలు (పెరిషబుల్స్). అవి కొద్దికాలంలోనే నశించిపోతాయి. అలాంటి నశ్వర వస్తువుల విలువను నిల్వచేసుకోడానికి వస్తుమార్పిడి విధానంలో వీలుకలిగేదికాదు. ఆ వస్తువులు నశించకముందే వాటిని మార్పిడి చేసుకోవాల్సి ఉంది. లేకపోతే భవిష్యత్తులో నిజమైన అవసరం కలిగినప్పుడు మార్పిడి చేసుకోడానికి ఆ వస్తువులు మిగిలి ఉండవు. అలాంటి వస్తుమార్పిడి ఎల్లప్పుడూ సాధ్యం అయ్యేది కాదు.

వస్తువుల అవిభాజ్యత

వస్తువు పరిమాణాన్నిబట్టి, దాని విలువను బట్టి కొన్ని సందర్భాలలో ఒక వస్తువు అనేక చిన్న చిన్న యూనిట్లుగా విభజించి వాటి నుంచి ఒకటిగాని అంతకంటే ఎక్కువ యూనిట్లుగాని మరొక వస్తువుకోసం మార్పిడి చేసుకోవాల్సిన అవసరం కలుగుతూ ఉంటుంది. అయితే అన్ని వస్తువులనూ చిన్న చిన్న యూనిట్లుగా విభజించడం సాధ్యం కాదు. అలాంటప్పుడు గొర్రెలు మాత్రమే కలిగి ఉండే కాపరి తన అవసరాలను తీర్చుకోవడం సాధ్యంకాదు.

ఉమ్మడి విలువ కొలమానం లేకపోవడం

వస్తు మార్పిడి పద్ధతిలో వివిధ వస్తువుల విలువను కొలవడానికి ఒక ఉమ్మడి కొలమానం (కామన్ మెజర్) ఉండేది కాదు. ప్రతి వస్తువును రూపంలో వ్యక్తం చేయాల్సివచ్చేది. ఆవిధంగా ఒక పెద్ద జాబితా తయారుచేసుకోవాల్సి ఉండేది.

వాయిదా చెల్లింపులలో ఇబ్బందులు

వస్తుమార్పిడి పద్ధతిలో, ప్రస్తుత క్రయవిక్రయ వ్యవహారాలను భవిష్యత్తులో వస్తుమార్పిడి ద్వారా చెల్లించడంలో అనేక చిక్కులు వచ్చాయి. అందువల్ల భావి చెల్లింపులు లేదా వాయిదా చెల్లింపులు (డిఫెర్డ్ పేమెంట్స్) సాధ్యం అయ్యేవికావు. ఉదాహరణకు భవిష్యత్తులో ఒక నిర్ణీత తేదీన ఒక మేకను మార్పిడి చేసుకొనే విధంగా ఒక మేకకు సమాన విలువగా కొంత నిర్ణీత పరిమాణంలో బియ్యం కొనుగోలు చేయడానికి ఒక ఒప్పందం కుదిరింది అనుకుందాం. అయితే భవిష్యత్తులో చెల్లింపు తేదీనాటికి ఆ మేక విలువ పెరగవచ్చు. తరగవచ్చు. అదేవిధంగా దాని నాణ్యతలో తేడా ఏర్పడవచ్చు. అలాంటి సందర్భంలో ఒప్పందం కుదుర్చుకున్న సమయంలోని మార్పిడి విలువ, చెల్లింపు తేదీనాటికి మార్పిడి విలువ మధ్య తేడా ఏర్పడుతుంది. దీనివల్ల ఎవరికో ఒకరికి నష్టం కలుగుతుంది. ఇలాంటి సమస్యలవల్ల వాయిదా చెల్లింపులకు సంబంధించిన షరతులు నిర్ణయించుకోవడంలో చిక్కులు ఏర్పడేవి.

ద్రవ్య విధులు

ద్రవ్య నిర్వచనాలు చదువుతుంటేనే ద్రవ్యం విధులు తెలుస్తాయి. అయితే వాటిని వివరంగా, స్పష్టంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ద్రవ్యం నిర్వహించే విధులు చాలా ఉన్నాయి. వీటిని ప్రాథమిక విధులు, అనుషంగిక విధులు, ఆగంతుక విధులు (కంటిజెంట్ విధులు) అని పలురకాలుగా వర్గీకరిస్తారు.


ప్రాథమిక విధులు

ద్రవ్యం ప్రాథమిక విధులు నిజానికి సాంకేతికపరమైనవి, అతిప్రధానమైనవి. **ఇవి రెండు రకాలు**

వినిమయ మాధ్యం (మీడియం ఆఫ్ ఎక్స్‌ఛేంజ్) :

ద్రవ్యం వినిమయ మాధ్యంగా వ్యవహరిస్తుంది. వస్తుమార్పిడి పద్ధతిలో కోరికల పరస్పర కలయిక లేనిదే మార్పిడి సాధ్యం కాదు. ఈ ఇబ్బందిని ద్రవ్యం తొలగిస్తుంది. కోరికలు పరస్పర సమన్వయం లేకుండానే వస్తువుల వినిమయం లేదా క్రయవిక్రయాలను ద్రవ్యం సాకారం చేస్తుంది. ఏ వస్తువునైనా ముందుగా ద్రవ్యంతో మార్పిడి చేసుకొని, ఆ తరువాత ఆ ద్రవ్యంతో మరి ఏ ఇతర వస్తువునైనా కొనుగోలు చేయవచ్చు. ఆ విధంగా ద్రవ్యం అనే వినిమయ మాధ్యమ ద్వారా ప్రజలు వస్తుసేవలను వినిమయం చేసుకోవచ్చు.

నిజానికి ద్రవ్యానికి తనకంటూ ఎలాంటి ప్రయోజనం లేదు. అది వస్తుసేవల కొనుగోలుకు ఉపయోగపడుతుంది. కాబట్టే ప్రజలు ద్రవ్యాన్ని పొందాలని, ఉంచుకోవాలని కోరుకుంటారు. అందువల్ల వినిమయ మాధ్యమంగా పనిచేయడం ద్రవ్యం అత్యంత ప్రధానమైన విధి. ద్రవ్యం ఒక మధ్యవర్తి.



ద్రవ్యోల్బణం

ప్రపంచంలోని అనేక ఆర్థిక వ్యవస్థలు ఈనాడు ఎదుర్కొంటున్న తీవ్రమైన స్థూల ఆర్థిక సమస్యలలో ద్రవ్యోల్బణం ఒకటి. ఇది అనేక విధాలుగా ప్రజల ఆర్థిక జీవితాన్ని, సంక్షేమాన్ని ప్రభావితం చేస్తుంది. ఉత్పత్తి మీద, పంపిణీ మీద ప్రభావం కలిగి ఉంటుంది. ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులలో మార్పులు కలుగజేస్తుంది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాల స్థిరత్వానికి సవాలుగా పరిణమిస్తుంది. అందువల్లనే ద్రవ్యోల్బణం, దానికి సంబంధించిన ఇతర సమస్యలు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికవేత్తల దృష్టిని ఆకర్షించాయి. కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించి, చర్చించారు. ద్రవ్యోల్బణ సమస్య పరిష్కారం కోసం ఆధునిక ప్రభుత్వాలు అనేక విధానపరమైన చర్యలు తీసుకుంటున్నాయి. అందువల్ల ద్రవ్యోల్బణం అంటే ఏమిటి? దాని లక్షణాలు ఎలా ఉంటాయి. అది ఎన్ని రకాలు, అందుకు కారణాలేమిటి, ద్రవ్యోల్బణం ఏ విధమైన ప్రభావాలు కలిగిస్తుంది, మొదలైన మౌలిక అంశాలు అర్థశాస్త్ర విద్యార్థులు అవగాహన చేసుకోవడం సముచితంగా ఉంటుంది.

ద్రవ్యోల్బణం - నిర్వచనాలు

స్థూలంగా, దీర్ఘకాలంలో సాధారణ ధరల స్థాయిలో నిరంతరమైన పెరుగుదలను ద్రవ్యోల్బణంగా పేర్కొనవచ్చు. ద్రవ్యోల్బణం నిర్వచనాలు కొన్ని కింది విధంగా ఉన్నాయి.

పిగూ ప్రకారం, 'సంపాదక కార్యకలాపంలో పెరుగుదల కంటే ఎక్కువ అనుపాతంలో ద్రవ్యవేతనం విస్తరిస్తున్నప్పుడు ద్రవ్యోల్బణం ఉనికి కలిగి ఉంటుంది'.

'ద్రవ్య విలువ పతనం చెందుతున్న స్థితి, అంటే ధరల పెరుగుతున్న స్థితి ద్రవ్యోల్బణం' అని క్రౌథర్ నిర్వచించారు.

ఆక్లే ప్రకారం 'ధరల సాధారణ స్థాయి లేదా సగటులో స్థిరమైన, గ్రహించదగిన పెరుగుదల ద్రవ్యోల్బణం'.

శామ్యూల్‌సన్ ప్రకారం 'ధరల సాధారణ స్థాయిలో పెరుగుదలను ద్రవ్యోల్బణం సూచిస్తుంది'.

అనేకమంది ఆదునిక ఆర్థికవేత్తలు 'సాధారణ ధరల స్థాయిలో స్థిరమైన, గ్రహించదగిన పెరుగుదల పరిస్థితిని ద్రవ్యోల్బణం'గా అంగీకరించారు.

పైన పేర్కొన్న అన్ని నిర్వచనాలు కూడా సాధారణ ధరలస్థాయిలో నిరంతరమైన పెరుగుదల ద్రవ్యోల్బణంగా అంగీకరిస్తున్నాయి. అయితే సాధారణ ధరల స్థాయి అంటే ఏమిటి? ద్రవ్యోల్బణం లెక్కించడానికి గుర్తించబడిన వస్తువుల సమూహంలో చేర్చబడిన అనేక వస్తువుల ధరల సగటునే సాధారణ ధరలస్థాయి అంటారు. దానినే ధరల సూచిక అంటారు. ద్రవ్యోల్బణానికి సంబంధించినంతవరకూ రెండు రకాల ధరల సూచికలున్నాయి. 1. టోకు ధరల సూచి (హోల్‌స్టే ప్రైస్ ఇండెక్స్), 2. వినియోగదారుల ధరల సూచి (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్). భారతదేశంలో టోకు ధరల సూచి (డబ్ల్యూపిఐ) ఆధారంగా ద్రవ్యోల్బణం లెక్కిస్తారు. అనేక ఇతర దేశాలలో ద్రవ్యోల్బణానికి ప్రాతిపదిక వినియోగదారుల ధరల సూచి.

ద్రవ్యోల్బణం అంటే ధరల సూచీలోని పాయింట్లలో పెరుగుదల అని చెప్పవచ్చు. ★

నేషనల్ మెటలర్జికల్ లేబొరేటరీలో 14 పోస్టులు

జంషెడ్‌పూర్‌లోని నేషనల్ మెటలర్జికల్ లేబొరేటరీ (ఎన్ఎంఎల్).. 14 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : సైంటిస్ట్/ సీనియర్ సైంటిస్ట్-12, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో)-1, టెక్నికల్ ఆఫీసర్ (టీవో)-1.
వేతనం : సైంటిస్ట్-రూ.85,000, సీనియర్ సైంటిస్ట్-రూ.99,000, ఆర్ఎంవో-రూ.83,000, టీవో-రూ.56,000.
అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి ఎంటెక్/ పీహెచ్‌డీ (సైన్స్/ ఇంజనీరింగ్)/ ఎంబీబీఎస్/ బీఈ/ బీటెక్. దీంతోపాటు నిబంధనల మేర మార్కుల శాతం ఉండాలి.
వయసు : టీవోకు 30 ఏళ్లు, ఆర్ఎంవోకు 35 ఏళ్లు, సైంటిస్ట్‌కు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు : రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌ను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో గడువులోగా పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : ఫిబ్రవరి 5, 2018.
హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 20, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.nmlindia.org

ఉద్యోగాలు

ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో 39 ఉద్యోగాలు

సికింద్రాబాద్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్. వివిధ విభాగాల్లోని 39 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు : పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)-7, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ)-16, ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ)-12, ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ (పీటీఐ-పీఆర్‌టీ)-2, పీఆర్‌టీ-మ్యూజిక్ (వెస్ట్రన్)-1, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్-1.
బోధనాంశాల వారీ ఖాళీలు : పీజీటీలో : ఫిజిక్స్-1, బయాలజీ-1, పొలిటికల్ సైన్స్-1, జాగ్రఫీ-1, సైకాలజీ-1, ఎకనమిక్స్-1, హిస్టరీ-1, **టీజీటీలో :**ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1, సోషల్ సైన్సెస్-3, మ్యాథ్స్-4, హిందీ-2, సంస్కృతం-1, **పీఆర్‌టీలో :** ప్రాథమిక స్థాయి సబ్జెక్టులన్నీ.
అర్హతలు : పీజీటీకి-సంబంధిత విభాగంలో పీజీ+బీఈడీ, **టీజీటీ, పీఆర్‌టీకి-**సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ + **బీఈడీ, పీటీఐకి..** గ్రాడ్యుయేషన్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), **పీఆర్‌టీ-**మ్యూజికల్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌కు సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్.
గమనిక : పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ పోస్టులకు ఏడబ్ల్యూఈఎస్ సీఎస్‌బీ, సీటెట్/ టెట్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
దరఖాస్తు ఫీజు : రూ.100. **దరఖాస్తు విధానం :** ఆఫ్‌లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : జనవరి 31, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.apsrkpuram.edu.in

గిరిజన గర్జన విజయవంతానికి వారపు సంతల్లో ప్రచారం

ప్రజాశక్తి- విశాఖపట్నం

బోయ వాల్మీకి, వడ్డెర కులస్తులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ ఈ నెల 31న విశాఖ జిల్లా పాడేరులో నిర్వహించే గిరిజన గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం అరకు, పాడేరు వారపు సంతల్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా కరపత్రాలను పంచుతూ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ బిసి-ఎ జాబితాలో ఉన్న బోయ వాల్మీకులు, వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేర్చడం వల్ల నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం తన స్వార్థం కోసం రాజ్యాంగానికి విరుద్ధంగా చేపట్టే తీర్మానాన్ని రద్దు చేసేవరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.



మానవహారం విజయనగరం జిల్లా భోగాపురంలో శుక్రవారం మానవహారం చేస్తున్న దళితులు, ప్రజాసంఘాల నాయకులు

ఇంకెన్నాళ్లు గొట్టిపాడు దళితులపై నిర్బంధకాండ

కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బన్న

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం)

గుంటూరు జిల్లా గొట్టిపాడులో దళితులపై నిర్బంధకాండను ఎత్తివేయాలని, దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, దళితులకు అండగా ఉన్న ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సుబ్బన్న డిమాండ్ చేశారు. దళితులపై దాడులను నిరసిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం విజయనగరం జిల్లా భోగాపురంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయాల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ ఒకవైపున దళితులపై దాడులు చేస్తూ మరో వైపు దళిత తేజం పేరుతో పర్యటనలు చేయడం దారుణమన్నారు.

విజయనగరం జిల్లా డెంకాడ మండలంలో మోదవలస, జెర్రిపోతులపాలెం, సంతపాలెం, గంగపుర్రు, దేవరాపల్లి, పచ్చికాపల్లం తదితర చోట్ల దళితులు, గిరిజనులపై తెలుగుదేశం ఎమ్మెల్యేలు, వారి అనుచరులు దాడులకు తెగబడుతున్నారన్నారు. దళితులకు మద్దతుగా వెళ్లి ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్రా అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ, కెవిపిఎస్ జిల్లా కార్యాదర్శి రాకోటి అనంద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చే వరకూ విశ్రమించొద్దు

- ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళదాం
- స్థూపం ఆవిష్కరణ సభలో సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పుత్తూరు అర్బన్ /తిరుపతి క్యాంపస్

పేదల కోసం పోరాటాలు చేసి, వారి భవితను బంగారుబాటలో నడిపించేందుకే సిపిఎం ఉందని, ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లాలని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. వెత్తలతడుకులో పట్టాలిచ్చేవరకూ విశ్రమించొద్దని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా నారాయణవనం మండలం వెత్తలతడుకు దళితులకు వంద ఎకరాల అటవీ భూములు స్వాధీనం చేసుకున్నందుకు గుర్తుగా భూపోరాట స్థూపాన్ని, విజ్ఞాన కేంద్రాన్ని వి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వంద ఎకరాలను ఉద్యమాలు, పోరాటాల నడుమ సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో పేదలకు పంచడం గర్వకారణమన్నారు. ఈ ఉద్యమ స్ఫూర్తిని వదలకుండా, భూములకు పట్టాలు సాధించేంత వరకూ విశ్రమించొద్దని పిలుపునిచ్చారు. అనేక మంది బూర్జువా రాజకీయ నాయకులు వెత్తలతడుకు గ్రామస్తులకు ఏదో చేస్తామని చడీచప్పుడు లేకుండా జారిపోయారని, సిపిఎం ఒక్కటే మొదటి నుంచి పోరాటాలను చేసి పేదల కోసం అహర్నిశలు కృషి చేసిందని చెప్పారు. భవిష్యత్తులో ఎటువంటి సమస్యలకైనా ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెత్తలతడుకు గ్రామస్తుల ఐక్యత కారణంగానే ఇంతటి ఘన విజయాన్ని సాధించామని గుర్తు చేశారు. ఈ విజయస్ఫూర్తి రాష్ట్రానికి స్ఫూర్తి అన్నారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ పోరాటాల ద్వారానే దళితుల అభివృద్ధి సాధ్యమన్నారు. ఎర్రజెండా ఏ ఒక్క కులం, మతం కోసం పనిచేయదని, అందరి కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



చిత్తూరు జిల్లా వెత్తలతడుకు స్థూపం ఆవిష్కరణలో పాల్గొన్న సిపిఎం నాయకులు

వందవాసి నాగరాజు మాట్లాడుతూ గతంలో సిపిఎం జాతీయ నాయకులు బివి రాఘవులు నేరుగా ఇక్కడికొచ్చి దళితుల కోసం పోరాటాల్లో పాలు పంచుకోవడం కూడా ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్రకమిటి సభ్యులు కందారపు మురళి, నాయకులు జనార్ధన్, కొత్తపల్లి సుబ్రమణ్యం, అరుణ, వెంకటేష్, చిరంజీవమ్మ, భాస్కర్, వెత్తలతడుకు గ్రామ పెద్దలు చిన్నబ్బ, సుబ్రమణ్యం, చంద్ర, తిమ్మయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగానికి ప్రతిరోజూ సవాలే : వక్తలు

'భారత రాజ్యాంగం ప్రతిరోజూ సవాళ్లను ఎదుర్కొంటోంది' అని దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా ప్రజలపై మనుధర్మాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం - ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై శుక్రవారం జరిగిన సదస్సుకు వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిజెపి పాలనలో ముస్లిములు, దళితులు, పేదవారిపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. రాజ్యాంగంలో హక్కుల ఉల్లంఘన నానాటికీ పెరిగిపోతోందన్నారు. బిజెపి వారు జాతీయ జెండాను గుర్తించలేదని, కాషాయపు జెండానే వారు గుర్తించారని విమర్శించారు. ఇప్పటికీ వందేమాతర గేయమే వారి జాతీయ గేయంగా రూపుదిద్దుకున్నారన్నారు. జాతీయోద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదని, అయినప్పటికీ వీరసావర్కర్ తమవాడుగా పేర్కొనడం హేయనీయమన్నారు. హిందూత్వవాదాన్ని పెంచి పోషిస్తూ రాజ్యాంగాన్ని అడుగడుగునా తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, కార్పొరేట్‌స్వామ్యం నడుస్తోందన్నారు. దేశంలో అన్నిమతాలూ ఉన్నాయని, అన్యమతాలు లేవనే అంశాన్ని గుర్తించాలన్నారు. టిటిడిలో అన్యమతస్తులను తొలగించడం దారుణమన్నారు. ఈ అంశంపై రాజ్యాంగబద్ధంగా పోరాడతామన్నారు. రాజ్యాంగాన్ని సంరక్షించుకోవడంలో ప్రతి పౌరుడూ ముందుండాలన్నారు. సిపిఐ నాయకులు, మాజీ ఎంఎల్‌సి పిజె చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల్లోని రాజ్యాంగాలను పరిశీలించి, భారత్‌లోని పరిస్థితులకు అనుగుణంగా అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రూపొందించారన్నారు. భారత్‌కు అతిపెద్ద ఆస్తి రాజ్యాంగమేనని, అటువంటి రాజ్యాంగాన్ని ప్రజలకు అందకుండా పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, భజరంగదళ్ ఆదేశాలకు అనుగుణంగా మతోన్మాదం చెలరేగుతోందన్నారు. పద్మావత్ సినిమాపై సైతం బిజెపి ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని, సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ నిషేధాజ్ఞలు జారీ చేశాయన్నారు. జిల్లా విశ్రాంత జడ్జి గుర్రప్ప మాట్లాడుతూ బిజెపి అనుబంధ సంఘాల ద్వారా దేశవ్యాప్తంగా కుట్రపూరితంగా అలజడులు సృష్టించడానికి కార్యకలాపాలను కొనసాగిస్తూ విధ్వంసాలు సృష్టిస్తోందన్నారు. ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ తిరుపతిలో ప్రశాంత వాతావరణం ఉన్న తరుణంలో దేవుళ్లపేరిట అల్లర్లు సృష్టించడానికి చేస్తున్న చర్యలను ప్రజాతంత్ర లౌకికశక్తులు పిడికిలి బిగించి ఎదుర్కోవాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి సుబ్రమణ్యం, ముస్లిం మైనార్టీ నాయకులు షఫీ అహ్మద్ ఖాద్రీ, వైసిపి నాయకులు రాజేంద్ర, క్రిస్టియన్ సెల్ నాయకులు అరుణ్ అరోసి, సిపిఐ నగర కార్యదర్శి పెంచులయ్య, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాలు శ్రీదేవి, యూనివర్సిటీ నాయకులు గండికోట నాగ వెంకటేష్, ఎస్‌ఎఫ్ఐ నాయకులు మాధవక్రిష్ణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

లేపాక్షి హబ్ భూములను రైతులకు ఇవ్వాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు

ప్రజాశక్తి- చిలమత్తూరు (అనంతపురం)

అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలంలో పరిశ్రమల కోసం సేకరించిన భూములను ఆ రైతులకే తిరిగి ఇవ్వాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిలమత్తూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ.. 2007 సంవత్సరంలో లేపాక్షి నాలెడ్జ్‌హబ్ కింద వేల ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించారన్నారు. రెండు రోజులుగా ఈ భూములను పరిశీలించామని అన్నారు. రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నామని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు, యువతకు ఉపాధి కల్పించలేదని, తక్షణమే వారి భూములను వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట చెబుతూ టిడిపి పాలకులు రైతుల మభ్యపెడుతున్నారని అన్నారు. పైగా లేపాక్షి హబ్ భూములు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అటాచ్‌లో ఉన్నాయంటూ రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పరిశ్రమలు స్థాపిస్తామని చెబుతున్న ప్రభుత్వం భూ సేకరణ చట్ట ప్రకారం ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌లను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం పొందిన వారి నుంచి చట్టపరంగా వసూలు చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర రైతు సంఘంతో పాటు అనుబంధ ప్రజాసంఘాలు, వామపక్ష నాయకులతో కలిసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, వినోద్‌కుమార్, తదితరులు ఉన్నారు.

త్రిపుర ఎన్నికల నిధికి విశాఖలో విశేష స్పందన

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొంటున్న సిపిఎంకు నిధి సమకూర్చడంపై ఆంధ్రప్రదేశ్‌లో విశేష స్పందన కనిపిస్తోంది. విశాఖపట్నంలో ఆ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. విశాఖలో శుక్రవారం పార్టీ నగర ప్లీనమ్‌లో రాజకీయ రిపోర్టును ప్రవేశపెట్టిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థుల ప్రచార ఖర్చుల నిమిత్తం నిధిని సమకూర్చాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపునకు స్పందించిన విశాఖ నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు నగర కమిటీ తరుపున రూ.లక్ష వసూలు చేస్తామన్నారు. దీంతో నగర ప్లీనంకు హాజరైన అన్ని జోన్ కమిటీల సభ్యులు స్పందించి అక్కడికక్కడే రూ.37,100 విరాళాలు అందజేశారు.మొత్తం రూ.లక్ష వసూలు చేసి రాష్ట్ర కమిటీకి పంపిస్తామని గంగారావు తెలిపారు. రాబోయే మూడు నెలలకు పార్టీ కర్తవ్యాలను ఆయన ప్రకటించారు. ఈ సమావేశానికి నగర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్.పద్మనాభరాజు అధ్యక్ష వహించగా నగరంలోని వందలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, సభ్యులు హాజరయ్యారు.

ఎస్కార్టు ఇవ్వలేని చిత్తూరు ఎంపి శివప్రసాద్ అలక

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రోటోకాల్ పట్టించుకోవడం లేదని, సీనియర్ ఎంపి అయిన తనకు కనీసం ఎస్కార్టు ఇవ్వకపోవడం దారుణమని చిత్తూరు ఎంపి డాక్టరు శివప్రసాద్ అలక వహించారు. భారతదేశానికి రాజ్యాంగం అమలైన రోజే(గణతంత్ర దినోత్సవం) రాజ్యాంగ ప్రకారం తనకు కల్పించాల్సిన సౌకర్యాలు కల్పించాలని సాక్షాత్తు పోలీసు స్టేషన్ ఎదుటే కారులో భైఠాయించి నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. చంద్రగిరి పోలీసు స్టేషన్ వద్ద ఎంపి శివప్రసాద్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గతంలో రాష్ట్ర మంత్రిగా పని చేసిన తను, ప్రస్తుతం చిత్తూరు ఎంపిగా ఉన్నానని, ప్రతి రోజు తిరుపతి నుంచి చిత్తూరుకు రాకపోకలు సాగిస్తున్నానని, రాజ్యాంగం ప్రకారం తనకు పోలీసులు కనీసం ఎస్కార్టు కల్పించడం లేదని, నిత్యం ట్రాఫిక్‌లో చిక్కుకుని అనేక ప్రభుత్వ సమావేశాలకు ఆలస్యంగా వెళ్లుతున్నానని చెప్పారు. పోలీసులు తన పట్ల కనీసం ప్రోటోకాల్ సౌకర్యాలు కూడా కల్పించకపోవడం దారుణమన్నారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం బయలుదేరితే ట్రాఫిక్ వల్ల సరైన సమయానికి వెళ్లలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల తీరు వల్ల స్టేషన్ ప్రధాన గేట్ వద్ద కారు నిలిపి అక్కడే నిరసన వ్యక్తం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు మరో స్వాతంత్ర్య పోరాటం

- దళితులపై దాడులను నిరసిస్తూ లక్ష మందితో చలో గుంటూరు
- సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి- తిరుపతి ప్రతినిధులు

రాజ్యాంగ పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, మదనపల్లిలో నిర్వహించిన ఈ సభే ఆ పోరాటానికి నాంది అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ సభను చిత్తూరు జిల్లా మదనపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ, ప్రజా గాయకులు గద్దర్, తమిళనాడు మాజీ ఎంపి తిరుమావలవన్, రోహిత్ వేముల తల్లి రాధికలు హాజరయ్యారు. భారతీయ అంబేద్కర్ సేన అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మధు మాట్లాడుతూ.. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చి 69 ఏళ్లు గడుస్తున్నా దళిత, బహుజనులకు రక్షణ లేదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సంక్రమింపజేసిన హక్కుల్ని పాలకులు కాలరాస్తున్నారన్నారు. రాజ్యాంగంలో లౌకికతత్వాన్ని తొలగించేందుకు బిజెపి, మనువాదులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. టిటిడిలో ఉన్న 45 మంది క్రైస్తవులు, ముస్లిములను తొలగించేందుకు షోకాజ్ నోటీసులు పంపడం దారుణమన్నారు. గర్భగుడిలోకి దళితులకు ప్రవేశం లేకుండా చేయడమేనా ఆరున్నర దశాబ్దాల గణతంత్రం ఇచ్చిన స్వేచ్ఛ అంటూ ప్రశ్నించారు. దళితులనూ ఆలయ పూజారులుగా నియమించిన ఏకైన ప్రభుత్వం కేరళలోని సిపిఎందేనని గుర్తు చేశారు. గుంటూరు జిల్లా గొట్టిపాడులో దళితులపై పెత్తందారుల డాడిని నిరసిస్తూ ఫిబ్రవరి ఆఖర్లో లక్ష మందితో ఛలో గుంటూరును నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. అనాదిగా పెత్తందారులు, భూస్వాములు దళితులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కుతూనే ఉన్నారన్నారు. తమిళనాడు మాజీ ఎంపి తిరుమావలవన్ మాట్లాడుతూ.. భారతీయ అంబేద్కర్ సేనతో కలిసి తమ విసికె పార్టీ పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.కుమార్‌రెడ్డి, చిత్తూరు జిల్లా కార్యదర్శి చల్లా వెంకటయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి రామానాయుడు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రచారార్భాటానికే 'దళితతేజం'

ప్రభుత్వం చేపడుతున్న 'దళితతేజం' టిడిపి ప్రచారార్భాటమే తప్ప దళితులకు ప్రత్యేకించి ఒరిగిందేమీ లేదని మధు అన్నారు. తిరుపతి యశోదానగర్‌లోని ఎంబి భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల అభివృద్ధికి ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందో ప్రకటించాలన్నారు. అంతేగాకుండా వారిపై జరుగుతున్న దాడులు, వివక్ష, ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. దేవరపల్లి, పచ్చికాపల్లం మహాభారతం, గరగపర్రు ఘటనలు చల్లారకనే గుంటూరు జిల్లా గొట్టిపాడులో దళితులపై దాడులు పునరావృతం అయ్యాయన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే దళితులపై దాడులు చేసి సాంఘిక బహిష్కరణకు గురిచేశారన్నారు. ఫిబ్రవరిలో ఏపి రెగ్యులేటరీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో రానుందన్నారు. రూ.13 వేల కోట్ల కృత్రిమ లోటును సాకు చూపి విద్యుత్ ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోందన్నారు. ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణ అంతా బూటకమన్నారు. ప్రభుత్వం తయారు చేసే విద్యుత్‌ను రూ.2.75 లకే అమ్ముతుంటే హిందూజా, జివికె లాంటి సంస్థలు ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌ను యూనిట్ రూ.6కు కొనుగోలు చేయడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఈ సారి ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా విశాల ఐక్యవేదికతో ప్రత్యామ్నాయం నిర్మిస్తున్నామన్నారు. జనసేన పార్టీ వైఖరి ఏంటో ఇంతవరకు స్పష్టంగా లేదని, టిడిపి పట్ల పవన్ వైఖరి ఏంటో తెలియజేయాలని చెప్పారు.



చిత్తూరు జిల్లా మదనపల్లిలో అభివాదం చేస్తున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ, రోహిత్ తల్లి రాధిక, ప్రజా గాయకులు గద్దర్ తదితరులు

29న జిల్లాలో ఫ్యాప్టో ధర్నా

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాల్లో ఫ్యాప్టో ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నెల అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్‌కు నోటీసు అందిచేసినట్లు ఫ్యాప్టో చైర్మన్ పి బాబురెడ్డి, జనరల్ సెక్రటరీ జి హృదయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని, 2018 జులై నాటికి 11వ పిఆర్‌సి అమలు చేసేలా నూతన పిఆర్‌సి కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని మాటల్లో చెప్పడం తప్ప ఉపాధ్యాయుల సమస్యలు ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2008 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పే రివిజన్ జరపాలని కోరారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలని, బదిలీలకు శాశ్వత కోడ్ రూపొందించాలని గత బదిలీల్లో రిలీవ్‌కాని వారిని రిలీవ్ చేయాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్స్ వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్లు ఎయిడెడ్ టీచర్ల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. 29న జిల్లా కేంద్రాల్లో జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చౌదరి పురుషోత్తంనాయుడు

సిపిఎస్ రద్దుకు ఐక్య ఉద్యమం

ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సిపిఎస్ రద్దు కోసం ఐక్య ఉద్యమాలే శరణ్యమని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోంలో ఎపిసిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో శుక్రవారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ రద్దు కోసం చేస్తున్న పోరాటానికి ఎన్‌జిఒల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేవరకు పోరాటాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. లోపభూయిష్టమైన సిపిఎస్‌ను రద్దు చేయకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దశల వారీ ఉద్యమంలో భాగంగా ఫిబ్రవరి 10న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. మార్చిలో లక్షలాది మందితో చలో అసెంబ్లీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పెన్షన్ సాధన సమితా జిల్లా కన్వీనర్ హనుమంతు సాయిరాం, సిపిఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.భాస్కరరావు, సిహెచ్ దుర్గాప్రసాద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సన్‌శెట్టి రాజశేఖర్, కోప్పల భానుమూర్తి, బి.మోహనరావు, పి.రాజశేఖర్, బైరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయం జిల్లా హక్కు

రౌండ్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా కేంద్రీయ విశ్వ విద్యాలయం జిల్లాలోనే నెలకొల్పాలని, ఇది జిల్లా ప్రజల హక్కు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం జెవివి ఆధ్వర్యంలో స్థానిక జెవివి కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ రచయిత సింగమనేని నారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎంపీలు ప్రధాన మంత్రిని కలిసి ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ గురించి మాట్లాడారని, కాని సెంట్రల్ వర్శిటీ గురించి ప్రస్తావన చేయలేదన్నారు. జిల్లా ముఖచిత్రాన్ని మార్చే శక్తి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఉందన్నారు. చంద్రశేఖర్, ఎస్‌ఎం.బాషా, మానవతా అమర్‌నాథ్ రెడ్డి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం శ్రీనివాసరావు, డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ కొండయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సామాజిక న్యాయం

ప్రజాశక్తి-ఒంగోలు టౌన్

పోరాటాల ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్ పేర్కొన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాటసంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక న్యాయం - ఎదురవుతున్న సవాళ్ళు అంశంపై ఎల్‌బిజి భవన్‌లో సదస్సు జరిగింది. నాయకులు వై.ప్రభుదాసు అధ్యక్షతన జరిగిన సదస్సులో రఘురాం మాట్లాడుతూ రాజ్యాంగం ఏర్పడి 68 సంవత్సరాలు అయిందన్నారు. నేటికి దేశంలోను, రాష్ట్రంలోను దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రక్షణ చట్టాలు అమలకు నోచుకోవడం లేదని విమర్శించారు. చంద్రయ్య నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి లక్ష్మిరాజు మాట్లాడుతూ వివక్షతను రూపుమాపేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోగా వివక్షతను మరింత ప్రోత్సహిస్తున్నారనివిమర్శించారు. వివక్ష రూపమాపడం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు, ఆవాజ్ నగర అధ్యక్షులు ఎస్‌డి హుస్సేన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎ.రాఘవులు మాట్లాడారు. సదస్సులో కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎ.శ్రీనివాసులు, నగర నాయకులు కె.సుబ్బారావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, డి.నారాయణ, యన్.ప్రభాకర్, ఉదయ్ ఉన్నారు.

ప్రజ్ఞ జవాబులు

1. ఇళయరాజా
2. దిలీప్ చెనాయ్
3. చత్తీస్‌ఘడ్ (జనవరి 19 నుంచి 21)
4. రాఖి హల్దార్ (230 కేజీలు)
5. జనవరి 24

'సీమ'లో హైకోర్టు కోసం ఉద్యమం ఆపేది లేదు

కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కర్నూల్ లీగల్

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని ఆరో రోజు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షలు చేశారు. శుక్రవారం తొమ్మిది మంది న్యాయవాదులు దీక్షల్లో కూర్చొన్నారు. ఈ దీక్షలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ఎపి పంచాయతీ రాజ్ ఛాంబర్ అసోసియేషన్ నాయకులు బి.ప్రతాప్‌రెడ్డి, పి.రాధాకృష్ణారావు, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు హనుమంతురెడ్డి, రాయలసీమ జెఎసి కోకన్వీనర్ బాలసుందరం, ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ నాయకులు ప్రసాద్, ఆర్‌వైపిఎస్ నాయకులు నాయుడు మద్దతు తెలిపారు.

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని నంద్యాలో రిలే నిరాహారదీక్షలు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు స్వామిరెడ్డి అధ్యక్షతన చేశారు. న్యాయవాదులు పి.చంద్రశేఖర్‌రావు, బాలాజీ, హనీఫ్, ఎం.వెంకటేశ్వర్లు, చిన్న లింగమయ్య, మోహన కృష్ణారావు రిలే నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య, నంద్యాల బిసి సంఘం నాయకులు రమణయ్య గౌడ్, నంద్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మగ్బూల్ హుసేన్, సాగునీటి సాధన సమితీ నాయకులు బొజ్జ దశరథరామిరెడ్డి, నంద్యాల హిజ్రాల సంఘం అధ్యక్షుడు విజయకుమార్, దూదేకుల సంఘం గోస్పాడు హుసేన్‌సాహెబ్, మాల మహానాడు నాయకులు శీలం ఓబులేసు, ఆల్‌మేవా నాయకుల ఆధ్వర్యంలో ముస్లింలు 300 మంది మధ్యాహ్నం నమాజ్ ముగించుకొని సంఘీభావం తెలిపారు.

మానవబాంబు అనుమానంతో మహిళ అరెస్టు

శ్రీనగర్ : ఆత్మాహుతి దాడికి పాల్పడే మానవ బాంబుగా అనుమానించి ఒక మహిళను జమ్మూకాశ్మీర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఆత్మాహుతి దాడి గురించి తమకు సమాచారం అందిందనీ, దీంతో తనిఖీలు నిర్వహించామనీ, పూణేకు చెందిన సద్యా అన్వర్ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు రాష్ట్ర పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ మునీర్ ఖాన్ తెలిపారు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులతో కూడా సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న ఆమెను మరిన్ని విషయాలు రాబట్టేందుకు విచారణ చేస్తున్నామని అధికారులు తెలిపారు. కేంద్ర నిఘా సంస్థలు అప్రమత్తం చేయడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

అగ్నికీలలు

దక్షిణ కొరియాలో మిర్యాంగ్ నగరంలోని సెజాంగ్ ఆస్పత్రిలో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సహాయక సిబ్బంది



ద.కొరియా ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

37మంది సజీవ దహనం, 18మంది పరిస్థితి విషమం

మిర్యాంగ్ : దక్షిణ కొరియాలోని ఒక ఆస్పత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో 37మంది మరణించగా, 113మందికి పైగా గాయపడ్డారు. మిర్యాంగ్ నగరంలోని సెజాంగ్ ఆస్పత్రిలో ఎమర్జన్సీ రూమ్‌లో మంటలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో 200మంది రోగులు భవనంలో వున్నారు. పక్కనే నర్సింగ్ హోం కూడా వుంది. గత దశాబ్ద కాలంలో ఇంత దారుణమైన అగ్ని ప్రమాదం జరగడం ఇదే ప్రథమం. గాయపడిన వారిలో 18మంది పరిస్థితి విషమంగా వుండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుంది. బాధితుల్లో ఎక్కువమంది వృద్ధులే అయి వుండవచ్చునని తెలిపారు. ఐసియులో వుంటున్న వీరు మరొకరి సాయం లేకుండా నడిచే పరిస్థితి లేకపోయిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. మృతుల్లో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు కూడా వున్నారు. విష పదార్థాలతో కూడిన పొగను పీల్చడంతో ఎక్కువమంది మరణించారు. ఆస్పత్రిలో మంటలను గుర్తించే పరికరాలేవీ లేవని నగర అగ్నిమాపక అధికారి చోయి మాన్ వూ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం 7.30గంటలకు ప్రారంభమైన మంటలను మూడు గంటల తర్వాత అదుపులోకి తెచ్చారు.

సోషల్ మీడియాపై నియంత్రణ అవశ్యం

దావోస్ సమావేశాల్లో వచ్చిన సూచన

శాన్‌ఫ్రాన్సిస్కో : సిగరెట్లు మాదిరిగా సోషల్ మీడియాను కూడా నియంత్రించాలని అమెరికా పారిశ్రామికవేత్త, సేల్స్ ఫోర్స్ సిఇఓ మార్క్ బెనిఆఫ్ సూచించారు. ప్రజాదరణ పొందిన సోషల్ మీడియా వేదికలకు ప్రజలు బానిసలుగా మారుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో ఆయన ప్రసంగిస్తూ, సాంకేతిక ప్రపంచంలో ప్రభుత్వాలు మరింత జోక్యం చేసుకోవాలని సూచించారు. కొంత నియంత్రణ అనేది తప్పనిసరిగా వుండాలని, అయితే అది మరింత ఎక్కువున్నా మంచిదని ఆయన వ్యాఖ్యానించారు. సిగరెట్ పరిశ్రమను ఎలా అయితే నియంత్రించారో అదే మాదిరిగా ఇక్కడ కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అమెరికా క్లౌడ్ కంప్యూటింగ్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అయిన బెనిఆఫ్, తమ ఉత్పత్తులకు, సేవలకు ప్రజలు మరింత దాసులయ్యేలా కంపెనీలు ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి కూడా బానిసలుగా మారే పరిస్థితులు వున్నాయన్నారు. వాటినుండి బయటపడేందుకు మనం సాధ్యమైనంతగా కృషి చేయాలన్నారు. బూటకపు వార్తలకు ప్రచారం కల్పించడంలో సోషల్ మీడియా ముందుంటుందని, ఇటీవలి కాలంలో దీనిపై నిఘా పెట్టడం కూడా జరిగిందని అన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోందని భావించిన ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ ఇటీవలే సమాచారాన్ని ఇవ్వడంలో మార్పులు చేశారు.

అంబేద్కర్‌పై బిజెపి దృష్టి ఓట్లకోసమే

ఫ్రెంచ్ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోఫే జాఫ్రేలాట్

జైపూర్ : రిజర్వేషన్లు లేకపోతే దళితులకు ఏ అవకాశాలూ దక్కవని ప్రముఖ ఫ్రెంచ్ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోఫే జాఫ్రేలాట్ అన్నారు. రిజర్వేషన్లు లేకపోతే ముస్లింల్లోని నిరుపేదల కంటే దళితుల దుస్థితి దయనీయంగా ఉండేదని ఆయన విశ్లేషించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగుతున్న 11వ సాహిత్య ఉత్సవంలో 'డా॥అంబేద్కర్, ఆయన వారసత్వం' అనే అంశంపై జాఫ్రేలాట్ ప్రసంగించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఇప్పుడు దళితులపైనా, అంబేద్కర్‌పైనా దృష్టి సారించాయని చెబుతూ దళితుల ఓటు బ్యాంక్‌ను విస్మరించలేని పరిస్థితిలోనే వారిటువైపు దృష్టిసారించారన్నారు. అంతే మినహా దళితుల పట్ల మంచి సంకల్పం ఉండి కాదని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు లేకపోతే దళితుల పరిస్థితి ఏమవుతుంది..? ఒక వేళ రిజర్వేషన్లు తొలగిస్తే వారు ఎక్కడ ఉండేవారు..? వారికి ఎక్కడా అవకాశాలుండేవి కాదన్నారు. 'డా॥అంబేద్కర్ అండ్ అన్‌టచేబిలిటీ' అనే పుస్తకాన్ని జాఫ్రేలాట్ రచించారు. 1989లో ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల్లో బిజెపి కన్నా జనతాదళ్ మంచి ఫలితాలు సాధించిందని జాఫ్రేలాట్ గుర్తు చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు, విభజించి పాలించు సూత్రాలను భారత్‌లోని రాజకీయ పక్షాలు అనుసరిస్తున్నాయని ఆయన విశ్లేషించారు. ప్రపంచంతో పోలిస్తే భారత్‌లో మంచి చట్టాలున్నాయని.. అయితే, అంబేద్కర్ కలలు నిజం కావాలంటే వాటిని సక్రమంగా అమలు చేయాలని ఆయన సూచించారు. విద్యా హక్కు, సమాచార హక్కు భారత రాజ్యాంగంలో ఉన్నాయి. కానీ, అవి ఏమేరకు అమలవుతున్నాయని జాఫ్రేలాట్ ప్రశ్నించారు. ఈ సాహిత్య సదస్సుకు హాజరైన ఆర్థికవేత్త సుఖ్‌డియో థొరాట్, న్యాయ నిపుణుడు,రచయిత చింతన్ చంద్రచూడ్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ కుమారుడు), బెంగాలీ రచయిత మనోరంజన్ బ్యాపరీ.. దళితులకు రిజర్వేషన్ల అవసరాన్ని, అంబేద్కర్ వారసత్వాన్ని గురించి తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు.



కర్నాటకలో ఇందిరా మొబైల్ క్యాంటీన్ల ప్రారంభం

పేదలకు రాయితీ ధరలకే ఆహారం

బెంగళూరు : పేదల ప్రజలకు సబ్సిడీ రేట్లకు ఆహారాన్ని అందించే 24 మొబైల్ ఇందిరా క్యాంటీన్లకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఇందులో భాగంగా తొలి క్యాంటీన్‌ను రాష్ట్ర శాసన సభ ఆవరణలో ప్రారంభించారు. అనంతరం 24 వార్డుల్లోని కూడళ్లలో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని, వీటి ద్వారా అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాన్ని తక్కువ రేట్లకే పొందవచ్చునని బెంగుళూరు పౌర సంఘ ప్రతినిధి ఎల్. సురేష్ పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్, మే మాసాల్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్థిక శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా 198 వార్డుల్లో ఈ క్యాంటీన్ల ఏర్పాటుకు ఈ ఏడాది బడ్జెట్‌లో 100 కోట్ల రూపాయలను కేటాయించారు. కాగా, నగరంలో తగిన మేరకు స్థలాలు అందుబాటులో లేని కారణంగా, ప్రభుత్వం మొబైల్ క్యాంటీన్లకు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఈ మొబైల్ క్యాంటీన్లలో శాకాహారాన్ని అందించనున్నాయి. అల్పాహారం ప్లేట్ రూ.5 చొప్పున, మధ్యాహ్న, రాత్రి భోజనాన్ని 10 రూపాయల చొప్పున విక్రయించనున్నారు. దీని కోసం టెంపో వాహనాన్ని మార్పులు చేసి, సిసిటివి, జిపిఆర్ఎస్‌తో అనుసంధానం చేస్తారు.

వీటికి విద్యుత్ సరఫరా, ఓవర్‌హెడ్ డ్రింకింగ్ వాటర్ ట్యాంకు, తదితర హంగులను సమకూర్చారు. కర్ణాటకను ఆకలి రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ఇందిరా క్యాంటీన్లను ఏర్పాటు చేయను న్నట్లు గతంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

సెనెగల్‌లో ఐరోపా పర్యాటకులపై లైంగికదాడి

డాకర్ : సెనెగల్‌లో ముగ్గురు ఐరోపా పర్యాటకులపై లైంగికదాడి జరిగింది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సెనెగల్ దక్షిణ ప్రాంతంలోని డియౌలవులూ నగరంలో ఐరోపా పర్యాటకులు ప్రయాణిస్తున్న కారును భద్రతా సిబ్బంది దుస్తుల్లో ఉన్న కొందరు వ్యక్తులు అడ్డగించారు. కారులో తనిఖీలు నిర్వహించాలని అందరినీ కిందికి దింపారు. కారులో ప్రయాణిస్తున్నవారి సామానులు, వస్తువులు దోచుకున్నారు. అనంతరం మహిళలపై లైంగికదాడికి పాల్పడి పరారయ్యారు. కేసు నమోదు చేసుకొని ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. లైంగిక దాడి బాధితులను వైద్య పరీక్షలకు పంపామని అన్నారు. కాగా, ఈనెల 6న కసామన్స్ ప్రాంతంలో దోపిడి దొంగలు బీభత్సం సృష్టించారు. 14 మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడి హతమార్చారు. ఈ ఘటన జరిగిన అనంతరం ఈ ప్రాంతంలో భారీగా బలగాలు మోహరించాయి. కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు పెంపొందించినప్పటికీ లైంగికదాడి ఘటన చోటుచేసుకోవడం పట్ల స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వ పత్రాలతో మరిన్ని అనుమానాలు

జస్టిస్ లోయా మృతి కేసులో మరో మలుపు

న్యూఢిల్లీ : బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాతో ముడిపడి ఉన్న జస్టిస్ లోయా అనుమానాస్పద మృతి కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పత్రాలు లోయా మృతిపై మరిన్ని అనుమానాలను లేవనెత్తాయి. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున ఆ రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సంజమ్‌బార్వే అందచేసిన పత్రాలను లోయా మృతిపై పూర్తిస్థాయి విచారణ కోరిన పిటిషన్‌దారులకు అందచేశారు. వీటిలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. లోయా ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు ఇప్పటిదాకా చెబుతున్న విషయం తెలిసిందే. అయితే, తాజా పత్రాల్లో దానికి భిన్నమైన విషయం వెల్లడైంది. లోయాను మొదట తీసుకువెళ్లిన దాండే ఆస్పత్రిలో ఆయనకు అసలు ఇసిజి చేయలేదని, మరో ఆస్పత్రిలో ఆయనకు న్యూరో సర్జరీ చేసినట్లు ఈ పత్రాల్లో పేర్కొనడం వివాదాస్పదంగామారింది.

ఇసిజి మిషన్ పని చేయలేదు..

లోయా మృతి చెందినప్పుడు ఆయనతో పాటు ఉన్నట్లు చెబుతున్న నలుగురు న్యాయమూర్తులు శ్రీకాంత్ కులకర్ణి, ఎస్.ఎం మోడక్, విసి బర్డే, రూపేష్ రాఠీలు రాతపూర్వకంగా ఇచ్చిన పత్రాన్ని కూడా మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అందచేసింది. నలుగురు న్యాయమూర్తుల తరపున రాఠీ ఈ పత్రంపై సంతకం చేశారు. చేతి రాతతో ఉన్న ఈ పత్రంలో, లోయాను రాత్రి పూట మొట్టమొదట తీసుకువెళ్లిన దాండే ఆస్పత్రిలో ఇసిజి మిషన్ పని చేయలేదని పేర్కొన్నారు. దాండే ఆస్పత్రి మొదటి అంతస్తులో ఉందని, మెట్లు ఎక్కి తాము ఆస్పత్రికి వెళ్లామని పేర్కొన్నారు. ఆస్పత్రిలో అప్పటికి ఒకే డాక్టర్ ఉన్నారని పేర్కొన్నారు. లోయా ముఖమంతా చమటతో తడిసిపోయి ఉందని, అతి కష్టంమీద డాక్టర్‌కు ఆయన ఛాతీలో తీవ్రమైన నొప్పి ఉందని చెప్పారని, విధి నిర్వహణలో ఉన్న డాక్టర్ ఇసిజి తీయడానికి ప్రయత్నించారని, ఇసిబి మిషన్‌లో కొంత భాగం పగిలిపోయి ఉండటంతో పని చేయలేదని పేర్కొన్నారు. ఇసిజి మిషన్‌ను బాగుచేయడానికి డాక్టర్ ప్రయత్నించారని, దీంతో సమయం వృథా అయిందని ఆయన తెలిపారు. చేతి రాతలో ఇచ్చిన నివేదికలోని దిగువ భాగంలో ఉన్న ఈ భాగాలు ఇప్పుడు చర్చనీయంశమైనాయి. అయితే, దాండే ఆస్పత్రిలో లోయాకు చేసిన ఇసిజి రిపోర్టుని నాగపూర్ పోలీస్ కమిషనర్ గతంలో మీడియాకు విడుదల చేశారు. అంతకుముందు ఇదే రిపోర్టుని కొన్ని మీడియా సంస్థలు ప్రచురించాయి. తాజాగా రాఠీ ఇచ్చిన ప్రత్యక్ష సాక్ష్యం ప్రకారం లోయాకు దాండే ఆస్పత్రిలో ఇసిజి తీయలేదని స్పష్టమౌతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూరో సర్జరీ చేశారు..!

దాండే ఆస్పత్రిలో ప్రయత్నాలు విఫలమైన తరువాత లోయాను మెడిట్రెనా ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన పత్రాలలో ఈ ఆస్పత్రిలో ఆయనకు న్యూరో సర్జరీ చేసినట్లు వెల్లడైంది. ఆస్పత్రి నుండి మహారాష్ట్ర ప్రభుత్వం సేకరించిన బిల్లులో న్యూరో సర్జరీ కోసం 1,500 రూపాయలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. గుండెనొప్పితో ఆస్పత్రిలో చేరితే న్యూరో సర్జరీ ఎందుకు చేశారన్న విషయం తేలాల్సిఉంది. ఇప్పటివరకు ఆ దిశలో సంకేతాలు కూడా రాని విషయం ఈ సందర్భంగా గమనార్హం. మెడిట్రెనా ఆస్పత్రి స్థానిక సీతాబుల్డి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తోంది. అక్కడి రికార్డుల్లో 2014 నవంబర్ 30న ఉదయం 6.15 గంటలకు లోయా మృతి చెందినట్టు నమోదై ఉంది. స్థానిక పోలీస్ కమిషనర్ మీడియాకు గతంలో తెలియచేసిన వివరాల ప్రకారం దాండే ఆస్పత్రిలో లోయాకు అదేరోజు, అదే సమయంలో ఇసిజి తీశారు. మెడిట్రెనా ఆస్పత్రి రికార్డుల ప్రకారం 2014 డిసెంబర్ ఒకటిన లోయా మృతి చెందారు.



'బెయిల్‌కు ఆధార్ తప్పనిసరి'ని సవరించండి

న్యూఢిల్లీ : బెయిల్ తీసుకునేటప్పుడు నిందితులు కోర్టులలో తమ ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలన్న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఉత్తర్వులను సవరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పది రోజుల్లోగా ఆ ఉత్తర్వులను సవరించాలని చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం గురువారం వెల్లడించింది. ఇటీవల రాష్ట్రంలోని బిలాస్‌పూర్ జిల్లాలో ఒక కేసుకు సంబంధించి నిందితుడు, న్యాయవాది హమీతో బెయిల్ పొందాడు. రెవెన్యూ రికార్డుల్లో పరిశీలించగా అతని వివరాలు తప్పుగా ఉండడంతో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 5న 'బెయిల్‌కు ఆధార్ తప్పనిసరి' ఉత్తర్వులను జారీ చేసింది. ఇకనుంచి బెయిల్ పొందే నిందితులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డులు అందజేయాల్సిందేనని తీర్పునిచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ, ఛత్తీస్‌గఢ్ బార్ కౌన్సిల్ తరపు న్యాయవాది పీయూష్ భాటియా అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రజల ప్రాథమిక స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు.

త్రిపురలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అనివార్యం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తపన్‌సేన్

అగర్తల : త్రిపురలో మరోసారి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడటం అనివార్యంగా కనిపిస్తోందని, ఫిబ్రవరి 18న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ స్పృహ, పరిణితి కలిగిన ప్రజలు లెఫ్ట్ ప్రభుత్వాన్ని 8వ సారి ఎన్నుకోవడంతో పాటు అధికారం కోసం అనుచిత చర్యలకు దిగుతున్న బిజెపికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పేర్కొన్నారు. బిజెపి విభజన, వేర్పాటువాద కుట్రల నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడవలసి ఉంది. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి కమలం పార్టీ ప్రయత్నిస్తోందని, ఈ విష సర్పం యొక్క కోరలను పీకివేసి, దేశానికి విలువైన ప్రత్యామ్నాయాన్ని చూపుతారని అంబస్స వద్ద జరిగిన ఎన్నిక ప్రచార సభలో తపన్ సేన్ విశ్వాసం వ్యక్తం చేశారు. సుబ్రూమ్, మతబారి వద్ద జరిగిన సభల్లోనూ తపన్‌సేన్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. త్రిపురలో శాంతి, ఐక్యత వాటంతట అవే నెలకొనలేదని, వామపక్ష శక్తుల అవిశ్రాంత కృషి ద్వారా ప్రతిష్టించబడ్డాయని తపన్‌సేన్ పేర్కొన్నారు. 'అయితే బిజెపి ఇప్పుడు వేర్పాటువాదులతో చేతులు కలిపి రాష్ట్రంలో శాంతి, ఐకమత్యాలను దెబ్బ తీయాలని ప్రయత్నిస్తోంది. మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తోంది. రాష్ట్ర ప్రజలు రాజకీయ పరిపక్వతతో వ్యవహరించి ఈ కుట్రలను ఖచ్చితంగా తిప్పికొడతారని భావిస్తున్నాను' అని తపన్‌సేన్ వ్యాఖ్యానించారు.



ప్రముఖ బెంగాలీ నటి సుప్రియా మృతి



కోల్‌కతా : ప్రముఖ బెంగాలీ సినిమా, టివి నటి సుప్రియా చౌదరి(83) సుదీర్ఘ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం దక్షిణ కోలకతా లోని ఆమె నివాసంలో మృతి చెందారు. పాత తరానికి చెందిన గొప్ప నటీమణుల్లో సుప్రియా కూడా ఒకరు. ఆమె చనిపోయేంత వరకు నటిస్తూనే ఉన్నారు. ఆమె ప్రముఖ బెంగాలీ సూపర్‌స్టార్ ఉత్తమ్‌కుమార్‌తో పలు సినిమాల్లో నటించారు. ఈ సినిమాలన్నీ కమర్షియల్‌గా విజయాన్ని సాధించాయి. రిత్విక్ ఘాతక్ దర్శకత్వంలో 1960లో నటించిన 'మెగే ఢక తార(ద క్లౌడ్ - కాప్డ్ స్టార్)' సినిమాలో ఆమె నటన అందరి మదిలో నిలిచిపోయింది. ఈ సినిమాలో ఆమె ప్రధాన పాత్రధారి. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొంది, పుసన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'మాస్టర్ పీస్' అవార్డును కైవసం చేసుకుంది.

భన్సాలీ తలకు రూ.51 లక్షల రివార్డు : రాజ్‌పుత్ చీఫ్

న్యూఢిల్లీ : పద్మావత్ చిత్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ తల నరికిన వారికి రూ. 51 లక్షల ఇస్తామంటూ కర్ణిసేన మరోసారి బహుమానం ప్రకటించింది. 'సంజయ్ లీలా భన్సాలీ తల నరికి తెచ్చిన వారికి వెంటనే రూ. 51 లక్షలు చెల్లిస్తాం' అని ఆల్ ఇండియా భ్రజ్మండల్ క్షత్రియ రాజపుత్ర మహాసభ ఉపాధ్యక్షులు దివాకర్ సింగ్ ప్రకటించారు. 'మా అందోళనకు మద్దతివ్వనివారికీ, సినిమా విడుదలపై మౌనంగా ఉన్న రాజకీయ నాయకులకు ఒక గుణపాఠం నేర్పించాలనుకుంటున్నాం' అని దివాకర్ సింగ్ అన్నారు.

బిజెపిని ఐక్యంగా ఎదుర్కొందాం

- 29న భావసారూప్యత పార్టీల భేటీ
- ఎన్‌సిపి నేత శరద్ పవార్
- ముంబయిలో 'రాజ్యాంగ పరిరక్షణ' మార్చ్ విజయవంతం



ముంబయి : బిజెపిని ఐక్యంగా ఎదుర్కొనే దిశగా పలు ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. ఈ దిశగా ఉండే మార్గాలను చర్చించేందుకు భావసారూప్యతగల పార్టీలు దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 29న సమావేశం కానున్నట్టు ఎన్‌సిపి నేత శరద్ పవార్ ప్రకటించారు. ముంబయిలో వివిధ ప్రతిపక్ష పార్టీలు నిర్వహించిన 'రాజ్యాంగ పరిరక్షణ' ర్యాలీ శుక్రవారం విజయంతంగా జరిగింది. సెక్రటేరియట్‌కు సమీపంలోని ఓవల్ మైదాన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ దక్షిణ ముంబయిలోని గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద ముగిసింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో శరద్ యాదవ్ (తిరుగుబాటు జెడియు నాయకుడు), డి రాజా (సిపిఐ), హార్దిక్ పటేల్ (గుజరాత్ పటిదార్ ఉద్యమ నాయకుడు), దినేష్ త్రివేది (తృణమూల్ కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు. ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చౌహాన్, మాజీ ఎంపీ రామ్ జత్మలానీ తదతరులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.. ఈ నేపథ్యంలో బిజెపికి వ్యతిరేకంగా ఐక్య పోరాటానికి దిశ, దశ నిర్దేశించుకునేందుకు ఈ నెల 29న ఢిల్లీలో ఆ పార్టీల అధినాయకులు భేటీ కానున్నట్టు ఎన్‌సిపి నేత ప్రకటించారు.

హెచ్-1బి వీసాదారులను పెంచాలంటూ సెనెట్‌లో బిల్లు

వాషింగ్టన్ : హెచ్-1బి వీసాదారులను పెంచాలంటూ అమెరికా సెనెట్‌లో ఇద్దరు సెనెటర్లు ఓ బిల్లును ప్రవేశపెట్టారు. ఒకప్రక్క హెచ్-1బి వీసాదారుల సంఖ్యను తగ్గించుకోవాలంటూ ట్రంప్ సర్కార్ కసరత్తు ప్రారంభించగా... మరోపక్క ప్రతిభావంతులైన వారి సేవలు అమెరికాకు ముఖ్యమని కొందరు సెనెటర్లు అభిప్రాయపడుతున్నారు. వార్షికంగా మంజూరు చేసే హెచ్-1బి వీసాలను పెంచాలంటూ ఓ బిల్లును సెనెట్‌లో ప్రవేశపెట్టారు. ఆరిన్ హాచ్, జెఫ్ ఫ్లాక్ అనే సెనేటర్లు 'ది ఇమ్మిగ్రేషన్ ఇన్నోవేషన్ 70 (ఐ స్క్వేర్డ్) యాక్ట్ - 2018 పేరుతో దీన్ని ప్రవేశపెట్టారు. చట్టబద్ధమైన స్టేటస్‌ను కోల్పోకుండానే హెచ్-1బి వీసా హోల్డర్స్ తమ ఉద్యోగాన్ని మార్చుకునేలా కూడా ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ లాంటి టాప్ అమెరికన్ ఐటీ కంపెనీలు ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయి.

ప్రత్యేకం

ఫీచర్స్ ఫోన్లతో జియో స్మార్ట్ దెబ్బ



ఫీచర్స్ అండ్ పాలిటిక్స్ : ఏకచత్రాదిపత్యం దిశగా అడుగులు వేస్తోన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీకి చెందిన జియో సంస్థ ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ తయారీ కంపెనీల్లో సైతం కొత్త భయాల్ని రేపుతోంది. ఆ నేపథ్యంపై ప్రత్యేక కథనం..

"నామమాత్రపు రుసుమును చెల్లించి, నిర్ణీత వ్యవధి అనంతరం.. చెల్లించిన నగదును వాపసు పొందుతూనే.. 4జీ నెట్‌వర్క్ ఫోన్ ను శాశ్వతంగా మీ సొంతం చేసుకోండి" అంటూ జియోఫోన్ చేసిన మార్కెట్ స్టంట్ కు స్మార్ట్ ఫోన్ దిగ్గజాల వెన్నులో ప్రస్తుతం వణుకు పుడుతోంది. దీనికి కారణం.. దేశీయ ఫీచర్ ఫోన్ విపణిలో ఏకంగా 27 శాతం వాటాను రిలయన్స్ జియో ఫీచర్ ఫోన్ సాధించడమే! ఇది నిజం.. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ సంస్థ 2017 నాలుగో త్రైమాసికానికి గానూ.. 'తయారీ సంస్థల నుంచి షిప్‌మెంట్‌ల'ను పరిగణనలోకి తీసుకుని వెల్లడించిన నివేదికలో ఈ విషయం బయటపడింది. రూ.1,500ల జియో 4జీ నెట్‌వర్క్ ఫీచర్ ఫోన్ ప్రకటన రావడమే ఆలస్యం.. ఈ ఫోన్ కోసం సుమారు 60 లక్షల ముందస్తు బుకింగ్‌లు జరగడంతో పాటూ ఇంకా చాలా మంది ఈ ఫోన్ కోసం ఉవ్విళ్ళూరుతుండటం.. సాధారణ ఫీచర్ ఫోన్ వాడిన వారు అత్యంత తక్కువ ధరలో 4జీ నెట్‌వర్క్ పై పనిచేసే జియో ఫోన్‌కు అప్‌గ్రేడ్ అవుదామని భావించడం.. వగైరా వంటి వాటిని చూస్తే, దేశంలో ఫీచర్ ఫోన్లకు పూర్వ వైభవం రానుందన్న సంకేతాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడు టార్గెట్ వాళ్ళేనా?

జియో వచ్చాక.. ఒక్కసారిగా 4జీ వీవోఎల్‌టీఈ ఫోన్లకు గిరాకీ బాగా పెరిగింది. దీంతో చాలా వరకు మొబైల్ తయారీ కంపెనీలు 4జీ ఫోన్లను గణనీయంగా విక్రయించి లాభాలను ఆర్జించాయి. ఈ క్రమంలో చాలా మంది యూజర్లు జియో నెట్ వర్క్ ను వాడడం కోసం ఏకంగా కొత్త 4జీ ఫోన్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబరిచినప్పటికీ.. ఆయా ఫోన్ల ధరలు వారి ఆశలకు కళ్ళెం వేశాయి. ఇది గమనించిన జియో కంపెనీ.. గ్రామీణ స్థాయి నుంచి అందరికీ అందుబాటులో 4జీ ఫోన్ ఉండాలని '4జీ ఫీచర్ ఫోన్'కి శ్రీకారం చుట్టింది(స్మార్ట్ ఫోన్ ఐతే, ఖరీదు కాబట్టి..). చౌకైన ఫోన్లపై మొగ్గుచూపుతున్న కష్టమర్లకు ఫ్రీగా వస్తున్న రిలయన్స్ జియో 4జీ ఫీచర్ ఫోన్ ఒక అదుతేంగా కనిపించింది. ఈ వ్యవహారం ఫీచర్ ఫోన్ మార్కెట్‌కు మరింత పాపులారిటీని తెచ్చిందనే చెప్పాలి. జియో అనంతరం.. ఐకాల్, పీస్, వివా వంటి కొత్త కొత్త బ్రాండులు 4జీ ఫీచర్ ఫోన్లను మార్కెట్‌లోకి తీసుకురావడంతో ఆయా ఫోన్లకు సైతం డిమాండ్ పెరుగడం వల్ల స్మార్ట్ ఫోన్ అమ్మకాలపై పెను ప్రభావం మొదలైంది.

జియో - మాయ

- జియో ప్రవేశపెట్టిన ఆఫర్లు, నిర్ణయాల మూలంగా టెలికాం పరిశ్రమలో సుమారు లక్షమంది తమ ఉద్యోగాలను కోల్పోయారు.
- జియో చేసిన గాయాన్ని మాన్పుకోవడానికి ఎయిర్ టెల్, ఐడియా వంటి ప్రధాన సెల్యూలార్ కంపెనీలు సైతం విలీనాలబాట పట్టడం విశేషం.
- మొబైల్ డేటా వినియోగంలో 155వ స్థానంలో ఉన్న భారత్.. జియో రాకతో ఏకంగా.. నంబర్ 1 స్థానానికి చేరుకొంది.
- దేశ రిటైల్ ఇండస్ట్రీలో 88 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్న కిరాణా షాపుల ద్వారా జియో కిరాణా సరకుల రంగంలోకి పూర్తిస్థాయిలో ప్రవేశించడానికి సన్నద్ధమవుతోంది.
- 1977లో ఆర్ఐఎల్ టర్నోవర్ 33 కోట్లు ఉంటే, గత యేడు సంస్థ టర్నోవర్ 3.3లక్షల కోట్లకు పైనే!

సంక్షిప్తం

ఉగ్రవాద గ్రూపులతో చర్చలకు సిద్ధం

ఇంఫాల్ : రాజకీయ పరిష్కారం సాధించే లక్ష్యంతో ఉగ్రవాద గ్రూపులతో చర్చలకు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే ఉత్సవం సందర్భంగా ఈ మేరకు ఆయన వారికి ఆహ్వానం పలికారు. అలాగే 2017 మార్చిలో తమ ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన అనంతరం సాధించిన విజయాలను వెల్లడించారు. రాష్ట్రంలో అవినీతిని రూపుమాపడానికి కట్టుబడి వున్నామని, ఇందుకోసం తన కార్యాలయంలోనే అవినీతి నిరోధక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 500కు పైగా ఫిర్యాదులను అందుకున్నామని, 125పై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కాగా ఈ రిపబ్లిక్ డే వేడుకల్లో వివిధ విద్య, సాంస్కృతిక విభాగాలకు చెందిన 79 బృందాలు పాల్గొన్నాయి. గవర్నర్ నజ్మా హెప్తుల్లా గౌరవ వందనం స్వీకరించారు. మణిపూర్‌కు చెందిన పురాతన ప్రాంతం కంగ్లా వద్ద ఈ వేడుకలు జరిగాయి.

బద్దలైన మేయాన్ అగ్నిపర్వతం భారీగా ఎగిసిపడుతున్న లావా

లెగజ్పీ : ఫిలిప్పీన్స్‌లో బద్దలైన అగ్నిపర్వతం స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. దీని తీవ్రత కారణంగా ప్రభుత్వం మూడు నెలలపాటు పలుప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి విధించింది. దాదాపు 81వేల మంది ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ఫిలిప్పీన్స్‌లోని సెంట్రల్ ఆల్బే ప్రావిన్స్‌లోగల మేయాన్ అగ్ని పర్వతం బద్దలైంది.నాలుగో నెంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దీని ప్రకారం అతి ప్రమాదానికి కొద్ది దూరంలోనే ఉన్నట్టు అర్థం. అందులో నుంచి భారీ ఎత్తున లావా ఎగిసిపడుతోంది. దాని తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముందస్తు భద్రతా చర్యల్లో ప్రభుత్వం లీనమైంది. అగ్నిపర్వతం చుట్టుపక్కల నుంచి ఖాళీ చేయించిన వారిని దాదాపు మూడు నెలలపాటు సంరక్షించాల్సిన బాధ్యత తమపైనే ఉందని, అందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ దేశ విపత్తు నిర్వహణా అధికారులు తెలిపారు. శిబిరాల్లో ఉన్నవారికి ఆహారం అందిస్తున్నామన్నారు. 69 పునరావాస శిబిరాల్లో దాదాపు 80వేలమంది ఉన్నారని అన్నారు.

ఈజిప్ట్‌లో స్వతంత్ర కార్మిక సంఘాలపై పరిశోధన చేస్తున్న విద్యార్థి హత్య

కైరో : ఈజిప్ట్ స్వతంత్ర కార్మిక సంఘాలపై పరిశోధన చేసినందుకు ఇటలీకి చెందిన విద్యార్థిని హత్య చేశారని రోమ్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. రెండేళ్ళ క్రితం కైరోలో ఇటలీ గ్రాడ్యుయేట్ విద్యార్థి గిలియో రెజినీ మృత దేహం ఛిద్రమైన స్థితిలో కనిపించింది. ఆ హత్యపై అధికారులు దర్యాప్తు జరిపారు. రెజినీ పరిశోధనల కారణంగా ఆయనపై ఈజిప్టు పోలీసులు నిఘా పెట్టారు. కానీ చివరకు ఆయన అదృశ్యమయ్యారు. అయితే దీనికి ఎవరు కారణమనేది అధికారులు వెల్లడించలేదు. అయితే ఈ హత్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఈజిప్ట్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆయన కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. కేంబ్రిడ్జి యూనివర్శిటీ డాక్టరేట్ కోసం రీసెర్చ్ చేస్తున్న రెజినీ (28) 2016 జనవరి 25న అదృశ్యమయ్యాడు.



ఆదివాసీల గర్జన

ఆస్ట్రేలియాలో మెల్‌బోర్న్‌లోని ఫ్లిండర్స్ స్ట్రీట్ స్టేషన్ వద్ద శుక్రవారం నాడు ఆదివాసీలు నిర్వహించిన మద్దతుగా వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

ఆస్ట్రేలియావ్యాప్తంగా వేలాదిమంది నిరసనలు

జాతీయ దినోత్సవాన్ని మార్చాలని డిమాండ్

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవమైన శుక్రవారం నాడు వేలాదిమంది ప్రజలు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'ఇది ఆదిమవాసులు భూమి', మీరు మా భూమిని దొంగిలించారు.' అని గట్టిగా నినాదాలు చేశారు. మెల్‌బోర్న్ నిరసనల్లో 10వేల మందికి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో వేలాదిమంది ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారు. దండయాత్ర జరిగిన రోజుగా పేర్కొంటూ వారు శుక్రవారం ఈ నిరసన చేపట్టారు. జాతీయ దినంగా పాటించడంపై పునరాలోచించాలని, ఎందుకంటే ఇది ఆదిమవాసులపై దాడి జరిగిన రోజని వారు పేర్కొంటున్నారు. 1788లో మొదటగా బ్రిటీష్ సెటిలర్లు వచ్చిన రోజునే ఆస్ట్రేలియా డే గా పేర్కొంటూ వస్తున్నారు. అయితే ఇది ఆదిమవాసులపై వలసవాదుల అణచివేతకు ఆరంభంగా పలువురు ఆస్ట్రేలియన్లు పేర్కొంటున్నారు. ఆస్ట్రేలియాలో వైవిధ్యభరితమైన సంస్కృతి వుంది. ప్రతి ఒక్కరినీ ఇందులో కలుపుకుని పోవాల్సిన అవసరముంది. అందువల్ల జాతీయ దినంగా పాటించే తేదీని మార్చాల్సి వుందని మెల్‌బోర్న్ ఆందోళనకారుడు రాచెల్ ముయిర్ వ్యాఖ్యానించారు. ఆస్ట్రేలియాపై యురోపియన్లు దాడి చేసిన రోజునే ఆస్ట్రేలియా దినోత్సవంగా జరుపుకోవడం ఇక్కడ ఆదిమవాసుల్ని అవమానించడమేనని మరో ఆందోళనకారుడు గ్రెగ్ హంట్ వ్యాఖ్యానించారు.



అరెస్టు వారంటును ఉపసంహరించుకోండి

బ్రిటన్ కోర్టును కోరిన అసాంజె

లండన్ : తనపై జారీ చేసిన అరెస్టు వారంటును ఉపసంహరించుకోవాల్సిందిగా వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజె బ్రిటన్ కోర్టును కోరారు. ఈ వారంటు వల్లే లండన్‌లోని ఈక్వెడార్ ఎంబసీని వీడి ఆయన వెళ్ళలేకపోతున్నారు. ఈ ఎంబసీలో ఆయన గత ఐదున్నరేళ్ళుగా వుంటున్నారు. అత్యాచారం ఆరోపణలపై స్వీడన్‌కు తిరిగి పంపించేందుకు జరిగే ప్రయత్నాన్ని అడ్డుకునేందుకే ఆయన 2012లో ఎంబసీలోకి ప్రవేశించారు. తనపై వచ్చిన అత్యాచార అభియోగాలను ఆయన తిరస్కరిస్తున్నారు. ఆయనపై దర్యాప్తును స్వీడిష్ ప్రాసిక్యూటర్లు విరమించుకున్నప్పటికీ బ్రిటన్‌లో బెయిల్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయన ఎంబసీ భవనం దాటివస్తే అరెస్టు చేస్తారు. ఒకవేళ కోర్టులో అసాంజెకు అనుకూలంగా కేసు తీర్పు వెలువడితే ఆయనకు విముక్తి లభిస్తుందా అని ప్రశ్నించగా, అది ఊహాజనితమైన ప్రశ్న అని క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీసెస్ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

రండి.. పెట్టుబడులు పెట్టండి



దావోస్ సమావేశాల్లో ట్రంప్ పిలుపు

దావోస్ : పెట్టుబడిదారులకు అమెరికా స్వర్గధామమని పేర్కొంటూ, పెట్టుబడులు పెట్టేందుకు తరలిరావాలని ప్రముఖ కంపెనీలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానించారు. ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సమావేశాల్లో చివరి రోజైన శుక్రవారం తొలిసారిగా అధ్యక్ష హోదాలో ట్రంప్ ప్రసంగించారు. తన 'అమెరికా ఫస్ట్' విధానాన్ని ప్రస్తావిస్తూ, "అమెరికాను అన్ని దేశాలకన్నా అగ్రగామిగా నిలపాలన్నది తన ఆకాంక్ష అని చెప్పారు. అయితే అమెరికా ఒక్కటే ఎదగాలని తాను కోరుకోవడం లేదని, ప్రపంచ దేశాలు కూడా అలాగే ఎదగాలన్నది తమ అభిమతమని చెప్పారు. ప్రతి ఒక్కరూ సుఖ సౌఖ్యాలతో జీవించేలా, ప్రతి బిడ్డా స్వేచ్ఛగా, నిర్భయంగా ఎదగగలిగే ప్రపంచాన్ని నిర్మించడంలో సహాయపడేందుకు అమెరికా నిబద్ధతతో వుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ప్రజల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేందుకు, మరింత మెరుగైన ప్రపంచం కోసం ఇతర దేశాలతో కలిసి అమెరికా భాగస్వామ్యాన్ని పునరుద్ధాటించేందుకే తానిక్కడకు వచ్చానని ట్రంప్ చెప్పారు. అవకతవకలతో కూడిన, అక్రమ వాణిజ్యాన్ని అమెరికా ఎన్నటికీ సహించబోదని స్పష్టం చేశారు. ఇతరులను పణంగా పెట్టి కొన్ని దేశాలు వ్యవస్థను దోపిడీ చేయాలని చూస్తే స్వేచ్ఛా, పారదర్శకమైన వాణిజ్యం నిర్వహించలేమని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్యానికి తాను మద్దతిస్తామని అయితే, అది సక్రమంగా వుండాలని, పైగా పరస్పరం ఆ రీతిలోనే వ్యవహరించాల్సిన అవసరం వుందని అన్నారు. గతేడాది కాలంగా తాము అసాధారణమైన చర్యలు కొన్ని తీసుకున్నామని చెబుతూ, ఇటీవల తమ ప్రభుత్వం తీసుకువచ్చిన పన్నుల కోత విధానం అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఎంతగా సాయపడుతుందో చెప్పుకువచ్చారు. సగటున ఒక అమెరికన్ కుటుంబ ఆదాయం 4వేల డాలర్లు పెరుగుతుందని చెప్పారు. అమెరికాలో పెట్టుబడులు పెట్టేందుకు, ఎదిగేందుకు ఇది సరైన సమయమని ఉద్ఘాటించారు. ఏళ్ళ తరబడి ఆర్థిక వ్యవస్థ మందకొడిగా సాగిన నేపథ్యంలో తాను పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత అమెరికా మళ్ళీ పటిష్టమైన ఆర్థిక పురోగతిని సాధిస్తోందని తెలిపారు. పటిష్టమైన, సంపద సౌభాగ్యాలతో తులతూగే అమెరికా ఆవిర్భావాన్ని ఈ ప్రపంచ దేశాలు చూస్తున్నాయని అన్నారు. 24లక్షల ఉద్యోగాలు సృష్టించామన్నారు. ఆఫ్రికన్-అమెరికన్ నిరుద్యోగం రేటు రికార్డు స్థాయిలో క్షీణించిందన్నారు. అపార వాణిజ్య అవకాశాలకు అమెరికా ద్వారాలు తెరిచిం దనే సందేశాన్ని ఇవ్వడానికే తాను ఇక్కడకు వచ్చానని ట్రంప్ పేర్కొన్నారు. పెట్టుబడుదారులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామని చెప్పారు. అమెరికా రండి, వ్యాపారం చేయండి, పెట్టుబడులు పెట్టండంటూ పదేపదే కోరారు.

అమెరికన్ల భద్రతపై ఎక్కువగా ఖర్చు పెడుతున్నామని చెప్పారు. తీవ్రవాదం నుండి ప్రపంచాన్ని మరింత భద్రంగా వుంచేందుకు ఇతరదేశాలు కూడా వారి రక్షణ వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. అణు నిరాయుధీకరణ దిశగా ఉత్తర కొరియా చర్యలు తీసుకునేలా చూడాలని చూడాలని కోరారు. జిహాదీ సంస్థలను సమూలంగా నిర్మూలించేందుకు మిత్రపక్షాలతో కలిసి పని చేస్తున్నామన్నారు.

ఇరాన్ గురించి ప్రస్తావిస్తూ, అణ్వాయుధ కార్యక్రమం వైపు ఇరాన్ వెళ్ళకుండా నిలువరించేలా చూడాలని భాగస్వామ్య దేశాలను కోరారు. 2015లో కుదిరిన ఇరాన్ అణు ఒప్పందాన్ని ఆయన బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు.

ప్రతిభా పాటవాలు కలిగిన వారికి అవకాశమిచ్చేలా అమెరికా ఆర్థిక వ్యవస్థకు దోహదపడతారని భావించే వారికి ముందుగా అవకాశం కల్పించాలని భావిస్తున్నట్లు ఇమ్మిగ్రేషన్‌పై తన ఆలోచనలు ట్రంప్ వివరించారు. డావోస్‌లో వున్న రెండు రోజుల్లో ట్రంప్ పలువురు ప్రపంచ నేతలతో, వ్యాపార, వాణిజ్య వర్గాల అధినేతలతో సమావేశాలు జరిపారు.

అమెరికాలో పెట్టుబడులు పెట్టేలా కంపెనీలను ప్రోత్సహించేందుకే తాను డావోస్ రావాలని నిర్ణయించుకున్నానని అంతకుముందు ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కాగా, అంతకుముందు ట్రంప్ బ్రిటీష్ ప్రధాని థెరిస్సా మేతో భేటీ అయ్యారు. సిరియా పరిస్థితులపై, ఇరాన్ ఒప్పందంపై ఉభయులూ చర్చించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహుతో కూడా ట్రంప్ చర్చలు జరిపారు. మధ్య ప్రాచ్యంలో ఇరాన్ ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై, జెరూసలేంను రాజధానిగా చేయడంపై చర్చించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై దర్యాప్తు జరపకుండా ప్రత్యేక ప్రాసిక్యూటర్ రాబర్ట్ ముల్లార్‌ను నిలువరించడానికి ప్రయత్నించానని వచ్చిన వార్తలను బూటకం అంటూ డావోస్ వచ్చిన వెంటనే ట్రంప్ కొట్టిపారేశారు.



ఫ్రాన్స్‌వ్యాప్తంగా భారీ వర్షాలు

ఆకస్మిక వరద భయంతో పారిస్‌లో వందలాదిమంది తరలింపు

పారిస్ : ఫ్రాన్స్‌వ్యాప్తంగా నదులు పొంగిపొర్లుతుండడంతో ముందు జాగ్రత్త చర్యగా పారిస్ ప్రాంతం నుండి వందలాదిమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదలు సంభవించే అవకాశాలు వుండడంతో దేశవ్యాప్తంగా 13 విభాగాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. కాగా ఇంకా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తూనే వున్నాయి. పారిస్‌లో సీనె నదికి ఉధృతంగా నీరు రావడంతో శనివారం వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని భావిస్తున్నారు. తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ శీతాకాలంలో భారీ వర్షాలు కురియడమే ఆకస్మిక వరదలకు కారణమని అధికారులు తెలిపారు పారిస్‌లో వర్షాలు సాధారణ స్థాయి కన్నా రెండు రెట్లు ఎక్కువగా కురిశాయి. గురువారం నాటికి సీనె నది నీటిమట్టం 18 అడుగులకు చేరుకుందని ఇది, శనివారం నాటికి 20 అడుగులకు చేరుతుందని భావిస్తున్నారు. 1910లో పారిస్‌కు భారీ వరదలు సంభవించినప్పుడు ఈ నది నీటి మట్టం 28 అడుగులు వుంది.

మొదటి పేజీ తరువాయి

త్రిపుర ఎన్నికలకు సంఘీభావ నిధి సేకరించండి

విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి పార్టీ కమిటీలు ఈ సంఘీభావ నిధికి విరాళాలు సేకరించి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం, హౌస్ నెం, 27-28-12, యామాల వారి వీధి, గవర్నరు పేట్, విజయవాడ-2 0866-2577202, ఎజూఅఖుజూఎస్త్రఖుఅశ్రీ.ఎశీఎ చిరునామాకు విరాళాలు పంపాలని మధు తెలిపారు.

రైల్వే ప్రైవేటీకరణకు పరుగులు

అధికారులు ఇప్పుడు ఏకంగా 60 ఏళ్ళ వరకు కూడా ఇచ్చేందుకు సంసిద్ధమవ్వడం గమనార్హమని ఆయన వివరించారు. స్విస్ ఛాలెంజింగ్ పద్ధతి అనుసరించడంతో ఎవరూ ముందుకు రాలేదని, దాంతో ఆ కార్యక్రమం అక్కడితో ఆగిపోయిందని తెలిపారు. అయితే బడ్జెట్‌లో కోతలు విధించడం వల్ల ప్రైవేటీకరణ ఎజెండాను అమలు చేసే దిశగా ముందుకెళ్ళడంతో పాటు భద్రత అనేది ప్రమాదంలో పడుతుందని ఆయన విమర్శించారు.

రూ.1.20 లక్షల కోట్లు ఏమయ్యాయి..?

పట్టిసీమ ప్రాజెక్టు ఎత్తేస్తారని, శాశ్వత ప్రభుత్వ కార్యాలయాలు పూర్తయితే రూ.700 కోట్లతో నిర్మించిన తాత్కాలిక సెక్రటేరియట్ ఎత్తేస్తారని, అయినా కనీస ఆలోచన లేకుండా వందల కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండానే రాష్ట్రంలో రెవెన్యూ లోటు పెంచారంటున్నారు 2014లో రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చేప్పటికి రూ. 97 వేల కోట్ల అప్పులున్నాయి. 2014 నుండి ఇప్పటి వరకూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.1.20 లక్షల కోట్లు అప్పు చేశారు. ఇందులో రూ.68 వేల కోట్లు వడ్డీతో కూడినవి, మిగిలినవి వడ్డీలేనివి. వీటిని కూడా వేర్వేరు ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ బ్యాంకుల నుండి తీసుకొచ్చారు. దీనిపై పిఎసిలో ప్రశ్నిస్తే వడ్డీలేని అప్పులు తీసుకొచ్చామని, వీటి వల్ల ఇబ్బంది ఏమిటని ప్రభుత్వ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పిఎసిలో చర్చ సాగింది. రాష్ట్రంలో పెద్దగా చెప్పుకోదగిన ప్రాజెక్టు ఏదీ లేకపోయినప్పటికీ ఇన్ని లక్షల కోట్లు అప్పులు దేనికి ఖర్చు చేశారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అదీ గాకుండా రూ.70 వేల కోట్లు రెవెన్యూ లోటు చూపిస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్ర విభజన సమయానికి కాగ్ నివేదికలో రూ.7000 కోట్ల లోటు ఉంటుంని చెప్పిందని, కేంద్రమైతే రూ.4000 కోట్లు మాత్రమే ఉంటుందని చెప్పిదని, ఆ మేరకు కేంద్రం నిధులు విడుదల చేసి చేతులు దులుపుకొందని నిపుణులు చెబుతున్నారు. కనీసం ఆదాయాన్ని తెచ్చే ఒక్క ఆస్తి కూడా పెంచకుండా అప్పుల మాత్రం పెంచేశారని, తెచ్చిన అప్పులు ఏ మయ్యాయనేది ప్రశ్నార్థకమంటున్నారు. పోలవరానికి ఖర్చు చేసినా వాటిని కేంద్రం నుండి రీయింబర్స్ చేసుకుంటున్నాని, అటువంటప్పుడు అది అప్పులో లెక్క కూడా కాదంటున్నారు. నిధులు విషయంలో ప్రభుత్వం నంబరు 22 జీవోతో ప్రాజెక్టుల అంచనాలు పెంచిందంటున్నారు. ఇపిసి ప్రాజెక్టులు కేటాయించేటప్పుడే అంచనాలుంటాయని, అటువంటప్పుడు వందల కోట్లు అదనంగా ఎలా కేటాయించారని పిఎసి సభ్యులు ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుతం కట్టిన ప్రధాన ప్రాజెక్టులు ఏమిటో చెప్పాలని ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మొత్తం అప్పులు రూ.2.16 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తరువాత చెల్లించాల్సింది ప్రజలే. వారిపైనే భారం పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అప్పులు చేసే సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆలోచన లేకుండా చేసిన అప్పుల వల్ల నిధులు దుబారా అవుతాయని బుగ్గన తెలిపారు.

ఇస్లాం వ్యతిరేక వీడియోలను రీట్వీట్ చేసినందుకు ట్రంప్ క్షమాపణలు

లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాపణలు చెప్పారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ముగింపు ప్రసంగం ఇచ్చేందుకు ఆయన దావోస్ వెళ్లారు. అక్కడ బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ముస్లిం వ్యతిరేక వీడియోలను రీట్వీట్ చేసినందుకు గాను క్షమాపణలు కోరారు. వాళ్లు నిజంగా జాత్యాంహకార ప్రజలయితే.. ఆ వీడియోలు రీట్వీట్ చేసినందుకు గాను క్షమాపణలు చెబుతానని ట్రంప్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. బ్రిటన్ ఫస్ట్ అనే జాతీయవాద గ్రూపు డిప్యూటీ లీడర్ జైడా ఫ్రాన్సెస్ గతేడాది నవంబర్‌లో తన ట్విటర్ ఖాతాలో మూడు వీడియోలను పోస్టు చేశారు.

అన్ని నియోజకవర్గాల్లో తెలుగు సభలు నిర్వహించాలి

ప్రజాశక్తి-తెనాలి టౌన్ (గుంటూరు)

రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తెలుగుభాష అభివృద్ధిని కాంక్షిస్తూ కనీసం ఒక్క సభనైనా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బొల్లిముంత శివరామకృష్ణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలుగు సాహిత్య మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. తొలుత కళాక్షేత్రంలోని తెనాలి రామలింగ కవి విగ్రహానికి అతిథులు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ రమణ మాట్లాడుతూ.. భాషాభివృద్ధికి మౌలికంగా ఎదురవుతున్న అవరోధాలను పరిశోధించి, వాటిని నివృత్తి చేసుకోవటం ద్వారా తెలుగు భాషాను బతికించుకోవాలన్నారు. గతంలో మాదిరిగా ఉత్తరాల ప్రక్రియ, అదీనూ తెలుగులో సాగించాలని, ఇంట్లో పిల్లలతో సంభాషించే విషయాలు తెలుగులో ఉండాలని, ప్రతి ఇంటా పెద్దబాల శిక్ష ఉండాలని సూచించారు. రాష్ట్ర భాషా సంచాలకులు డి.విజయభాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, నాగరికత మధ్య సంఘర్షణ కొత్త పదాలకు నాంది కావాలన్నారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. పరభాషా వ్యామోహాన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు పెంచి పోషిస్తున్నాయని, వాటి మెడలు వంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. మారిషస్ దేశంలో ఒకటి నుంచి పీజీ వరకూ తెలుగు భాష బోధన ఉన్నా మన రాష్ట్రంలో కనుమరుగవడం బాధాకరమన్నారు. అనంతరం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షులు జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు మాట్లాడారు. న్యాయశాఖ కార్యదర్శి వెంకరమణ, మాజీ వీసీ, రచయిత ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య మహోత్సవ ప్రారంభంలో జస్టిస్ ఎన్‌వి.రమణ



జస్టిస్ ఎన్‌వి రమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉప సభాపతి

బాల సాహిత్యం- భాషా వికాసంపై సదస్సు

ప్రారంభ సభ అనంతరం బాల సాహిత్యం-భాషా వికాసంపై సదస్సు నిర్వహించారు. సాహితీవేత్త, ఎంపి కన్నేశ్వరరావు సభా పరిచయం చేయగా చొక్కాపు వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. భాషా వికాసం, మహిళల పాత్ర అంశంపై సదస్సుకు కమిషనర్ కె.శకుంతల సభాపరిచయం చేయగా, పి.హైమావతి అధ్యక్షత వహించి మాట్లాడారు. సదస్సులో పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. ఉత్సవాల ఆవరణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ప్రారంభించారు.

ఏదో రాజకీయ కుట్ర దాగివుంది..

'పద్మావత్' నిరసనలపై ప్రఖ్యాత దర్శకుడు శ్యామ్ బెనెగల్

ఢిల్లీ : సంజయ్ లీలా భన్సాలీ తీసిన 'పద్మావత్', 1988లో నేను సీరియల్‌గా తీసిన "భారత్ ఏక్ ఖోజ్' రెండూ దాదాపు ఒకటే. మరి ఆనాడు వ్యక్తంకాని నిరసనలు, ఈనాడు ఎందుకు ఇంతపెద్ద స్థాయిలో వస్తున్నాయో అర్థం కావటం లేదు. 'పద్మావత్'ను అడ్డుకునే శక్తుల వెనుకున్నవారికి రాజకీయ ప్రయోజనముంది. 'రాజ్‌పుత్' ఓటుబ్యాంక్ కోసం..రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారన్నది నా పరిశీలన..అని ప్రముఖ దర్శకుడు శ్యామ్‌బెనెగల్ తాజా ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమా పేరు చెప్పి, రాజకీయ ప్రయోజనాల కోసం.. దేశవ్యాప్తంగా హింసరేపాలన్న కుట్ర దాగివుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'మీరు ఒక విషయాన్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఇది సహనం, అసహనంకు సంబంధించిన విషయం కాదు. దానికి మించి ఇంకా ఏదో ఉంది. 1988లో 'భారత్ ఏక్ ఖోజ్' 56 ఎపిసోడ్స్‌తో సీరియల్‌గా తీశాను. దూరదర్శన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రసారమైంది. ఇందులో ఓంపురి అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్ర పోషించారు. ఇప్పుడు సంజయ్‌లీలా భన్సాలీ తీసింది కూడా ఇదే కథ. నేను తీసిననాడు ఎలాంటి నిరసనలూ రాలేదు. అంటే ఇప్పుడు వ్యక్తమవుతున్న అభ్యంతరం, చోటుచేసుకుం టున్న ఘటనలు 'పద్మావత్' కథాంశం గురించి కాదన్నమాట. ముస్లిం వలసదారులు ఓ చిన్నారిని చితకబాదడం, వర్జిన్ మేరీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం, ఓ టీనేజీ కుర్రాడిని ముస్లిం యువత కొట్టి చంపడం.. ఇవి ఆ మూడు వీడియోల సారాంశాలని' అన్నారు.

'ఉపాధి' లేక ఉసూరుమంటున్న వంశధార నిర్వాసితులు

పనుల కల్పనకు సాంకేతిక ఇబ్బందులు



ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తున్న మెట్టూరు పునరావాస కాలనీలోని నిర్వాసితులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఓవైపు వంశధార నిర్వాసిత గ్రామాలు నేలమట్టమయ్యాయి. దీంతో ఆ గ్రామస్తులు గూడు కోల్పోయి వీధిన పడ్డారు. మరోవైపు ఉపాధి హామీ పనులకూ దూరమయ్యారు. నిర్వాసితులకు వేరే మండలాల్లో పునరావాసం కల్పించడంతో పనుల కల్పనకు సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జరుగుతుండగా పునరావాస కాలనీలో ఉంటున్న నిర్వాసితులకు ఎటువంటి పనులూ కల్పించడం లేదు. వారికి ఇప్పటికిప్పుడు పనులు కల్పించే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

స్థాన చలనంతో ఉపాధి పనులకు ఆటంకం

వంశధార రిజర్వాయర్ నిర్మాణం పేరుతో ప్రభుత్వం హడావుడిగా హిరమండలం, కొత్తూరు మండలాల్లోని నిర్వాసితుల ఇళ్లను కూల్చి వేసింది. వారిని బలవంతంగా గ్రామాల నుంచి తరలించింది. కేటాయించిన పునరావాస కాలనీల్లో ఇళ్లను నిర్మించుకునేందుకు సమయం కూడా ఇవ్వకపోవడంతో ఆర్థికంగా కాస్తా కూస్తో బాగున్న వారు అద్దెకు ఇళ్లు తీసుకుని ఉంటున్నారు. అద్దెలు చెల్లించుకునే స్తోమత లేనివారు పునరావాస కాలనీల్లో తమకు కేటాయించిన స్థలాల్లో కర్రలు, కంపలు, గుడ్డలతో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు.

సాంకేతిక సమస్యలు

ఇలా నివాసముంటున్న వారంతా జాబ్‌కార్డుల్లో తమ సొంత మండలాల చిరునామాలే కలిగి ఉన్నారు. ఇది ప్రస్తుతం వారికి నష్టంగా పరిణమించింది. నిర్వాసితులకు హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల పరిధిలో 15 చోట్ల పునరావాస కాలనీలను ప్రభుత్వం కేటాయించింది. మండలం మారడంతో వారికి ప్రభుత్వం గతంలో జారీ చేసిన జాబ్ కార్డులు చెల్లుబాటు కావడం లేదు. హిరమండలం మండల నిర్వాసితులకు కొత్తూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాల్లోని పలు ప్రాంతాల్లో కాలనీలు కేటాయించారు. వీరంతా మండలం మారడంతో ఆ జాబ్‌కార్డుతో ఆయా మండలాల్లో ఉపాధి పనులు కల్పించేందుకు సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. దీంతో, వారికి కొత్తగా జాబ్ కార్డులను జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం తీరుబడిగా ఇప్పుడు జాబ్‌కార్డుల జారీకి బృందాలను ఏర్పాటు చేసింది. జాబ్‌కార్డులు జారీ చేసినా అవి కొంతమందికే పరిమితం కానున్నాయి. నిర్వాసిత కాలనీల్లో నాల్గో వంతు కుటుంబాలు కూడా నివాసం ఉండటం లేదు. మిగిలిన కుటుంబాలు వివిధ మండలాల్లో అద్దెకు ఇల్లు తీసుకుని వేర్వేరు చోట్ల ఉంటున్నాయి. దీంతో ప్రస్తుతం వారికి కొత్తగా జాబ్‌కార్డులు జారీ అయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

నిర్వాసితులకు చెల్లించని 'ఉపాధి' బకాయిలు

నిర్వాసితులను గ్రామాల నుంచి వెళ్లగొట్టినప్పటికీ గతంలో వారు చేసిన ఉపాధి పనులకు సబంధించి కూలి డబ్బులు చెల్లించలేదు. హిరమండలం, కొత్తూరు మండలాల నిర్వాసితులకు లక్షలాది రూపాయలు బకాయిలున్నట్టు సమాచారం. వీరికి బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఉంది. హిరమండలం మండలం తులగాం, చిన్నకొల్లివలస గ్రామాలకు చెందిన 119 మంది కూలీలకు రూ.57 వేల చెల్లించాల్సి ఉంది. కొత్తూరు మండలానికి సంబంధించి బకాయిలపై వివరాలు సేకరిస్తున్నారు.

బృందాలను ఏర్పాటు చేశాం

నిర్వాసితులు మండలం మారడంతో జాబ్‌కార్డులు పనిచేయవు. వారికి కొత్తగా జాబ్‌కార్డులు జారీ చేసేందుకు ఎపిఒ, డిప్యూటీ తహశీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌ను బృందంగా నియమించాం. నిర్వాసితులకు పనుల కల్పన, బకాయిల చెల్లింపు వంటి సమస్యలను వారు గుర్తిస్తారు. మా పరిధిలో ఉన్న సమస్యలను మేం పరిష్కరిస్తాం. సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం.

-హెచ్.కూర్మారావు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

భరత్ అనే నేను...


'భరత్ అనే నేను' చిత్రంలో మహేశ్ బాబు

మహేశ్ బాబు కథానాయకుడిగా చేస్తోన్న సినిమా' 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మహేశ్ ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. ఈ చిత్రం టీజర్‌ను, ఫస్ట్‌లుక్‌ను ఈ ఏడాది ప్రారంభం రోజునే ఇస్తారని అభిమానులంతా ఆశించారు. కానీ ఆరోజు టైటిల్ లేకుండా మహేశ్ సినిమా అని ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇప్పుడు గణతంత్ర దినోత్సావాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ను, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిందీ చిత్రబృందం. ఆడియో రూపంలో విడుదల చేసిన టీజర్‌లో 'భరత్ అనే నేను..శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను, శ్రద్ధతో, శుద్ధితో నిర్వహిస్తానని, భయంగా కానీ పక్షపాతంగా కానీ రాగద్వేషాలు కానీ లేకుండా రాజ్యాంగాన్ని , శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.' అని మహేశ్ గొంతుతో వినిపించింది. దీంతో పాటు విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో మహేశ్ సూట్‌కేసు పట్టుకుని నడుచుకుంటూ వస్తున్నట్టు కనిపించింది. కార్పొరేట్ కంపెనీలో పనిచేసే ఎగ్జిక్యూటివ్ తరహాలో మహేశ్ వేధారణ ఉంది. ముఖ్యపాత్రలో ఎలా ఉండబోతున్నారో? లేక ఇదే ఆ పాత్రకు సంబంధించిన లుక్కా అన్నది తెలియాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందు జరిగే ఫిక్షనల్ పొలిటికల్ డ్రామా అని దర్శకుడు కొరటాల శివ తెలిపారు. ప్రస్తుతం రామలక్ష్మణ్ నేతృత్వంలో చిత్రం పతాక సన్నివేశాలు చిత్రీకరణ జరుగుతుందని నిర్మాత దానయ్య అన్నారు. ఈ చిత్రంలో కైరా అద్వాని కథానాయిక. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

'జంబలకిడి పంబ'లో శ్రీనివాస్ రెడ్డి తనయ



హాస్యనటుడు శ్రీనివాస్ రెడ్డి, స్వాతిరెడ్డి దంపతులకు నెలరోజుల క్రితమే ఓ చిన్నారి పుట్టింది. ఆ ముద్దుల తనయ శ్రీనివాస్ రెడ్డి హీరోగా చేస్తున్న 'జంబలకిడి పంబ' చిత్రంలో కనిపించనుంది. ఈ విషయాన్ని శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందులో సిద్ధి ఇదనాని హీరోయిన్‌గా చేస్తున్నారు.

భ్రమమతి



కేంద్రమంత్రి దగ్గర ఇంతకాలం ఎందుకు పనిచేశావ్? ఏదైనా ఆశించావా? అన్న ప్రశ్న ఎదురైనప్పుడు.. ఆయనలోని నిజాయితీ. మంచితనం అంటుంది చంచల (అనుష్క). పాడుపబడిన బంగ్లాలో సి.బి.ఐ. అధికారిణి ఆశాశరత్ ఆమెను రహస్యంగా విచారిస్తున్న క్రమంలో 'ఎవడు పడితే వాడు వచ్చి పోవడానికి ఇదేమైనా పశులు దొడ్డా భాగమతి అడ్డా..' అంటూ రియాక్ట్ అవుతుంది. ఆ బంగ్లాలో ఉన్న భాగమతి ఆమెను పూనినట్లు చిందులేస్తుంది. ఓ మహిళా గౌవరం, నిజాయితీ ఆమె పనిచేసిన చోటును ప్రభావితం చేస్తాయనే అంశంతో ముడిపడిన కథ ఇది. ఈ చిత్ర దర్శకుడు గతంలో 'పిల్లజమిందార్' 'సుకుమారుడు' చిత్రాలకు దర్శకత్వం వహించాడు. అనుష్కను టైటిల్ రోల్‌గా ఎన్నుకుని ఆమె కోసం చాలాకాలం వేచిచూసి తీసిన సినిమా ఇది. యు.వి. క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మించారు. ఈ శుక్రవారమే విడుదలైంది.

కథ : ప్రజలకు మంచి జరగాలంటే అందుకోసం జరిగే ఎటువంటి మార్పుకైనా తాను ముందుంటాననీ, అవసరమైతే రాజకీయ సన్యాసం చేస్తాననే కేంద్రమంత్రి ఈశ్వర్ ప్రసాద్ (జయరామ్) అంటాడు. అప్పటికప్పుడు ఓ సాదాసీదా రైతు బిడ్డను తన రాజకీయవారసుడిగా పబ్లిక్‌లో ప్రకటిస్తాడు. ఇలాంటి వ్యక్తి సి.ఎం. పదవికోసమే చేస్తున్నాడనే భావించిన అధిష్టానం.. సిబిఐ సహకారం కోరి అతనిపై మచ్చ వేయాలని ఆజ్ఞాపిస్తుంది. అందుకు అధికారిణి వైష్ణవి నటరాజన్ (ఆశాశరత్) రంగంలోకి దింపుతుంది. అందుకు హత్యకేసులో శిక్ష అనుభవిస్తున్న చంచల (అనుష్క)ను టార్గెట్ చేస్తుంది. ఎందుకంటే ఈశ్వర్ ప్రసాద్ ప్రతి కదలికను తెలిసిన పర్సనల్ సెక్రటరీ చంచల. ఏసీపీ మురళీశర్మ సహకారంతో ఊరికి దూరంగా ఉన్న పాడుపడిన బంగ్లాలో రహస్యంగా విచారణ చేస్తుంది. పగలు తప్ప రాత్రిళ్ళు ఎవ్వరూ ఉండని ఆ చోట చంచలను ఒంటగిరిగా బంగ్లాలో పెట్టి తాళం వేస్తారు. బయట ఇద్దరు పోలీసులు కాపలా ఉంటారు. రాత్రిళ్ళు లోపల ఏవోవే వింతశబ్దాలు వస్తున్నాయనీ, చంచల భయంతో అరుస్తుందని చెప్పినా అధికారులు వినరు. అలాంటి సమయంలో చంచలను ఓ రాత్రి చంపాలను ఎసిపి బంగ్లాలోకి ప్రవేశిస్తాడు. అక్కడ అతను భయంకరమైన అనుభవాన్ని రుచిచూస్తాడు. తనెందుకు చంచలను చంపాలనుకున్నాడు? అనంతరం సిబిఐ అధికారిణి ఏం చేసింది? అనేది మిగిలిన కథ.

విశ్లేషణ :

ట్రైలర్ చూస్తే ఇదొక హార్రర్ థ్రిల్లర్ అనే అనుకుంటాం. ఆ విషయంలో అంచనాలు పెట్టుకుని వెళ్తాం. ముఖ్యంగా 'ఇది భాగమతి అడ్డా..' అంటూ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచిన డైలాగ్ అంచానాలు పెంచింది. ఈ సినిమా చూస్తున్నంతసేపూ ఇది అంచనాలకు తగ్గ సినిమానే అనిపిస్తుంది. భయపెడుతుంది.. ఉత్కంఠ రేకెత్తిస్తుంది.. కానీ రెండో సగంలో మాత్రం మనకు భిన్నమైన సినిమా చూపిస్తారు. అనుకున్నదానికి భిన్నంగా ఉంటుంది. చివరికొచ్చేసరికి సినిమాలోని పాత్రల్లాగే మనం కూడా ఫూల్స్ అయిపోయామే అన్న భావన ప్రేక్షకుడికి కలుగుతుంది. చివర్లో ఒక ట్విస్టు ఇచ్చి ప్రేక్షకుల్ని ఏమార్చడం కొత్తేమీ కాదు. కానీ ఆ ట్విస్టు ప్రేక్షకులను డిఫెన్స్‌లో పడేస్తుంది. సరిగ్గా ఇలాంటి మోసంతోనే 'పిజ్జా' వచ్చింది. 'భాగమతి' కొంచెం అలాంటి భావనే కలిగిస్తుంది. కాకపోతే కథాకథనాల విషయంలో దర్శకుడి ప్రయత్నం వల్ల, చక్కటి నిర్మాణ విలువలు, సాంకేతిక హంగులు ఆకట్టుకుంటాయి. అక్కడక్కడా ఒడుదొడుకులు ఉన్నా ఫర్వాలేదనిపిస్తుంది.

కథనంలో వచ్చే ట్విస్టు ఆసక్తికరమే కానీ హార్రర్ థ్రిల్లర్ అనుకున్న 'భాగమతి కాస్తా.. పొలిటికల్ థ్రిల్లర్ జానర్లోకి వెళ్లిపోతుంది. ఈ కథలో ఫ్లాష్‌బ్యాక్‌లతో కలిపి మూడునాలుగు ఉపకథలుంటాయి. అవేంటో తెలియడానికి దాదాపు రెండు గంటలు ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ క్రమంలో కొంత అసహనం కూడా కలుగుతుంది. ప్రేక్షకుల్ని చివరిదాకా సస్పెన్స్‌లోనే ఉంచాలన్న ఉద్దేశం దర్శకుడు ఆ ఉపకథలను వేటినీ ఒకేసారి చెప్పేయడు. గతాన్ని.. వర్తమానాన్ని మార్చి మార్చి చూపిస్తూ కొంచెం కొంచెంగా విషయం వెల్లడయ్యేలా స్క్రీన్ ప్లే రాసుకున్నాడు. సినిమా మొదలైన 20 నిమిషాలకే వ్యవహారం భాగమతి బంగ్లాకు మళుతుంది. అక్కడ ప్రతి హార్రర్ సినిమాలో మాదిరే.. విచిత్రమైన శబ్దాలు.. ఉలిక్కి పడేలా చేసే దృశ్యాలు...అనుమానాలతో సన్నివేశాలు నడుస్తాయి. జయరాం పోషించిన మంత్రి పాత్ర.. ఆయన నటన భిన్నంగా ఉండి ఆసక్తి రేకెత్తిస్తాయి. 'భాగమతి'లోని మలుపులు కొత్తగా అనిపిస్తాయి. ఆ మలుపులే ఈ సినిమాకు బలం, బలహీనత. భాగమతి అనే పాత్రకు ఒక ఫ్లాష్ బ్యాక్ అదీ పెట్టి ప్రేక్షకుడి అంచనాకు తగ్గట్లుగా నడిపించి ఉంటే సినిమా రొటీన్ అయ్యేదేమో. కానీ అంచనాలకు భిన్నంగా మరో రకంగా ఈ కథను నడిపించారు. అదే ఇందులో కొత్తదనం. కానీ ఆ మలుపు తర్వాత నడిచే వ్యవహారం మాత్రం రొటీన్ అనిపిస్తుంది.

'అరుంధతి'.. 'రుద్రమదేవి' తరహాలోనే 'భాగమతి' కూడా అనుష్కకు ఒక ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఇలాంటి పాత్రలకు అనుష్కే చేయగలదనిపించింది. తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంటుంది. రౌద్రం చూపించే సన్నివేశంలో మెప్పించింది. కథలో కీలకమైన పాత్రలో మలయాళ నటుడు జయరాం తన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఉన్ని ముకుందన్ పాత్ర చిన్నదే అయినా చక్కటి నటనతో తన పాత్రను గుర్తుంచుకునేలా చేశాడు. ఆశా శరత్ నటన కూడా బాగుంది. మురళీ శర్మ పాత్రకు తగ్గట్లు నటించాడు. విద్యుల్లేఖ, ప్రభాస్ శీను, ధన్ రాజ్ కొంత మేర నవ్వించారు.

> 'భాగమతి' సినిమా ఒక మహిళా ఐఎస్ అధికారిణి చతురత్వానికి, వీరత్వానికి గొప్ప ప్రతీక అనీ, ఇది కల్పన చిత్రమేనని ముందుగానే చెప్పాడు దర్శకుడు అశోక్. చివరికి తనను తాను నిజాయితీగా నిరూపించుకునే క్రమంలో చూసిందంతా కల్పనేననీ, ఇదంతా వాస్తవం కాదు అంటూ ముగింపు ఇవ్వడం నిజంగా సాహసమే. భయపెట్టడానికి దెయ్యం ఉందనేలా భ్రమింపజేయవచ్చు. కానీ అదంతా కట్టు కథంటూ ప్రేక్షకుల్ని తెలివిగా మోసం చేయడం విశేషం.

సాంకేతిక విలువలు కథకు జీవంపోశాయి. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌కు తగ్గట్టుగా సినిమా రిచ్‌గా తెరకెక్కింది. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ భాగమతి బంగ్లాను తీర్చిదిద్దిన తీరు అమోఘం. సగానికి పైగా కథ ఈ బంగ్లాలోనే నడిచినా.. మొనాటనీ రాకుండా చేయడంలో ఆర్ట్ డైరెక్టర్.. సినిమాటోగ్రాఫర్ పనితనం కనిపిస్తుంది. ఛాయాగ్రాహకుడు మది హార్రర్ సినిమాల్లో ఇంతకుముందు చూడని లైటింగ్స్.. థీమ్స్‌తో సినిమాకు డిఫరెంట్ లుక్ తీసుకొచ్చాడు. తమన్ నేపథ్య సంగీతం సినిమాకు పెద్ద ప్లస్. దర్శకుడు జి.అశోక్ ఇప్పటిదాకా తీసిన మూడు సినిమాలతో పోలిస్తే పూర్తి భిన్నంగా చేశాడు. చాలా లేయర్స్ ఉన్న కథను ఎంచుకుని భిన్నమైన స్క్రీన్ ప్లేతో చెప్పే ప్రయత్నం చేశాడు. ఐతే కథనంలో ఉండాల్సింతన బిగి లేదు. నిజంగా భాగమతి ఉందన్నట్లు ముగింపిస్తే సినిమా మరో ఎత్తుకు వెళ్లేది.

– పెండ్యాల మురళి

నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నా

నా ఫంక్షన్‌కు ఓ పెద్ద స్టార్‌ను పిలిస్తే రాలేదు : చిరంజీవి


శంకర ప్రసాద్, నాగశౌర్య, చిరంజీవి, మహతి స్వర సాగర్, వెంకీ కుడుముల, ఉషా ముల్పూరి, రష్మిక మండన్నా తదితరులు

"నా కెరీర్ బిగినింగ్ స్టేజ్‌లో నా సినిమా హండ్రెడ్ డేస్ ఫంక్షన్‌కి నేను అభిమానించే ఓ పెద్ద స్టార్ వస్తే బాగుంటుంది. ఆ ఉత్సాహం, ప్రోత్సాహం వేరు అని అడిగితే.. ఆయన బిజీగా రాలేని పరిస్థితి ఉండి రాలేకపోతున్నాను.. ఏమీ అనుకోవద్దు అని చెప్పడం జరిగింది. కానీ ఆయన లేకుండా ఆ ఫంక్షన్ తూతూ మంత్రంగా చేసుకున్నాం. ఆరోజు నాకు చాలా అసంతృప్తిగా అనిపించింది. ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడు నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నాను" అని చిరంజీవి అన్నారు .

నాగశౌర్య, రష్మిక మండన్నా హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'ఛలో' ప్రీ రిలీజ్ వేడుకకు చిరంజీవి హాజరయ్యారు. ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఈ చిత్రం తెరకెక్కింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. ఉషా ముల్పూరి నిర్మాత. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు హాజరైన చిరంజీవి మాట్లాడుతూ "ఈ ఫంక్షన్‌కి నేను రావడం ఏంటి అని అందరికీ అన్పించొచ్చు. ఈ ఫంక్షన్‌కు వచ్చి నన్ను ఆశీర్వదించాలని కోరితే ఒక్క నిమిషం ఆలోచించకుండా నాగశౌర్యకి వస్తాను అని చెప్పాను. నా కెరీర్ బిగినింగ్ స్టేజ్‌లో జరిగిన సంఘటన గుర్తొచ్చి నన్ను రమ్మని కోరుతున్నాడు అంటే ఆ ఉత్సాహం, ఆ ప్రోత్సాహం వేరు కాబట్టి నాగశౌర్యకి ప్రోత్సాహం ఇవ్వాలి. అతన్ని ఉత్సాహపర్చాలి. ఒక ఆర్టిస్ట్‌గా ఎంత మోటివేట్ చేస్తుంది అనేది నాకు తెల్సు. నేను చవి చూశాను. అలాంటి ఫీలింగ్ నాగశౌర్యకి ఇవ్వాలి అని వెంటనే వస్తానని చెప్పటంతో చాలా ఆనందించాడు. నాగశౌర్య సినిమాలు పెద్ద స్క్రీన్ మీద ఏదీ చూడలేదు. మా నిహారికతో చేసిన సినిమా టీవిలో చూశాను. చాలా హ్యాండ్‌సమ్‌గా ఉన్నాడు. ఒలింపిక్ గేమ్స్‌కి వెళ్లే ఆటగాళ్ళలో వన్‌వీక్ ముందు రక్తం డొనేట్ చేస్తారు. ఆ తర్వాత కొత్త రక్త కణాలతో ఫ్రెష్‌నెస్ వస్తుంది. అప్పుడు స్పోర్ట్స్ పర్సన్స్‌కి వచ్చే నూతన ఉత్సాహం వేరు. ఒలింపిక్స్‌లో కొత్త ఉత్సాహంతో ప్లేయర్స్ ఎలా పరుగెడతారో అదేరకంగా ఈ పరిశ్రమకి నాగశౌర్యలాంటి కొత్త నటులు కావాలి. రెండు మూడు సంవత్సరాలుగా చూస్తే పెద్ద హీరోల సినిమాలు ఎంత హిట్ అయ్యాయో యంగ్ హీరోస్ చిత్రాలు కూడా అంతకంటే హిట్ అయ్యాయి. ఇది చాలా హెల్దీ వాతావరణం. 'ఉయ్యాలా జంపాలా' 'పెళ్ళి చూపులు', 'అర్జున్ రెడ్డి' 'ఊహలు గుసగుసలాడే', 'శతమానం భవతి' 'ఫిదా', అలాగే ఈమధ్య రిలీజ్ అయిన 'హలో' ఇవన్నీ ప్రేక్షకుల ఆదరణ పొందాయి. కొత్తవారిని అక్కున చేర్చుకుని ఇండస్ట్రీలో మంచి స్థానాన్ని ఇచ్చే గొప్ప మనసున్న ప్రేక్షకులు తెలుగు ప్రేక్షకులు. వెంకీ కుడుముల ఒక డైరెక్టర్‌లా కన్పించలేదు. అభిమానుల్లో ఒకడిగా అన్పించాడు. తన ఎమోషన్ చూస్తుంటే నా అభిమాని ఒక డైరెక్టర్ అయ్యాడు' అని తెలిపారు.

చేతిలోన చెయ్యేసి చెప్పుబావా


అంజనా, అరుణ్ రాహుల్ తదితరులు

అరుణ్ రాహుల్, అంజనా జంటగా రూపొందనున్న 'చేతిలోన చెయ్యేసి చెప్పుబావా' చిత్రం శుక్రవారం లాంఛనం ప్రారంభమైంది. సుమన్, భానుచందర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కట్ల రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వం. కె జె రాజేష్ నిర్మిత. అన్నపూర్ణ స్టూడియోలో హీరో హీరోయిన్స్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సాయి వెంకట్ క్లాప్ కొట్టారు. నటులు సుమన్, భానుచందర్ దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందచేశారు.

దర్శకుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ప్రేమను దక్కించుకోలేని ఓ ప్రేమ జంట మరు జన్మలో తమ ప్రేమను ఎలా దక్కించుకున్నారు. వారి పగను ఎలా తీసుకున్నారన్న అంశాలతో తెరకెక్కనుంది. ఫిబ్రవరి చివరలో షూటింగ్ మొదలు పెడతాం. సమ్మర్ విడుదల చేస్తాం' అని అన్నారు.

పెళ్లి ఆలోచన ఇప్పట్లో లేదు


దీపికా పదుకొనే

దీపికా పదుకొనే ఈ మధ్య ఎక్కువగా వినిపించిన పేరు. ఎందుకంటే ఆమె చేసిన 'పద్మావత్' చిత్రాన్ని రాజ్‌పుత్ కర్ణి సేన వివాదం చేయడంతో దీపికా నిత్యం వార్తల్లో ఉండేది. దీంతో పాటు కొత్త సంవత్సర సంబరాలు రణవీర్ సింగ్, దీపికా కలిసి చేసుకున్నారని దానికి శ్రీలంక వేదికైందని పెద్ద ఎత్తున రూమర్స్ వినిపించాయి. ఈ ప్రేమ జంట ఇక పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారని దాని కోసం ప్రత్యేకంగా గోవాలో పెద్ద బంగ్లా, కొంత స్థలం కొనుగోలు చేశారని కూడా ప్రచారం జరిగింది. ఇటీవల నేహా దుపియా వక్తగా వ్యవహరిస్తున్న 'బీఎఫ్‌ఎఫ్ యస్ విత్ ఓగ్యూ' కార్యక్రమంలో దీపికా మాట్లాడింది. ఈ రూమర్స్‌పై నేహా ప్రశ్నించింది. 'రణవీర్ సింగ్‌కు, మీకు రహస్యంగా నిశ్చితార్థం కూడా జరిగిపోయిందట. చేతికున్న ఆ రింగ్ దానికి సంబంధించినదేనట అని అందరూ అనుకుంటున్నారు' అని దీపికాను నేహా ప్రశ్నించింది. వీటన్నింటినీ దీపికా ఖండించింది. తనకు నిశ్చితార్థం జరగలేదని స్పష్టతనిచ్చింది. తన చేతికున్న రింగ్‌ను నేహా చూపమన్నప్పుడు దీపికాతో అదే కార్యక్రమంలో ఉన్న తన సోదరి అనిషా పదుకొనే స్పందిస్తూ... 'ఐదేళ్ల తన కెరీర్‌ను విజయవంతంగా సాగినందుకు గత ఏడాది తొడుగుకున్న రింగ్ అది' అని వివరణ ఇచ్చింది. అంతేగాదు...గత ఏడాది మీడియా తనను అడిగినప్పుడు "నిశ్చితార్థం అన్న ప్రణాళికే లేదు. నేను గర్భవతిని కాదు. నాకు ఎటువంటి పిల్లలు లేరు. నాకు పెళ్లి కాలేదు. ఇప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచన కూడా నాకు లేదు" అని దీపికా పదుకొనే పునర్ఘాటించింది.

రియలైజ్ కాలేకపోయాను

– సీరత్ కపూర్



'టచ్ చేసి చూడు' చిత్రంలో తనది సెకండ్ హీరోయిన్ పాత్ర కాదని ఓ ముఖ్యపాత్ర పోషించానని చెప్పింది సీరత్ కపూర్. పాత్రకు తప్ప సెకండ్, ఫస్ట్ అన్నవి పట్టించుకోనని పేర్కొంది. రవితేజ హీరోగా చేసిన ఈ సినిమా ఫిబ్రవరి రెండో తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా శుక్రవారం సీరత్ మాట్లాడింది. "ఈ సినిమాలో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. హీరోనే డామినేట్ చేస్తుంటాను. హీరోకి ఏం చేయాలో చెప్తుంటాను. అతన్ని టీచ్ చేస్తారు. సహజంగా తనే సినిమాల్లో హీరోయిన్ల టీజ్ చేస్తాడు. ఇందులో రివర్స్ అన్నమాట. టీజ్ చేసే సీన్స్‌లో.. హీరో అని బెరుకు వద్దని రవితేజ సలహా ఇచ్చారు. ఆయన చాలా సింపుల్‌గా ఉంటారు. సెట్స్‌లో సరదాగా ఉన్నారు. ఇండస్ట్రీలో ఇన్నేళ్లు ఉన్న తర్వాత అలా ఉండటం మామూలు విషయం కాదు. ఎప్పుడూ ఎనర్జీగా, లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. 'రన్ రాజా రన్' సక్సెస్ తర్వాత నావి కొన్ని సినిమాలు సరిగా ఆడలేదు. దానికి నేను పెద్దగా బాధపడను. ఈ అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. 'రాజుగారి గది–2' నుండి మంచి సినిమాలు చేస్తున్నాను. ఈ సినిమాను నేను కూడా ఇంకా పూర్తి సినిమా చూడలేదు. అందుకే ఏ తరహా సినిమా అన్నది చెప్పలేను. నా పాత్ర సినిమా మొత్తం ఉండదు. ముఖ్యమైన సెకండాఫ్లో వస్తాను. నాకు, రాశీఖన్నాకు కాంబినేషన్ సీన్స్ కూడా ఉండవు. తర్వలోరానా దగ్గుబాటి సురేష్ ప్రొడక్షన్లో ఒక సినిమా చేస్తున్నాను. రవికాంత్ పేరెపు డైరెక్టర్. 'గుంటూరు టాకీస్' సిద్ధు అందులో హీరో. 'రన్ రాజా రన్' చేసినప్పుడు అంత మంచి సక్సెస్ సినిమాను చేశానని నేను రియలైజ్ కాలేకపోయాను. ఆ తరవాత కొన్ని సినిమాలు కూడా అంతే. అవి నా కెరీర్‌కు ఎంతలా ఉపయోగపడతాయనేది చూడలేదు. కానీ 'ఒక్క క్షణం' లాగానే ఈ చిత్రం నాకు బాగా సహాయపడుతుందని చెప్పగలను.



తన్మయత్వాన్ని పంచే తాడిపత్రి జలపాతాలు!

అనంతపురం పేరు చెప్పగానే గుర్తుకు వచ్చేది కరువు. అలాంటి రాళ్లసీమలో గ్రానైట్ శిలల మాటున పచ్చని కొండకోనలు, జలపాతాలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయంటే.. వినడానికి కాస్త ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. అంతేకాదు, ప్రాచీన క్షేత్రాల ఆనవాళ్లూ, శిల్పకళా అద్భుతాలూ ఈ గడ్డపై కనువిందు చేస్తాయి. తాడిపత్రి ప్రకృతి ప్రయాణంలో ఆహ్లాదపరచిన ఒక్కరోజు విశేషాలు మీకోసం ఈ వారం 'జర్నీ'లో..

మొన్న సంక్రాంతి సెలవుల్లో పిల్లలు, కుటుంబసభ్యులతో కలిసి సరదాగా విహారయాత్రకు వెళ్లాలని ప్లాన్ చేశాం. తాడిపత్రి చుట్టుపక్కల ప్రాంతాలను ఒక్కరోజులో సందర్శించవచ్చని మా మిత్రుడు సలహా ఇచ్చాడు. దాంతో సంక్రాంతి ముందురోజు మా అక్కాబావ, పిల్లలను తీసుకువెళ్లాలని ఓ వెహికల్ బుక్ చేసుకుని బయలుదేరాం. ఆదివారం ఉదయాన్నే అనంతపురం నుంచి మా వాహనంలో ప్రయాణాన్ని మొదలుపెట్టాం. తొమ్మిది గంటలయ్యే సరికి తాడిపత్రి చేరుకున్నాం. అనంతపురం జిల్లా కేంద్రం నుంచి తాడిపత్రికి ప్రధాన రహదారి గుండా 56 కిలోమీటర్లు ఉంటుంది. తాడిపత్రి ప్రముఖ వాణిజ్య కేంద్రం కావటంతో లెక్కలేనన్ని హోటళ్లు దర్శనమిచ్చాయి. ఓ మంచి హోటల్‌లో టిఫిన్ చేశాం. అక్కడి నుంచి యాడికి, గుత్తి రహదారి మార్గంలో సందర్శన ప్రాంతాల వైపు ప్రయాణం కొనసాగించాం. ఆదివారం కావడంతో ప్రకృతి ఒడిలో మారుమూల ఉన్న చిన్ని జలపాతాలను చూసేందుకు చాలా కుటుంబాలు ఇటువైపుగా విహారయాత్రకు వెళుతున్నట్లు కనిపించాయి. ఈ ప్రాంతాలకు నేరుగా ఆర్టీసి బస్సు సౌకర్యమూ ఉంది.

రాయలసీమ రుచులు


ఈ మార్గంలో కొందరు భోజనాలు చేస్తుంటారు. అలాంటి వారికి అల్ట్రాటెక్ ప్రాంతంలోని చిరు హోటళ్లలో మంచి భోజనం అందుబాటు ధరల్లోనే లభిస్తుంది. ఇక్కడ రాగి ముద్ద, బోటి, చికెన్, మటన్ కర్రీలను ప్రత్యేకంగా తయారుచేస్తుంటారు. రాయలసీమ రుచులను ఆస్వాదించాలనుకునే భోజనప్రియులకు ఈ మార్గం ఎంతగానో ఆకర్షిస్తుంది. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీని ఆనుకుని ఉన్న గుండం వంక చిరు జలపాతాన్ని ముందుగా చేరుకున్నాం. హొయలొలికే జలధార సవ్వడులు మా మనసులను కేరింతలు కొట్టేలా చేశాయి. పచ్చని ప్రకృతి అందాలు మా విహారయాత్రకు ఆహ్వానం పలికినట్లు అనిపించింది. ఈత వచ్చినవారు ఈ జలపాతం కింద ఉన్న కుంటలో ఈత కొట్టవచ్చు. అయితే, అది చాలా లోతుగా ఉంటుందని అక్కడివారు చెప్పటంతో పిల్లలను దించే సాహసం చేయలేదు. అలా అక్కడే ఓ గంటపాటు సంతోషంగా గడిపాం. ఆ తరువాత అల్ట్రాటెక్ సర్కిల్‌లోని ఓ హోటల్లో పిల్లలతో కలిసి ముద్దపప్పు తిన్నాం. వేడివేడి ముద్దపప్పులో నెయ్యి కలిపి తింటుంటే.. ఆ రుచే వేరు!

మతసామరస్యానికి ప్రతీక

తర్వాత అక్కడి నుంచి గుత్తి, యాడికి మార్గంలో పెన్నా సిమెంట్‌కు వెళ్లే మార్గంలో తాడిపత్రి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఆలూరు రంగనాయకుని కోనలోని జలపాతాలకు బయలుదేరాం. అక్కడి జలపాతాలు ఈ సీజన్‌లో పర్యాటకులను ఎంతగానో కనువిందు చేస్తాయి. అప్పటికే మధ్యాహ్నం కావడంతో ఎండ తీవ్రతా పెరిగింది. కొండపై పెద్దఎత్తున ప్రభుత్వం వారి సోలార్ ప్లాంట్ ఉంది. ఈ మార్గం గుండా నేరుగా వెళితే కొండపై అతిపెద్ద హాజీవలి దర్గా కనిపించింది. అక్కడ కాసేపు సేదతీరాం. కొండ ప్రాంతం కావడంతో ఎంతో విశాలంగా, ప్రశాంతగా అనిపించింది. అక్కడి దర్గా ఎంతో మహిమ కలదని, ఇక్కడికి వచ్చే వారి కోర్కెలు తీరుతాయని అక్కడి వారు విశ్వసిస్తారు. హిందువులు, ముస్లింలు తారతమ్యం లేకుండా ఇక్కడికి వస్తుంటారని స్థానికులు చెప్పారు. దర్గా దగ్గర గుర్రాలు ఉండడంతో మా పిల్లల ఆనందానికి అవధుల్లేవు. వాటిపై ఎక్కి, కేరింతలు కొట్టారు. ఫొటోలకు ఫోజులిచ్చారు. అక్కడి నుంచి దిగువన రంగనాయకులు స్వామి పురాతన ఆలయం ఉంది. ఈ దేవాలయం దక్షిణభారతదేశంలో ప్రసిద్ధి చెందిన క్షేత్రాలలో ఒక్కటి.







జలపాతం అందాలు

చుట్టూ కొండల మధ్య ఈ కోన ఉండడం, అన్ని ఋతువులలో నీరు ప్రవహించడం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. కార్తీక మాసంలో సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. పెద్ద పెద్ద వృక్షాలు ఉండటంతో కోతులు గుంపులుగా సంచరించడం గమనించాం. కొండపై ఉన్న బండరాళ్లపై నుంచి జాలువారుతున్న అందాల జలపాతానికి చేరుకున్నాం. అక్కడ ప్రవాహం ఎక్కువగా ఉంది. దాంతో అక్కడికి కింద ఉన్న కొలనులో అందరం కలిసి సంతోషంగా జలకాలాటలాడాం. రెండు గంటల పాటు కోనలో సంతోషంగా గడిపాం. ఈ ప్రాంతానికి ఐదు షిప్టులలో ఆర్టీసి బస్సులు తిరుగుతాయి. సాయంత్రం కావటంతో తిరుగు ప్రయాణం ప్రారంభించి, తాడిపత్రి చేరుకున్నాం. అక్కా వాళ్ల ఇల్లు అక్కడే ఉండడంతో రాత్రికి అక్కడే బస చేసి, మరుసటి రోజు తిరిగి తాడిపత్రిలో పురాతన ఆలయాలుగా ప్రసిద్ధి గాంచిన చింతలరాయలు ఆలయం, శివాలయం సందర్శించాం. ఇతర ప్రాంతాల నుండి వచ్చేవారికి తాడిపత్రిలో బస చేసేందుకు చాలా పెయిడ్ వసతి గృహాలు అందుబాటులో ఉంటాయి.

మరిన్ని సందర్శనా ప్రదేశాలు

ఇదే మార్గంలో తుమ్మలపెంట గ్రామం ఉంది. ఇక్కడి కాశినాయన సత్రంలో ప్రతి రోజూ నిత్య అన్నదానం చేస్తారు. ఇదే మార్గంలో తాడిపత్రి బనగానపల్లి రూటులో బెలూమ్‌కేవ్స్‌నూ సందర్శించవచ్చు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కేవ్స్ ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. నిరంతరం ఆర్టీసి బస్సులు ఈ రూట్‌లో తిరుగుతుంటాయి. బనగానపల్లి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో యాగంటి పుణ్యక్షేత్రం ఉంది. యాడికి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉప్పలపాడు కోన ఉంది. వర్షాకాలంలో ఈ ప్రాంతంలో వీక్షకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి బస్సు సౌకర్యం ఉంది.

- వి. రవిచంద్ర ,
అనంతపురం.

'జర్నీ'కి ఆహ్వానం

మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.




మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

మనదేశం నుంచి పాకిస్తాన్ చూస్తారా?!

మనదేశంలో చరిత్ర కలిగిన పురాతన కోటలు చాలానే ఉన్నాయి. అలాంటి కోటలు వాటి అందాలతో ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచాయి. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న కోట పైనుంచి చూస్తే పాకిస్తాన్ అంతా కనపడుతుంది. పర్వతాల మధ్య ఉన్న ఈ కోటను చూడ్డానికి ప్రపంచంలోని నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. అదే జోధాపూర్‌లోని మెహరానాఘడ్ కోట. జోధాపూర్‌లో ఉన్న ఈ కోట ఢిల్లీలోని కుతుబ్‌మీనార్ కంటే ఎత్తులో ఉంది. ఈ పురాతన చరిత్ర కలిగిన కోట గురించి మరిన్ని విషయలు తెలుసుకుందాం.





జోధాపూర్‌లోని మెహరాన్‌గఢ్ కోట 120 మీటర్ల ఎత్తులో నిర్మించబడింది. అందుకే, దీనిని కుతుబ్‌మీనార్ కంటే అతి ఎత్తయిన కోట అన్నారు. 1000 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కోట పైనుంచి చూస్తే పాకిస్తాన్ అంతా కనిపిస్తుంది. ఈ కోట లోపలికి వెళ్లిన వారిని వెతకడం చాలా కష్టం. అదే ఈ కోటలోని ప్రత్యేకత. ఈ కోటలో గోడలు పదికిలోమీటర్ల దూరంలో ఉంటాయి. కోట ఎత్తు 20 నుంచి 120 అడుగులు ఉంటుంది. ఈ కోటలో స్పైరల్ రోడ్లకు అనుసంధానంగా నాలుగు ద్వారాలు ఉన్నాయి. దారి మధ్యలో ఏడు అరక్షిత కోటలు ఉన్నాయి. కోటలోపల గ్రాండ్ మహల్, అద్భుతంగా చెక్కబడిన తలుపులు, జలీదార్ కిటికీలను తిలకించవచ్చు. ఈ కోట లోపల అందమైన మోతీమహల్, ఫూల్‌మహల్, షీషామహల్ ఉన్నాయి. ఈ కోటకు చేరువలోనే మహారాజ మాన్‌సిన్హ్ భార్య గుర్తుగా సతీమందిర్ కూడా ఉంది.

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



నీడను కనుక్కోండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని బొమ్మలున్నాయి. వాటిలో ఏ నీడ ఎవరిదో కనిపెట్టండి!

పొడుపు కథ

నిను వీడను నేను,
నీ వెంటే ఉంటాను,
ప్రతిబింబాన్నిస్తాను,
భయాన్ని కలిగిస్తాను..?

ఇదౖ : అడిుజ

జోక్ :

టింకు మైసూర్ ప్యాలెస్ చూడటానికి వెళ్లాడు.
గైడ్ : బాబూ, దానిమీద కూర్చోకు. అది టిప్పుసుల్తాన్ కుర్చీ
టింకు : ఆయన వచ్చినప్పుడు లేస్తాలే అంకుల్!

హిల్లరీ గురించి తెలుసా?

పిల్లలూ..! ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని మొదటగా అధిరోహించిన వారు ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నార్కే. ఈరోజు ఎడ్మండ్ హిల్లరీ గురించి తెలుసుకుందామా..?



సర్ ఎడ్మండ్ హిల్లరీ, న్యూజిలాండుకు చెందిన పర్వతారోహకుడు. 33 యేళ్ళ వయసులో 1953, మే 29న షేరా పర్వతారోహకుడు టెన్సింగ్ నార్కేతోపాటు ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారు. ఎడ్మండ్ హిల్లరీ 1919 జులై 20న న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జన్మించారు. 1920లో వారి కుటుంబం ఆక్లాండ్‌కు దక్షిణంగా ఉన్న త్వాకౌ పట్టణానికి నివాసం మారింది. హిల్లరీ విద్యాభ్యాసం త్వాకౌ ప్రాథమిక పాఠశాలలోను, ఆక్లాండ్ గ్రామర్ పాఠశాలలోనూ కొనసాగింది. 16 సంవత్సరాల వయస్సులోనే హిల్లరీ పర్వతారోహణపై మక్కువ చూపారు. 1939లో దక్షిణ ఆల్ప్స్ పర్వతాలలో ఉన్న ఆలివర్ పర్వత శిఖరాన్ని అధిరోహించడం అతని జీవితంలో తొలి ప్రధాన సాహసకృత్యం. ఎవరెస్టు అధిరోహణే కాకుండా హిమాలయ పర్వతాలలో ఉన్న ముఖ్యమైన మరో 10 శిఖరాలనూ హిల్లరీ అధిరోహించారు. 8848 మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగల హిమాలయ పర్వతాలలోని ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి, తమ దేశ గౌరవాన్ని నిలబెట్టినందుకు న్యూజిలాండ్ ప్రభుత్వం ఐదు డాలర్ల కరెన్సీ నోటుపై హిల్లరీ బొమ్మను ముద్రించి, అతని ప్రతిభను గౌరవించింది. 2008 జనవరి 11న హిల్లరీ ఆక్లాండ్‌లో మరణించారు. అప్పుడు ఈయన వయస్సు 88 సంవత్సరాలు. న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్న హిల్లరీకి గుండెపోటు రావడంతో ఆక్లాండ్ ఆసుపత్రిలో మరణించారు. ★





నిజమైన తెలివి

అనగనగా నైనవరం అనే గ్రామంలో రాజారావు అనే వ్యాపారి ఉన్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు. రాజారావు ముసలివాడవడంతో కొడుకులకు వ్యాపార బాధ్యత అప్పగించాలని అనుకున్నాడు. అందుకుగాను కొడుకులిద్దరినీ దగ్గరకు పిలిచి, కొంత డబ్బు ఇచ్చాడు. ఆ డబ్బుతో వస్తువు తెచ్చి, ఇంటిని నింపాలి అని చెప్పాడు. ఎవరైతే అలా చేస్తారో వారికి వ్యాపార బాధ్యతలను అప్పగిస్తానని చెప్పాడు. పెద్దకొడుకు వెంటనే బజారుకెళ్లి ఆ డబ్బుతో గడ్డి అయితే ఎక్కువ వస్తుందని గడ్డిని కొని ఇంటికి తీసుకొచ్చాడు. కానీ గడ్డితో ఇల్లు నిండలేదు. చిన్న కొడుకు ఎంతో తెలివిగా ఆలోచించాడు. ఒక్క రూపాయితో కొవ్వొత్తిని కొని, దానిని ఇంట్లో వెలిగించాడు. ఆ వెలుగుతో ఇల్లంతా నిండిపోయింది. వ్యాపారి చిన్నకొడుకు తెలివితేటలను ఎంతగానో మెచ్చుకుని, వ్యాపార బాధ్యతలను అప్పగించాడు. చిన్న కొడుకుకు సహాయకుడిగా పెద్దకొడుకును నియమించాడు.



- మరీదు నాగచక్రి
6వ తరగతి
పి.నైనవరం గ్రామం,
విజయవాడ రూరల్

నిలిచిన ఆట





జోహాన్స్‌బర్గ్ మైదానంలో క్రీడాకారులకు కష్టాలు తప్పేట్లు లేదు. తొలిరోజునుండే బంతి బ్యాట్‌మెన్‌ల పాలిట ప్రమాదకరంగా మారింది. రెండు రోజులు బౌలర్లకు కొంతవరకు సహకరించిన పిచ్ మూడో రోజునుండి ప్రమాదకరంగా మారింది. దీంతో శుక్రవారంనాడు టీమిండియా బ్యాట్స్‌మెన్ రహానే, మురళీ విజయ్‌లతో పాటు... దక్షిణాఫ్రికా ఓపెనర్ ఎల్గర్ హాషీం అమ్లాలకు గాయాలయ్యాయి. బుమ్రా వేసిన బంతి ఎల్గర్ తలకు తగిలి హెల్మెట్ దెబ్బతినడంతో మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. రెండో ఇన్నింగ్స్‌లో రబడా బౌలింగ్‌లో మురళీ విజయ్‌కు చూపుడు వేలికి బంతి తగిలి గాయమైంది. అలాగే రహానే కూడా మోచేతిపై బంతి తగిలి ఇబ్బందులకు గురయ్యాడు. జోహాన్స్‌బర్గ్ పిచ్‌పై భారత ఆటగాళ్ళు ఇప్పటికే ఫిర్యాదు చేసి ఉన్నారు.

జోహాన్స్‌బర్గ్ : భారత్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న మూడో టెస్ట్ మూడోరోజు ఆటను గంటముందే నిలిచిపోయింది. పిచ్ ప్రమాదకరంగా మారడంతో నిలిపివేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. బుమ్రా వేసిన 8.3వ ఓవర్‌లో దక్షిణాఫ్రికా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ ఎల్గర్ హెల్మెట్‌కు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో అంపైర్లు, రిఫరీలు మూడురోజు ఆటను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 49 పరుగులతో శుక్రవారం ఉదయం బ్యాటింగ్ ఆరంభించిన టీమిండియా 247 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అంతకు ముందు దక్షిణాఫ్రికా ఆధిక్యం 7 పరుగులను మినహాయిస్తే సఫారీల లక్ష్యం 240. మూడో టెస్ట్‌లో చోటు సంపాదించిన అజింకా రహానే (48) పరుగులు అత్యధికంగా చేశాడు. కోహ్లీ 41, భువనేశ్వర్‌కుమార్ 33, షమి 27 పరుగులు చేశారు. టీమిండియా టీ విరామ సమయానికి 6 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. క్రీజ్‌లో రహానే (46) భువనేశ్వర్ కుమార్ (33) ఉన్నారు. దీంతో దక్షిణాఫ్రికాపై భారత్‌కు 192 పరుగుల ఆధిక్యం లభించినట్లైంది. టీ విరామం అనంతరం 247 పరుగుల వద్ద భారత ఇన్నింగ్స్ ముగించింది. సఫారీ బౌలర్లు, రబాడ, మోర్కెల్, ఫిలాండర్‌లకు తలా మూడు వికెట్లు లభించాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా జట్టు స్కోర్ 5 పరుగులవద్ద మార్క్రమ్ (4)ను మహ్మద్ షమి బౌలింగ్‌లో పార్థీవ్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. అనంతరం పిచ్ ప్రమాదకరంగా మారడంతో మూడోరోజు ఆటను అంపైర్లు నిలిపివేశారు. ఆతిథ్య జట్టుకు 240 పరుగుల లక్ష్య ఛేదనేమీ సులభం కాదు! రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సఫారీ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 17 పరుగులు చేసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్ 187 ఆలౌట్
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 194 ఆలౌట్
భారత్ రెండో ఇన్నింగ్స్ 247 ఆలౌట్
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 17/1

కోహ్లీ రికార్డ్

టెస్టుమ్యాచుల్లో మహేంద్రసింగ్ ధోనీ పేరిట ఉన్న రికార్డును విరాట్ కోహ్లీ అధిగమించాడు. టెస్టుల్లో సారథిగా అత్యధిక పరుగులు చేసిన ధోనీ రికార్డును కోహ్లీ అధిగమించాడు. 60 టెస్టుల్లో 3,454 పరుగులు చేసిన రికార్డు ధోనీ పేరుపై ఉండగా... ఆ రికార్డును కోహ్లీ బద్దలుకొట్టాడు. కేవలం 35 టెస్టుల్లోనే ఆ రికార్డును అధిగమించాడు.


విరాట్ కోహ్లీ (41)

సెమీస్‌కు యువభారత్

బంగ్లాదేశ్‌పై 131 పరుగుల తేడాతో విజయం

30న పాకిస్తాన్‌తో పోరు

క్వీన్స్‌టౌన్ (న్యూజిలాండ్) : అండర్–19 ప్రపంచకప్‌లో యువభారత్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్‌ఫైనల్లో భాగంగా శుక్రవారం బంగ్లాదేశ్‌తో తలపడి 131 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పథ్వీ షా సారథ్యంలోని భారత్ జట్టు మంగళవారం పాకిస్తాన్‌తో సెమీస్‌లో తలపడనుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. షబ్‌మన్ గిల్(86), అభిషేక్ శర్మ(50) అర్ధసెంచరీలు సాధించారు. పృథ్వీ షా (40), దేశాయ్(34) రాణించారు. 266 పరుగులు లక్ష్యాన్ని ఛేదించలేక బంగ్లా 42.1 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో నాగర్‌కోటి 3 వికెట్లు పడగొట్టాడు. అభిషేక్ శర్మ, శివమ్‌మావి రెండేసి వికెట్లు తీశారు. అనుకుల్ రాయ్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.

నేడు ఐపిఎల్ వేలం

● **అందుబాటులో 578 క్రీడాకారులు**

బెంగళూరు : ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ ఉన్న క్రీడల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఒకటి. శనివారం సాయంత్రం ఐపిఎల్ వేలంలో పాల్గొనే 578 క్రీడాకారులను వివిధ ఫ్రాంచైజీలు కొనుగోలు చేసుకోనున్నాయి. ఈ వేలంలో ఏయే ఫ్రాంచైజీలు ఏ ఆటగాడిపై ఎన్నెన్ని కోట్లు వెచ్చించి కొనుగోలు చేయ నున్నాయో మరికొన్ని గంటల్లో తెలిసిపోనుంది.

ఆటపై దృష్టి పెట్టండి : ద్రావిడ్

పృథ్వీ షా నేతృత్వంలోని అండర్–19 జట్టులోని పలువురు ఆటగాళ్లు ఈ ఐపీఎల్ వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. దీంతో ఆటగాళ్లు తాము ఏ జట్టు తరఫున బరిలోకి దిగుతామో, ఎంతకి అమ్ముడుపోతామో, అసలు అమ్ముడుపోతామో లేదో అని ఆందోళన చెందుతున్నారు. వీరి పరిస్థితిని గమనించిన భారత అండర్–19 క్రికెట్ జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్‌కి కోపం వచ్చినట్లుంది. 'వేలంపై కాదు ఆటపై దృష్టి పెట్టండి' అని క్లాస్ పీకాడట. 'ఐపీఎల్ వేలం ఏటా జరుగుతోంది. కానీ, ఏటా ప్రపంచకప్‌లో ఆడే అవకాశం రాదు. ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాది అయినా మీరు ఐపీఎల్‌లో ఆడతారు. అప్పుడైనా వేలంలో పాల్గొనవచ్చు. ఇందులో మంచి ప్రదర్శన చేస్తే మీకు కచ్చితంగా స్థానం దక్కుతుంది' అని అన్నాడట.



ఫైనల్లో బొప్పన్న జోడీ

30వ సారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరిన ఫెదరర్
నేడు టైటిల్‌కై హెలెప్‌తో తలపడనున్న వాజ్నోంకీ

మెల్‌బోర్న్ : 5వ సీడ్ ఇండో–హంగరీ జోడీ బొప్పన్న–బార్బోస్‌లు 7–5, 5–7, 10–6 సెట్ల తేడాతో స్పెయిన్–బ్రెజిల్ జోడీ సాంఛెజ్–డెమొలినర్‌ల జోడీపై గెలిచి ఫైనల్లోకి ప్రవేశించారు. ఫైనల్లో 8వ సీడ్ కెనడా–క్రొయేషియా జోడీ డాబ్రొవెస్కీ, మ్యాట్ పావిక్ టైటిల్‌పోరుకై తలపడనున్నారు.



ఫైనల్‌కు ఫెదరర్

సంచలన విజయాలతో సెమీ ఫైనల్‌కు దూసుకు వచ్చిన దక్షిణ కొరియాకు చెందిన అన్‌సీడెడ్ హుయాన్ చంగ్ టోర్నీనుంచి నిష్క్రమించాడు. శుక్రవారం ప్రపంచ నెంబర్ 2 క్రీడాకారుడైన స్విట్జర్లాండ్‌కు చెందిన ఫెదరర్ చంగ్‌పై గెలిచి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తొలిసెట్‌ను 6–1తో గెలిచిన ఫెదరర్ రెండో సెట్‌లోనూ 5–2 ఆధిక్యతలో నిలిచిన సమయంలో చంగ్ తొడ కండరాలు పట్టేయడంతో అర్ధాంతరంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. దాంతో ఫెదరర్ పూర్తిగా మ్యాచ్ ఆడకుండానే గెలిచాడు. ఆదివారం జరిగే తుది పోరులో ఫెదరర్ 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కై మారిన్ సిలిచ్ తలపడనున్నాడు.

గుంటూరులో జాతీయ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి–కార్పొరేషన్(గుంటూరు)

గుంటూరు నగరంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో మారెళ్ల కైలాష్ మెమోరియల్ అఖిల భారత వాలీబాల్ పోటీల్లో తొలిగా సర్వీసెస్ టీమ్ ఢిల్లీ – ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ చెన్నై జట్లు తలపడ్డాయి. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో 3–0 పాయింట్లతో సర్వీసెస్ ఢిల్లీ జట్టు విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో కేరళ స్టేట్ ఎలక్ట్రిక్ బోర్ట్ – పశ్చిమ బెంగాల్ మధ్య, పురుషులు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చెన్నై – కేరళ స్టేట్ ఎలక్ట్రిక్ బోర్డు జట్లు తలపడ్డాయి. తొలుత క్రీడాకారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, నరసరావుపేట ఎంపి రాయపాటి శ్రీనివాసరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే మాకినేని పెదరత్తయ్య పరిచయం చేసుకున్నారు. జ్యోతి ప్రజ్వలన అనం తరం నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ తన స్నేహితుని గుర్తుగా ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలను రెండోసారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మాకినేని రత్తయ్య మాట్లాడుతూ నవ్యాంధ్రలో తొలిసారిగా గుంటూరులో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. టోర్నీ నిర్వాహకులు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గుంటూరు క్రీడలకు హబ్‌గా నిలుస్తుందన్నారు.



అసెంబ్లీ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ, అధికారిక ప్రాంతాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, శాసన మండలిలో చైర్మన్ ఎన్‌ఎమ్‌డి. ఫరూక్ జెండా ఎగురవేశారు. అనంతరం ఫరూక్‌తోపాటు శాసనసభ, మండలి ఉద్యోగులతో అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం చట్టసభల నిర్వహణ కష్టంగా మారిందని, అప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ కంటే గొప్పగా అమరావతిని అభివృద్ధి చేయడం ఖాయమన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ నవ్యాంధ్ర అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. పాలన సవ్యంగా సాగాలంటే ఉద్యోగుల సహకారం అవసరమన్నారు. త్వరలో అసెంబ్లీ, శాసనమండలి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతోపాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని కోడెల తెలిపారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులతోపాటు సంక్రాంతి , రిపబ్లిక్ డే ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. సచివాలయ సర్వీసెస్ విభాగం ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది సచివాలయంలో రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఎగురవేశారు.

చంద్రబాబు నివాసం వద్ద భువనేశ్వరి జెండా వందనం

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారిక నివాసంలో ఆయన సతీమణి నారా భువనేశ్వరి జెండా వందనం చేశారు. దావోస్ నుంచి శుక్రవారం ఉదయానికి తిరిగి అమరావతి చేరుకోవాల్సిన సిఎం అక్కడ ప్రతికూల వాతావరణం ఉండటంతో ఆయన ప్రయాణిస్తున్న విమానం అలస్యమై అనుకున్న సమయానికి చేరుకోలేకపోయారు. ఇక విజయవాడ సిఎం క్యాంపు కార్యాలయంలో సిఎంఒ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర జెండా ఎగురవేశారు. డిజిపి మాలకొండయ్య మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జెండా వందనం చేశారు.


జెండా వందనం చేస్తున్న సిఎం కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర

రాజ్యాంగ స్ఫూర్తికి అపహాస్యం :వైసిపి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ స్ఫూర్తి అపహాస్యం పాలవుతోందని శాసన మండలి విపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగ విలువల పట్ల ఏమాత్రం గౌరవం లేకుండా పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ విజయసాయిరెడ్డి, సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, వైఎస్ వివేకానందరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మలతో పాటు పలువురు నేతలు, పెద్దఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.

త్యాగాలకు సిద్ధం : పిసిసి

రాజ్యాంగ పరిరక్షణ కోసం త్యాగాలకు సిద్ధంగా ఉన్నామని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం నూలు ఒడికారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనునిత్యం రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయని విమర్శించారు. ఎపిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి, ఎం.జె రత్నకుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం: బిజెపి

దేశంలో పేదరిక నిర్మూలనే బిజెపి ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ అన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రభాగాన నిలిపేందుకు ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేశం, సమాజం ముఖ్యం: పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వ్యక్తులు, పార్టీల కన్నా దేశం, సమాజమే ఎంతో ముఖ్యమని జనసేన అధినేత పవన్ కల్యాన్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర పరిపాలన కార్యాలయంలో పవన్ కల్యాన్ జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఫస్ట్, ఇండియన్ లాస్ట్ అన్న అంబేద్కర్ మాటలు చాలా బలమైనవన్నారు. పద్మ అవార్డులు అందుకున్న శ్రీకాంత్, ఇళయరాజలతో పాటు పద్మ అవార్డులు అందుకున్న వారందరికీ పవన్ కల్యాన్ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారికి మరిన్ని అవార్డులు ప్రకటించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు.



సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 విజేత ఢిల్లీ

కలకత్తా : సయ్యద్ ముస్తాక్ ఆలీ టీ20 ట్రోఫీని ఢిల్లీ జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం రాజస్థాన్‌తో ఫైనల్లో తలపడిన ఆ జట్టు 41 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఢిల్లీ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసిం ది. ఉన్ముక్త్ చాంద్ 53 పరుగులు చేయగా... గంభీర్ 27 పరుగులు చేశాడు. అనంతరం రాజస్థాన్ 19.1 ఓవర్లలో 112 పరుగులు మాత్రమే చేసింది.

సింధూపై సైనా విజయం

జకార్తా: ప్రపంచ నెంబర్ 3 బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధుపై సైనా నెహ్వాల్ సంచలన విజయం నమోదు చేసింది. ఇండోనేషియా ఓపెన్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం క్వార్టర్‌ఫైనల్లో సింధూతో తలపడిన సైనా 21–13, 21–19 పాయింట్ల తేడాతో గెలుపొందింది. సైనా ఈ మ్యాచ్‌ను కేవలం 37 నిమిషాల్లోనే ముగించింది. ఈ విజయంతో టోర్నీలో సెమీస్‌కు చేరిన ఏకైక షట్లర్ భారతీయ షట్లర్ సైనానే. 2014 డిసెంబర్ నుంచి సింధుపై సైనా ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది.

దళితుల అభివృద్ధికి అండగా ఉంటా

దళితతేజం–తెలుగుదేశం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేంత వరకూ అండగా ఉంటానని టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. దళితతేజం–తెలుగుదేశం కార్యక్రమాన్ని ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రిపబ్లిక్ డే రోజున ఈ కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జగజ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. బాలయోగిని లోక్‌సభ స్పీకర్ పదవికి ఎంపిక చేశామన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను మూసేసిన హీన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. రాజశేఖర్ రెడ్డి హయాం లో కూడా ఎస్సీలకు ఒరిగిందేమీ లేదన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చంద్రన్న పెళ్లికానుక ద్వారా రూ.40 వేలు సహాయం అందిస్తామని తెలిపారు. త్వరలో బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తామ న్నారు. రాజధానిలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళిత విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవడానికి సహాయం చేస్తామన్నారు. వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ వర్ల రామయ్య, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టెలీ కంటి వైద్యం

● **ఫిబ్రవరి 1 నుంచి 60 సిహెచ్‌సిల్లో అమలు**
● **ఉచితంగా పరీక్షలు, కళ్లజోళ్లు**

ప్రజాశకి – అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 115 కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో (సిహెచ్‌సిల్లో) దశలవారీగా టెలీ ఆప్తమాలజీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీన తొలిదశగా 60 సిహెచ్‌సిల్లో ఈ సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో టెలీ మోడ్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభింపజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిపిపి పద్ధతిలో ఈసేవల నిర్వహణ బాధ్యతను అపోలో హెల్త్ కేర్ సంస్థకు అప్పగించారని సమాచారం. టెలీ ఆప్తమాలజీలో భాగంగా ప్రయివేటు భాగస్వామ్య సంస్థ ఫండస్ కెమెరా, ఆటో రిఫ్రాక్టర్, వివిధ రకాల కళ్లజోళ్ల డిజైన్లు అందిస్తుంది. సిహెచ్‌సిల్లో ఈ సేవలందించేందుకు, రోగుల అవసరాల మేరకు ఆన్‌లైన్‌లో ఫండస్ కెమెరాతో ఫోటోలు పంపేందుకు పారా ఆప్తమిక్ అసిస్టెంట్లకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. రోగులెవరైనా కంటి సమస్యపై సిహెచ్‌సికి వచ్చినప్పుడు వారి కంటిపాప ఇమేజ్‌ను ఫండస్ కెమెరాతో చిత్రీకరించి, స్పెషలిస్ట్ వైద్యులకు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. చెన్నైలో ఉన్న ఇ–ఆప్తమాలజీలో ఆ ప్రయివేటు సంస్థలో పనిచేస్తున్న స్పెషలిస్ట్ వైద్యులు రోగుల సమస్యను పరీక్షించి తగిన సూచనలు చేస్తారు. ఒకవేళ కంటికి సంబంధించిన ఏదైనా పెద్ద సమస్య ఉన్నా, శస్త్ర చికిత్స అవసరమైనా ఆ సేవలు అందించే ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. దృష్టి (సైట్) ఎంత ఉందో తెలుపుతూ ఆటో రిఫ్రాక్టర్‌తో తీసిన ఇమేజ్‌ను ఆన్‌లైన్‌లో స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షిస్తారు. సైట్‌కు తగిన కళ్లజోడు గ్లాసులు సూచిస్తారు. చివరిగా సిహెచ్‌సిలో అందుబాటులో ఉన్న కళ్లజోళ్ల డిజైన్‌ను రోగి ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. ఆ తర్వాత రోగి ఎంపిక చేసుకున్న కళ్లజోడు వారి సైట్‌కు తగిన గ్లాసులు ప్రయివేటు సంస్థ అందిస్తుంది. అది సిహెచ్‌సికి వచ్చిన తర్వాత పారా ఆప్తమిక్ సిబ్బంది వాటిని పరీక్షించి రోగికి సమాచారమిస్తారు. పది రోజుల్లో వారు కళ్లజోడును రోగికి అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.



ఒక్కో సేవకు రూ 185 నుంచి చెల్లింపు
ఈ సేవలకు ప్రభుత్వం ఒక్కో రోగికి కంటి వైద్యసేవలు, కళ్లజోడు రకాలు ఆధారంగా రూ 185 నుంచి రూ 270 వరకు అపోలోకు చెల్లిస్తుందని వైద్యఆరోగ్య శాఖాధికారులు తెలిపారు.

తాజ్‌మహల్‌లో శుక్రవారం ప్రార్థనలకు

ఆగ్రా ముస్లింలకు మాత్రమే అనుమతి



అగ్రా: తాజ్‌మహల్ ప్రాంగణంలో ఉన్న మసీదు వద్ద శుక్రవారాల ప్రార్థనల కోసం వచ్చే ముస్లింలు ఇక నుంచి తాము ఆగ్రవాసులమని నిరూపించే గుర్తింపు కార్డులను వెంట తీసుకెళ్ళాల్సి ఉంటుంది. లేకపోతే.. మసీదులోకి ప్రార్థనలకు అనుమతించరట. ఈ మేరకు జిల్లా యంత్రాంగం నోటీసు జారీ చేసింది. బంగ్లాదేశీ, భారతీయేతరులు మసీదులోకి వస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. ప్రపంచ స్థాయి గల ఈ స్మారక చిహ్నంలోనికి అటువంటి వ్యక్తుల ప్రవేశంతో భద్రతపై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ (సిటీ) కెపి సింగ్ పేర్కొన్నారు. తూర్పు, పశ్చిమ, దక్షిణ ద్వారాల వద్ద భద్రతా సిబ్బందిని నియమిస్తామనీ, ప్రతీ శుక్రవారం నవాజ్ కోసం మసీదులోకి ప్రవేశించే వ్యక్తుల గుర్తింపు కార్డులను వారు తనిఖీ చేస్తారని తెలిపారు. విదేశీయులూ ఈ మసీదులో శుక్రవారం ప్రార్థనలకు విదేశీయులపై నిషేధిస్తూ భారత పురావస్తు సర్వే (ఏఎస్‌ఐ) శాఖ 2013లో ఆదేశాలు జారీ చేసింది. ఇద్దరు బంగ్లాదేశీయులు అనుమానాస్పదంగా లోపలికి ప్రవేశించడంతో అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, ఆ నిబంధనలు సరిగా అమలు కాలేదనీ, ఇప్పటి నుంచి స్థానికులకు మాత్రమే అనుమతిస్తామనీ, ప్రార్థనలకు వచ్చే స్థానికులు తప్పనిసరిగా తమ ఐడీ కార్డులను వెంట తెచ్చుకోవాలనీ, లేకుంటే లోనికి అనుమతించబోమని తాజా ఉత్తర్వులో స్పష్టం చేశారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68